మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - శనివారం 19 ఏప్రిల్ 2025 | సంపుటి: 9 | సంచిక: 112 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

భగవద్గీతకు యునెస్కో గుర్తింపు

ఢిల్లీ, ఏప్రిల్ 18: భగవద్గీత, నాట్యశాస్త్రానికి యునెస్కో గుర్తింపు లభించింది. ఇది ప్రతి భారతీయుడు గర్వించదగిన విషయమని ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. భారతీయ సంస్కృతి, వారసత్వానికి చరిత్రాత్మక గుర్తింపు లభించింది. భగవద్గీత, భరతముని రచించిన నాట్యశాస్త్రానికి యునెస్కో మెమరీ ఆఫ్ వరల్ రిజిసర్‌లో చోటు లభించింది. ఈ విషయాన్ని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. దీనిపై ప్రధాని మోడీ హర్షం వ్యక్తం చేశారు. ఇది ప్రతి భారతీయుడు గర్వించదగిన విషయమని అన్నారు.

"భారతీయ జ్ఞాన సంపద, కళాత్మక ప్రతిభను యావత్ ప్రపంచం గౌరవిస్తోంది. ఈ రచనలు మన దేశంపై ప్రపంచ దృక్పథానికి, మన జీవన విధానానికి పునాదులు. ఇప్పటివరకు మన దేశం నుంచి 14 శాసనాలు.. యునెస్కో రిజిస్టర్లో చోటు దక్కించుకున్నాయి" అని కేంద్రమంత్రి తన

...మిగతా 2లో

'రోహిత్ వేముల' చట్టం: రాహుల్ గాంధీ

9

హైదరాబాద్‌లో 'ఏఐ' సెంటర్



రూ. 10,500కోట్ల పెట్టుబడులకు ఒప్పందం

రూ. 560కోట్లతో రుద్రారంలో తోషిబా మరో కొత్త ఫ్యాక్టరీ

జపాన్ పర్యటనలో రెండోరోజు మనోళ్ల దూకుడు

ప్రపంచస్థాయి పెట్టుబడులకు కేరాఫ్ అడ్రస్ తెలంగాణః సీఎం రేవంత్

హైదరాబాద్, మనం బ్యూరో: హైదరాబాద్‌కు పెట్టుబడుల వరద పారుతుంది. జపాన్ పర్యటనలో ఉన్నా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బృందం దూకుడు రెండో రోజు కూడా కొనసాగింది. భారీ పెట్టుబడులకు ఒప్పందాలు కుదుర్చుకున్నారు. డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్, ఐటీ సర్వీసుల్లో ప్రపంచంలో పేరొందిన ఎన్‌టీటీ డేటా, ఏఐ ఫస్ట్ క్లౌడ్ ప్లాట్ ఫాం సంస్థ నెయిసా నెట్‌వర్క్స్ సంయుక్తంగా హైదరాబాద్‌లో ఏఐ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటుకు ముందుకొచ్చాయి. తెలంగాణ ప్రభుత్వంతో కలిసి దాదాపు రూ.10,500 కోట్ల పెట్టుబడితో ఈ క్లస్టర్ ఏర్పాటుకు త్రైపాక్షిక ఒప్పందం జరిగింది. టోక్యోలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సమక్షంలో ఎన్‌టీటీ డేటా, నెయిసా నెట్‌వర్క్స్ నుంచి బోర్డు సభ్యుడు కెన్ కట్సుయామా, డైరెక్టర్ తడావోకి నిషిమురా, ఎన్టీటీ గ్లోబల్ డేటా సెంటర్స్ ఇండియా ఎండి అలోక్ బాజ్‌పాయ్, నెయిసా సీఈవో, ఎన్టీటీ గ్లోబల్ డేటా చైర్మన్ షరద్ సంఘీ ఈ ఒప్పందంలో పాల్గొన్నారు. దేశంలో అతిపెద్ద ఏఐ కంప్యూట్ మౌలిక సదుపాయం హైదరాబాద్‌లో నిర్మించబోయే

...మిగతా 2లో

తెలంగాణలో బెంగాల్ పరిస్థితులు

మజ్లిస్ సభ కాంగ్రెస్ స్పాన్సర్డ్ ప్రోగ్రాం

జరగబోయే పరిణామాలకు ప్రభుత్వానిదే బాధ్యత

కేంద్ర మంత్రి బండి సంజయ్ హెచ్చరిక



హైదరాబాద్, మనం బ్యూరోః తెలంగాణలో బెంగాల్ తరహా పరిస్థితులు వచ్చే ప్రమాదం ఉందని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆందోళన వ్యక్తం చేశారు. వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా మజ్లిస్ నిర్వహిస్తున్న సభ కాంగ్రెస్ స్పాన్సర్డ్ ప్రోగ్రాం అనీ, జరగబోయే పరిణామాలకు రేవంత్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. శుక్రవారం నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేవంత్ ఆర్థిక సహకారంతోనే ఎంఐఎం వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా ఎంఐఎం ఆందోళన చేస్తోందనీ, ఆ పార్టీకి కాంగ్రెస్ దూరంగా ఉండాలని రాహుల్ చెప్పడం పెద్ద జోక్‌గా పేర్కొన్నారు. లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంఐఎంకు వ్యతిరేకంగా ఓటేసి చిత్తశుద్ధి నిరూపించుకుంటారా ? కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్పొరేటర్లారా మీ అంతరాత్మ ప్రకారమే ఓటేయండి అని పిలుపునిచ్చారు. ఓటింగ్‌కు దూరంగా ఉంటే హైదరాబాద్ ప్రజలు మిమ్మల్ని

...మిగతా 2లో

భూ భారతిలో 7లక్షల ఎకరాలకు పరిష్కారం

- అబాదీ ఇళ్లకూ డాక్యుమెంట్లు ఇస్తాం
- త్వరలో టోల్ ఫ్రీ నెంబర్
- గిరిజన ప్రాంత సమస్యలపై కమిటీ
- ఇందిరమ్మ ప్రభుత్వాన్ని పడగొడితే ప్రజలు తిరగబడతారు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ఇందిరమ్మ ఇళ్ల అవకతవకలపై పొంగులేటి సీరియస్

2

తప్పుడు సమాచారం పై కన్నెర్ర తక్షణ చర్యలకై డీపీవోకు ఆదేశాలు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బిల్ కలెక్టర్ పై వేటు

2

భారీ.. వర్ష బీభత్సం

హైదరాబాద్‌లో ఉరుములు, మెరుపులతో వర్షం

నగరం జలమయం

విద్యుత్‌కు తీవ్ర అంతరాయం...

పలు జిల్లాలకు వర్ష సూచన



హైదరాబాద్, మనం ప్రతినిధిః తెలంగాణలో పలు జిల్లాలు, పట్టణాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ వర్షం దాటికి పలు జిల్లాల్లో పంట నష్టం వాటిల్లగా.. మరికొన్ని చోట్ల పట్టణ ప్రాంతాలన్ని పూర్తిగా జలమయమయ్యాయి. వర్షకాలాన్ని తలపించేలా శుక్రవారం నాడు భారీ వర్షం కురిసింది. ఇక, తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లోని అబిడ్స్, నాంపల్లి, బంజారాహిల్స్, మాదాపూర్, చైతన్యపురి, దిల్‌సుఖ్‌నగర్, వనస్థలిపురం, గాంధీభవన్, కార్వాన్, కుత్బుల్లాపూర్, మియాపూర్, గచ్చిబౌలి, నానక్‌రామ్‌గూడ, సికింద్రాబాద్,

...మిగతా 2లో

విద్యుత్‌కు తీవ్ర అంతరాయం...

హైదరాబాద్‌లో భారీ వర్ష పాతం నమోదైంది. ఉరుములు, మేరుపులతో ఇదురుగాలులు వీయడంతో భారీ వృక్షాలు నెలకొరిగాయి. భారీ వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలన్ని జలమయం కాగా... ఓ వైపు విరిగి పడిన చెట్లు, మరోవైపు రోడ్లపైకి వచ్చి చేరిన నీటి కారణంగా పలు ప్రాంతాల్లో గంటల తరబడి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. తెలంగాణ సెక్రేట్రియేట్ చుట్టుపక్కల సైతం పూర్తిగా

...మిగతా 2లో

పారదర్శకతకు పాతర..

గ్రూప్-1ను రద్దు చేయండి

గ్రూప్-1 నియామాకాలపై అనుమానాలు

సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్సీ కవిత బహిరంగ లేఖ

పరీక్షలు మళ్లీ నిర్వహించాలని డిమాండ్

హైదరాబాద్, మనం ప్రతినిధిః ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి.. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బహిరంగ లేఖ రాశారు. గ్రూప్-1 పరీక్షలను రద్దు చేసి, తిరిగి నిర్వహించాలని ఆమె డిమాండ్ చేశారు. గ్రూప్-1 పరీక్షల నిర్వహణలో ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా నిరుద్యోగుల జీవితాలు అగాధంలోకి నెట్టివేయబడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ నియామకాల్లో పారదర్శకత, జవాబుదారీతనం లోపించాయని ఆరోపించారు. గ్రూప్-1 పరీక్ష నిర్వహించిన తీరు, ఫలితాల వెల్లడిపై అభ్యర్థుల్లో అనేక సందేహాలు కలుగుతున్నాయని అన్నారు. ప్రిలిమ్స్, మెయిన్‌కు వేర్వేరు హాల్ టిక్కెట్ నెంబర్ల కేటాయింపుతో గందరగోళం నెలకొందని అన్నారు. మెయిన్‌కు 21,075 మంది హాజరు కాగా, ఫలితాలు ప్రకటించేసరికి 10 మంది అభ్యర్థులు పెరిగారని, ఈ సంఖ్య ఎలా పెరిగిందని ప్రశ్నించారు. బయోమెట్రిక్ హాజరు విధానం అమలు చేసినప్పటికీ అభ్యర్థుల హాజరు విషయంలో వ్యత్యాసం ఉందని కవిత అన్నారు. అందరు అభ్యర్థులు నిజంగా పరీక్షకు హాజరయ్యారా? లేదా వారిని మధ్యలో చేర్చారా? అని కవిత నిలదీశారు. తమకు ఆ మూల్యాంకనంపైనా సందేహాలు ఉన్నాయని కవిత ఆ లేఖలో పేర్కొన్నారు. ప్రముఖ విశ్వవిద్యాలయాల అధ్యాపకులతో వాల్యుయేషన్ చేయిస్తామని టీజీపీఎస్సీ ప్రకటించినప్పటికీ, విశ్రాంత అధ్యాపకులతో చేయించారని ఆమె ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా 45 కేంద్రాలలో పరీక్షలు నిర్వహిస్తామని ప్రకటించిన టీజీపీఎస్సీ, ఆ తర్వాత

...మిగతా 2లో

వారిద్దరే హీరోలు.. ఔరంగజేబు కాదు: రాజ్‌నాథ్ సింగ్

ఛత్రపతి శంభాజీనగర్,ఏప్రిల్ 18: మేవాడ్ పాలకుడు మహారాణా ప్రతాప్, ఛత్రపతి శివాజీ మహారాజ్.. ఇద్దరూ నిజమైన జాతీయ హీరోలని కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ కొనియాడారు. అంతేగానీ, మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు కాదన్నారు. మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో ఏర్పాటు చేసిన మహా రాణాప్రతాప్ విగ్రహాన్ని సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాజ్నాథ్ సింగ్ మాట్లాడుతూ.. ధైర్యం, దేశభక్తికి మహారాణా ప్రతాప్ ప్రతిరూపమన్నారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ గెరిల్లా యుద్ధ వ్యూహాలకు మహారాణా ప్రతాప్ నుంచే ప్రేరణ పొందారని తెలిపారు.భారత స్వాతంత్ర్యానంతరం చరిత్రకారులు రాణా ప్రతాప్, శివాజీ మహారాజ్‌కు తగినంత గుర్తింపు ఇవ్వలేదని రాజ్‌నాథ్ సింగ్ ఈ

...మిగతా 2లో

కిషన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి రాజాసింగ్ డుమ్మా

- పార్టీలో కషాయం
- హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికపై సమావేశం
- కొంత కాలంగా కిషన్ రెడ్డికి, రాజాసింగ్‌కు మధ్య విభేదాలు!

హైదరాబాద్, మనం ప్రతినిధిః తెలంగాణలో రాబోయేది డబుల్ ఇంజన్ సర్కార్ అని చెప్పున్న కషాయ పార్టీకి.. గడ్డు పరిస్థితులు ఉన్నట్లు కనిపిస్తోంది.. పార్టీలో ేతల తీరు చూస్తుంటే... సీనియర్లు వర్సెస్ జూనియర్లు, పాత, కొత్త నేతల నడుమ ఎదో జరుగుతున్నట్లు కనిపిస్తోంది. తమని కాదని ముందుకు వెళ్లేవారిని కొందరి సీనియర్ నేతలు తొక్కుతున్నారని, కుట్రలు చేస్తున్నారని మాటల యుద్ధం నడుస్తోంది. గత కొద్ది రోజుల నుంచి బీజేపీ రాష్ట్ర నాయకత్వానికి, ఎమ్మెల్యే రాజాసింగ్‌కు మధ్య దూరం పెరుగుతున్నట్టే కనిపిస్తోంది. ఇటీవల

...మిగతా 2లో

నెల వ్యవధిలోనే.. 1000 మంది విదేశీ విద్యార్థుల వీసాలు రద్దు!

వాషింగ్టన్, ఏప్రిల్ 18: గడిచిన కొన్ని వారాల్లోనే 1000 మందికిపైగా విదేశీ విద్యార్థుల వీసా లేదా వారి చట్టబద్ధ హోదాలను అమెరికా రద్దు చేసినట్లు సమాచారం.

అక్రమ వలసదారులపై కఠినంగా వ్యవహరిస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్. విదేశీ విద్యార్థులపైనా ఉక్కుపాదం మోపుతున్నారు. గడిచిన కొన్ని వారాల్లోనే 1000 మందికిపైగా విదేశీ విద్యార్థుల వీసా లేదా వారి చట్టబద్ధ హోదాలను రద్దు చేసినట్లు సమాచారం. దీంతో ట్రంప్ యంత్రాంగం తీరుపై అనేక మంది విద్యార్థులు న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారు. వీసా రద్దు చేసే క్రమంలో ఫెడరల్ ప్రభుత్వం సరైన రీతిలో వ్యవహరించడం లేదని వాదిస్తున్నారు.

వీసాలను రద్దు చేస్తూ ఫెడరల్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో వందలాది విదేశీ విద్యార్థులకు నిర్బంధం, డిపోర్టేషన్ ముప్పు పొంచి ఉంది. హార్వర్డ్, స్టాన్ఫర్డ్, యూనివర్సిటీ ఆఫ్ మేరీల్యాండ్, ఒహాయో స్టేట్ యూనివర్సిటీ సహా కొన్ని చిన్న కాలేజీల విద్యార్థులు ఈ ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నారు. మొత్తంగా మార్చి చివరి వారం నుంచి ఇప్పటివరకు 160 కాలేజీల నుంచి సేకరించిన వివరాల ప్రకారం.. కనీసం 1024 మంది విద్యార్థుల వీసాలు రద్దు అయినట్లు అసోసియేటెడ్ ప్రెస్ అంచనా వేసింది. ఇదే సమయంలో

...మిగతా 2లో

50 శాతం భారతీయ విద్యార్థులే

ఢిల్లీ, ఏప్రిల్ 18: అమెరికా ప్రభుత్వం రద్దు చేసిన 327 వీసాల్లో 50 శాతం భారతీయ విద్యార్థులవేనని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ పేర్కొన్నారు.ఈ మేరకు 327 వీసా రద్దు కేసులు తమకు అందినట్లు అమెరికన్ ఇమిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్ తాజాగా ప్రకటన జారీ చేసింది. ఈ విషయంపై

...మిగతా 2లో

నేడు.. వీహెచ్‌పీ దేశ వ్యాప్త సమ్మె

వక్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తూ బెంగాల్‌లో హింసాత్మక ఘటనలు

బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని వీహెచ్‌పీ డిమాండ్

అన్ని రాష్ట్రాల్లోని వీహెచ్‌పీ సభ్యులు, మద్దతుదారులు పాల్గొనాలని పిలుపు

హైదరాబాద్, మనం ప్రతినిధిః రేపు దేశ వ్యాప్త సమ్మెకు విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) పిలుపునిచ్చింది. వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా

...మిగతా 2లో

రూ. 10,500కోట్ల పెట్టుబడులకు ఒప్పందం

(మొదటి పేజీ తరువాయి)

ఈ సదుపాయం 400 మెగావాట్ల డేటా సెంటర్ క్లస్టర్, 25000 ల జీపీయూలతో దేశంలోనే అత్యంత శక్తివంతమైన ఏఐ సూపర్ కంప్యూటింగ్ మౌలిక సదుపాయాలను సమకూరుస్తుంది. దేశంలో తెలంగాణను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రాజధానిగా మార్చాలనే లక్ష్యానికి అనుగుణంగా ఈ ప్రాజెక్ట్ రూపుదిద్దుకుంటుంది. ఎన్‌టీటీ డేటా, నెయిసా కంపెనీలు సంయుక్తంగా ఏఐ ఫస్ట్ సొల్యూషన్‌ను అభివృద్ధి చేసేందుకు ఈ క్లస్టర్ కొత్త ఆవిష్కరణల కేంద్రంగా అందరి దృష్టిని ఆకర్శిస్తుంది. ఈ భారీ పెట్టుబడుల ఒప్పందంపై సీఎం రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పారిశ్రామిక విధానాలు పెట్టుబడులను ఆకర్శిస్తున్నాయని అన్నారు. నమ్మకమైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా, సింగిల్ విండో అనుమతులను ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. వీటితో పాటు రాష్ట్రంలో ప్రతిభావంతులైన నిపుణులు అందుబాటులో ఉండటంతో పాటు ఏఐ సంబంధిత డిజిటల్ సేవల్లో రాష్ట్రం అగ్రగామిగా నిలుస్తుందన్నారు. ఎడబ్ల్యుఎస్, ఎస్‌టీటీ, టిల్‌మన్ హోల్డింగ్స్, సీటీఆర్ఎస్ఎస్‌వంటి పెద్ద కంపెనీల డేటా సెంటర్ ప్రాజెక్టుల వరుసలో ఎన్‌టీటీ భారీ పెట్టుబడుల ఒప్పందంతో దేశంలో ప్రముఖ డేటా సెంటర్‌గా హైదరాబాద్ స్థానం మరింత బలపడిందని అన్నారు.

రుద్రారంలో తోషిబా కొత్త ఫ్యాక్టరీ

తోషిబా కార్పొరేషన్ అనుబంధ సంస్థ టీటీడీఐ తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ముందుకొచ్చింది. విద్యుత్ సరఫరా, పంపిణీ రంగంలో పెట్టుబడులు, ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వంతో ఎంవోయూ కదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం హైదరాబాద్ సమీపంలోని రుద్రారంలో టీటీడీఐ సర్జ్ అరెస్టర్స్ తయారీ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తుంది. వీటితో పాటు పవర్ ట్రాన్స్ఫార్మర్స్, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ఫార్మర్స్ గ్యాస్ ఇన్సులేటెడ్ స్విచ్‌గేర్ తయారీ సామర్థ్యాన్ని విస్తరించడానికి ఇప్పటికే అక్కడ ఉన్న ఫ్యాక్టరీలను అప్‌గ్రేడ్ చేయనుంది. ఈ ప్రాజెక్టుకు రూ.562 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నారు. అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించే ఈ కొత్త ఫ్యాక్టరీ విద్యుత్ రంగంలో పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడంతో పాటు ఉద్యోగ అవకాశాలను కల్పిస్తుంది. కాగా, రుద్రారంలో ఇప్పటికే రెండు కంపెనీలను విజయవంతంగా నిర్వహిస్తున్న టీటీడీఐ, ఈ కొత్త పెట్టుబడితో మూడో ఫ్యాక్టరీ నెలకొల్పనుంది. ప్రస్తుతం ఉన్న ఈ ఫ్యాక్టరీల సామర్థ్యాన్ని విస్తరించనుంది. టోక్యోలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సమక్షంలో తోషిబా కార్పొరేషన్ ఎనర్జీ బిజినెస్ డైరెక్టర్ హిరోషి కనెటా, ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్, టీటీడీఐ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ హిరోషి పురుటా ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఆర్థిక పరివర్తనలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ముందు వరుసలో ఉందన్నారు. పరిశ్రమల భాగస్వామ్యాలు, వ్యూహాత్మక సహకారాలతో అన్ని రంగాల్లో ప్రపంచ పెట్టుబడిదారులను ఆకర్షిస్తోందని అన్నారు. కొత్త పెట్టుబడులకు తోషిబా చేసుకున్న ఒప్పందం పారిశ్రామిక రంగంలో కొత్త ఉత్సాహాన్నిస్తుందని పేర్కొన్నారు. కాగా, టీటీడీఐ చైర్మన్ హిరోషి పురుటా తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న పారిశ్రామిక విధానాలు తమను ఆకట్టుకున్నాయన్నారు. కొత్త ఆవిష్కరణల పట్ల ప్రభుత్వానికి ఉన్న నిబద్ధత తెలంగాణను పెట్టుబడుల గమ్యస్థానంగా మార్చుతున్నాయని అన్నారు. తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ఉత్సాహంతో ఉన్నట్లు వెల్లడించారు.

భగవద్గీతకు యునెస్కో గుర్తింపు

(మొదటి పేజీ తరువాయి)

పోస్ట్‌లో వెల్లడించారు. దీనిపై ప్రధాని మోడీ స్పందిస్తూ ''ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతి భారతీయుడు గర్వించదగ్గ విషయం. గీత, నాట్యశాస్త్రాన్ని యునెస్కో రిజిస్టర్‌లో చేర్చడం.. మన జ్ఞాన సంపద, సంస్కృతికి లభించిన ఘనమైన గుర్తింపు. ఇవి శతాబ్దాలుగా మన నాగరికత, ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందించాయి. ప్రపంచానికి స్ఫూర్తిని స్తూనే ఉన్నాయి'' అని సంతోషం వ్యక్తం చేశారు. యుద్ధరంగంలో సోదరులు, గురువులు, బంధు జనులందరినీ చూసి ధనుర్బాణాలు విడిచి చతికిల పడిపోయిన అర్జునుడికి శ్రీకృష్ణుడు చేసిన బోధ- భగవద్గీత. మనుషులు ప్రవర్తించవలసిన తీరు, పారలౌకికాన్ని పొందే తెన్నూ రెండింటినీ శ్రీకృష్ణుడు బోధించాడు.

నెల వ్యవధిలోనే.. 1000 మంది విదేశీ
విద్యార్థుల వీసాలు రద్దు!

(మొదటి పేజీ తరువాయి)

డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ చర్యలకు వ్యతిరేకంగా కోర్టుల్లో దావాలు వేస్తున్న విద్యార్థులు.. తమ వీసా రద్దు చేయడానికి ప్రభుత్వం వద్ద ఎటువంటి సమర్థనీయ అంశాలు లేవని వాదిస్తున్నారు.

ఎందుకు రద్దు చేస్తున్నారు?

వీసా రద్దుకు అనేక కారణాలు చూపెడుతున్నప్పటికీ.. చిన్న ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడిన ఘటనలే ఎక్కువగా ఉన్నాయని గుర్తించినట్లు కాలేజీలు పేర్కొంటున్నాయి. మరికొన్ని కేసుల్లో మాత్రం విద్యార్థులను ఎందుకు లక్ష్యంగా చేసుకున్నారనే విషయంపై స్పష్టత లేదు. ''ఈ వీసాలను రద్దు చేస్తున్న సందర్భం, విధానం చూస్తుంటే.. దేశవ్యాప్తంగా భారీ సంఖ్యలో విద్యార్థి వీసాలను రద్దు చేసే విధానాన్ని డీహెచ్ఎస్ అవలంబిస్తుందనే ప్రశ్న తలెత్తుతోంది'' అని మిషిగాన్ యూనివర్సిటీ తరఫున వాదిస్తున్న లాయర్లు తమ పిటిషన్‌లో పేర్కొన్నారు.

వీసా రద్దైతే..?

విద్యార్థి వీసా రద్దైతే.. ఇమిగ్రేషన్ అధికారులు నిర్బంధించే ప్రమాదం ఉంది. అందుకే అరెస్టుకు భయపడిన కొందరు విద్యార్థులు చదువులు పూర్తి చేయకుండానే దేశం విడిచి వెళ్తున్నట్లు సమాచారం. ఇలా వీసా రద్దు, అరెస్టు చేయడం వంటి చర్యలు.. విదేశీ విద్యార్థులను అమెరికా చదువుల పట్ల నిరుత్సాహానికి గురిచేస్తాయని విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భారీ.. వర్ష బీభత్సం

(మొదటి పేజీ తరువాయి)

గాంధీ ఆసుపత్రి, మెట్టుగూడతో పాటు పలు ప్రాంతాల్లో భారీ వర్ష పాతం నమోదైంది. పలు ప్రాంతాల్లో గంటల తరబడి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కార్యాలయాల నుంచి ఇళ్లకు వెళ్లే సమయం కావడంతో ''మనం ప్రతినిధి'' వారిని పలుకరించగా.. అటువైపుగా వస్తున్న పలువురు ఉద్యోగులు, వాహనదారులు ట్రాఫిక్ జామ్ కారణంగా తీవ్ర అసౌకర్యానికి గురయ్యామని చెప్తారు. ఇదిలాఉంటే, మరోమారు రాష్ట్రం లోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, వికారాబాద్, నాగర్ కర్నూలు, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

విద్యుత్‌కు తీవ్ర అంతరాయం...

(మొదటి పేజీ తరువాయి)

అందకారమైంది. వీఐపీ, వీవీఐపీ జోన్, సెంట్రల్ జోన్ భారీ మల్టీ స్టోర్స్ వాణిజ్య సముదాయాల భవనాలు ఉన్నాయి. అయినప్పటికి ఇక్కడ గంటల తరబడి విద్యుత్ లేక.. చిమ్మ చీకట్లను తలపించాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందుకు గురయ్యారు. విద్యుత్ లేక కొంతమంది రోగులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యామని సైఫాబాద్‌కు చేందిన ఒక ప్యామిలి వారి భాదలు చెప్పింది. అధికారులకు ఫోన్ చేసిన స్పందించలేదని, 24 గంటలు ఎమర్జెన్సి నెంబర్లలో కొందరు అధికారులు, ఇన్‌చార్జ్‌లు సైతం వారి ఫోన్లు రింగ్ అయిన కూడా అసలు ఎత్తనేలేదని, కొన్ని ఫోన్లు బ్లాక్‌లో పెట్టారని, కొందరు అధికారులు అసలు ఎత్తిన కూడా మాట్లాడలేదని వారు వాపోయారు. సెక్రేట్రియేట్ సమీప ప్రాంతంలో నిత్యం 24 గంటలు ఉండాల్సిన విద్యుత్.. తీవ్ర అంతరాయం... అంధకారం ఏర్పడటంతో పలువురు ఆవేధన వ్యక్తం చేశారు.

భూభారతిలో 7లక్షల ఎకరాలకు పరిష్కారం

హైదరాబాద్, మనం బ్యూరోః గత బీఆర్ఎస్ ప్రభుత్వం కుట్రపూరితంగా పార్ట్-బిలో పెట్టిన 18 లక్షల ఎకరాలలో 7 లక్షల వరకు వ్యవసాయ భూములు ఉన్నాయనీ, ఈ భూములకు భూ భారతి చట్టంతో పరిష్కారం చూపిస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెల్లడించారు. శుక్రవారం ములుగు జిల్లా వెంకటాపూర్‌లో మంత్రులు కొండా సురేఖ, సీతక్కతో కలిసి భూ భారతి పైలెట్ ప్రాజెక్టును ప్రారంభించారు. ఆ తరువాత ఆదిలాబాద్ జిల్లా భోరజ్ మండలం పుసాయ్ గ్రామంలో భూ భారతి చట్టంపై జరిగిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ పేదల కన్నీటిని తుడిచేందుకే భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామన్నారు. ఎన్నికలకు ముందు ధరణిని బంగాళాఖాతంలో వేస్తామని మేము ఇచ్చిన హామీని ప్రజలు విశ్వసించి ప్రజలు ఇందిరమ్మ రాజ్యాన్ని తెచ్చుకున్నారని పేర్కొన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో భూ సమస్యలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తామని స్పష్టం చేశారు. ప్రజలను ఇబ్బంది పెట్టకుండా రైతులకు సేవలు అందిస్తామనీ, రైతులు తమ భూ సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికే చెప్పులు అరిగేలా అధికారుల చుట్టూ రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగారనీ, ఇప్పుడు ఇంకా ఆ అవసరం రైతులకు లేదని అధికారులే రైతుల వద్దకు వచ్చి వారి భూ సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ధరణిపై గత పాలకులు ఏనాడు కూడా రెవెన్యూ సదస్సులు పెట్టలేదనీ, ఒకవేళ రెవెన్యూ సదస్సులు పెట్టి ఉంటే ఆనాడే ప్రభుత్వంపై ప్రజలు తిరగబడేవారని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ పాలకులు చేసిన తప్పులను ఇప్పటికీ గ్రహించడం లేదనీ, వారికి ఇంకా జ్ఞానోదయం కలగడం లేదని వ్యాఖ్యానించారు. గతంలో గులాబీ దళం కోసం కేసీఆర్ 2020 ధరణి చట్టాన్ని తీసుకొస్తే మేం దానిని బంగాళాఖాతంలోకి విసిరేసి సామాన్య ప్రజల కోసం 2025-భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని వెల్లడించారు. రాష్ట్రంలో ఇంతవరకు డాక్యుమెంట్లు లేని ఆబాదీ ఇల్లు అని పిలుచుకునే నివాసగృహాలకు డాక్యుమెంట్లు ఇచ్చే దిశగా చర్యలు చేపడుతున్నామన్నారు. ధరణి దళారులు, గులాబీ పార్టీ గులాములు ఇచ్చే డబ్బుతో ఇందిరమ్మ ప్రభుత్వాన్ని పడగొడితే మీరు ఊరుకుంటారా ? అని మంత్రి పొంగులేటి ప్రశ్నించగా, ఊరుకోం అని ప్రజల నుంచి స్పందన వచ్చింది. భూ భారతి సమస్యల పరిష్కారానికి గాను తమ కార్యాలయం, సీసీఎల్ఏ కార్యాలయంను అనుసంధానించే టోల్‌ఫ్రీ నెంబరును త్వరలో ప్రజలకు తెలియజేస్తామని చెప్పారు. గిరిజన, గిరిజనేతరులు ఉండే ప్రాంతంలో భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఒక కమిటీని నియమిస్తామని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.

50 శాతం భారతీయ విద్యార్థులే

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ పార్టీ ఆందోళన వ్యక్తంచేసింది. అమెరికా ప్రభుత్వం రద్దు చేసిన వీసాల్లో 50 శాతం భారతీయ విద్యార్థులవేనని ఆ పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ పేర్కొన్నారు. ఈ అంశాన్ని కేంద్ర విదేశాం గశాఖ మంత్రి జై శంకర్ అమెరికా దృష్టికి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. అమెరికన్ ఇమిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్‌కు అందిన నివేదికల ప్రకారం ప్రభుత్వం రద్దు చేసిన 327 వీసాల్లో 50శాతం భారతీయులు ఉన్నారని.. అయితే వారి వీసా రద్దుకు సరైన కారణాలు పేర్కొనలేదని జైరాం రమేశ్ పేర్కొన్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఆందోళన వ్యక్తంచేస్తున్నారని అన్నారు. ఇటువంటి చర్యల వల్ల విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. నివేదిక ప్రకారం.. వీసాలు రద్దు చేసిన విద్యార్థుల్లో 50శాతం మంది భారత్‌కు చెందినవారు కాగా 14శాతం మంది చైనా దేశీయులు. తర్వాతి స్థానాల్లో దక్షిణ కొరియా, నేపాల్, బంగ్లాదేశ్ విద్యార్థులు ఉన్నారు. దీనిపై ఇమిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్ మాట్లాడుతూ.. డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్ , ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అంతర్జాతీయ విద్యార్థులను లక్ష్యంగా చేసుకున్నాయని పేర్కొంది. ఈవిషయంపై భారత విదేశాంగ శాఖ నుంచి ఎటువంటి స్పందన లేదు. చట్టబద్ధమైన పత్రాలు లేని విద్యార్థులను దేశం నుంచి బహిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పలుమార్లు పేర్కొన్నారు. విదేశాంగ శాఖ తీసుకున్న ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ విదేశీ విద్యార్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అకస్మాత్తుగా వీసాలు రద్దు చేయడంతో చదువులు కొనసాగించలేకపోతున్నామని.. తమ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. కాగా నిరసన కార్యక్రమాలలో పాల్గొనని వారి వీసాలు కూడా రద్దయినట్లు కళాశాలలు పేర్కొంటున్నాయి. వీసాల రద్దుకు అధికారులు సరైన కారణాలు కూడా తెలియజేయట్లేదని విద్యార్థులు వాపోయారు.

ఇందిరమ్మ ఇళ్ల అవకతవకలపై పొంగులేటి సీరియస్

హైదరాబాద్,మనం బ్యూరోః రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పథకంలో అవకతవకలకు పాల్పడే ఎలాంటి వారినైనా ఉపేక్షించేది లేదని రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి బేస్మెంట్ స్థాయి వరకు నిర్మాణం జరుగకుండానే పూర్తయిందని తప్పుడు సమాచారాన్ని అప్‌లోడ్ చేసిన బిల్ కలెక్టర్ జగదీష్‌పై వెంటనే తగిన చర్యలు తీసుకోవాలన్న మంత్రి పొంగులేటి ఆదేశాల మేరకు బిల్ కలెక్టర్ జగదీష్‌ను విధుల నుండి తొలగిస్తూ జిల్లా పంచాయతీ అధికారి శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. భద్రాచలం గ్రామ పంచాయతీ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి 18 మంది లబ్ధిదారులు బేస్మెంట్ వరకు నిర్మాణం పూర్తి చేశారనే తప్పుడు సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేశారనీ, దీనిపై సంబంధిత బిల్ కలెక్టర్‌కు మెమో జారీ చేయగా, పొరపాటున ఈ సమాచారాన్ని అప్‌లోడ్ చేయడం జరిగిందని సంజాయిషీ ఇవ్వగా ఆ బిల్ కలెక్టర్‌ను ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి వెల్లడించారు. కాగా, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన విధుల నిర్వహణలో ఏ విధమైన అలసత్వం వహించే ఎంతటి వారైనా సహించేది లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

తెలంగాణలో బెంగాల్ పరిస్థితులు

(మొదటి పేజీ తరువాయి)

క్షమించబోరని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పాలనలో చేసిన వక్ఫ్ చట్టం అత్యంత ఘోరమైనదనీ, టైటిల్ ఉన్న వాళ్ల భూములు కూడా వక్ఫ్‌కు ధారాదత్తమయ్యాయని పేర్కొన్నారు. ఆలయాలు, గురుద్వారా, క్రైస్తవ, మత్స్యకారుల, లింగాయత్ సాగు భూములను కూడా వక్ఫ్ పేరుతో ఆక్రమించుకున్నారని ఆరోపించారు. ఆఖరుకు పార్లమెంట్ కూడా వక్ఫ్ పరిధిలో ఉందంటూ అవాకులు పేలుతున్నారని ఈ సందర్భంగా బండి సంజయ్ విమర్శించారు.

నేడు.. వీహెచ్‌పీ దేశ వ్యాప్త సమ్మె

(మొదటి పేజీ తరువాయి)

పశ్చిమ బెంగాల్ లోని పలు ప్రాంతాల్లో ఘర్షణలు చెలరేగిన సంగతి తెలిసిందే. ముర్షిదాబాద్ అల్లర్లలో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా పెద్ద సంఖ్యలో గాయపడ్డారు. ఈ హింసాత్మక ఘటనలను వీహెచ్‌పీ ఖండించింది. బెంగాల్‌లో తక్షణమే రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేసింది. బెంగాల్ హింసాత్మక ఘటనలకు వ్యతిరేకిస్తూ దేశ వ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చింది. ఈ మేరకు వీహెచ్‌పీ అధ్యక్షుడు అలోక్ కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు, అన్ని జిల్లాల్లోని వీహెచ్‌పీ సభ్యులు, మద్దతుదారులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. బెంగాల్‌లో ఎమర్జెన్సీ విధించాలని డిమాండ్ చేస్తూ అన్ని జిల్లాల మేజిస్ట్రేట్లకు మెమోరాండం సమర్పించాలని చెప్పారు.

కిషన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి
రాజాసింగ్ డుమ్మా

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర మంత్రి బండి సంజయ్ రాజాసింగ్‌ను కలిసి బుజ్జగించారు. కొలిక్కి వచ్చిందనుకున్న వ్యవహారం.. తాజాగా బీజేపీలో అసంతృప్తి మరోసారి బయటపడింది. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అధ్యక్షతన హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికపై శుక్రవారంనాడు జరిగిన సమావేశానికి రాజాసింగ్ డుమ్మా కొట్టారు. హైదరాబాద్‌లో బీజేపీకి ఉన్న ఏకైక ఎమ్మెల్యే ఈ సమావేశానికి గైర్హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది. కొన్ని రోజులుగా కిషన్ రెడ్డికి, రాజాసింగ్ మధ్య విభేదాలు కొనసాగుతున్నట్టు పార్టీలో అంతర్గతంగా చర్చ జరుగుతోంది. అన్ని కులాలు, వర్గాలకు ప్రాధాన్యత ఇచ్చే పార్టీ బీజేపీ అని... కానీ, పార్టీ రాష్ట్ర నాయకత్వం కేవలం ఒక వర్గానికి మాత్రమే ప్రాధాన్యత ఇచ్చేలా రాజకీయాలు చేస్తోందని రాజాసింగ్ అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర అధ్యక్ష హోదాలో ఉన్న కిషన్ రెడ్డి కొందరికే ప్రాధాన్యత ఇస్తున్నారని ఇటీవల ఆయన వ్యాఖ్యానించారు. కొన్నేళ్లుగా పార్టీలో సీనియర్లు పేరుకుపోయారని... వారిని వెంటనే పార్టీ నుంచి పంపిస్తే తప్ప పరిస్థితిలో మార్పు రాదని ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.

గ్రూప్-1ను రద్దు చేయండి

(మొదటి పేజీ తరువాయి)

ఒక కేంద్రాన్ని పెంచిందని గుర్తు చేశారు. రెండు పరీక్ష కేంద్రాల్లో మెయిన్స్ పరీక్షలకు హాజరైన రెండు కోచింగ్ సెంటర్లకు చెందిన 71 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు అర్హత సాధించడం వెనుక ఏదో జరిగిందని అభ్యర్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారని కవిత పేర్కొన్నారు. ఆ రెండు పరీక్ష కేంద్రాల్లోని 71 మంది ఉద్యోగాలకు ఎంపికైనది నిజమేనని టీజీపీఎస్సీ కూడా అంగీకరించిందని వెల్లడించారు. అభ్యర్థుల ఆందోళన నేపథ్యంలో హైకోర్టు నియామక ప్రక్రియకు బ్రేక్ వేసిందని గుర్తు చేశారు.

ఔరంగజేబు కాదు: రాజ్‌నాథ్ సింగ్

(మొదటి పేజీ తరువాయి)

సందర్భంగా విమర్శించారు. ఔరంగజేబును మాత్రం ప్రశంసించారని పేర్కొన్నారు. ఔరంగజేబును హీరోగా భావించేవారు అతడి క్రూరత్వం, ఛాందసవాదంపై పండిట్ జవహర్లాల్ నెహ్రూ రాసిన పుస్తకం చదివాలని సూచించారు. మహారాణా ప్రతాప్ తన ఆత్మగౌరవం కోసం తన జీవితాన్నే త్యాగం చేశారని కొనియాడారు. అక్బర్ ఆధిపత్యాన్ని సవాల్ చేశారని.. అన్నివర్గాల ప్రజలను ఏకం చేసి తన ధైర్యసాహసాలకు మారుపేరుగా నిలిచారన్నారు.

గాలిమాటలు వద్దు

- దమ్ముంటే రాజీనామా చేయాలి...
- మల్‌రెడ్డికి మంచిరెడ్డి సవాల్
- మంత్రి పదవి రాకుంటే రాజీనామా చేస్తానని గాలిమాటలు చెప్పడం కాదు?
- నీకు పదవి ధ్యాస తప్ప అభివృద్ధి ఆలోచన లేదు?
- నియోజకవర్గ అభివృద్ధికి ఒక్క రూపాయి తీసుకు రాలేదు : కిషన్ రెడ్డి

హైదరాబాద్, మనం ప్రతినిధిః మంత్రి పదవి రాకపోతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చెబుతున్నారని, అయితే గాలి మాటలు మాని దమ్ముంటే రాజీనామా చేయాలని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. రంగారెడ్డికి మంత్రి పదవిపైనే ధ్యాస ఉందని, ప్రజలు, నియోజకవర్గం అభివృద్ధి గురించి ఆయనకు ఆలోచన లేదని విమర్శించారు. ఇబ్రహీంపట్నం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మంత్రి పదవి కోసం ఏడాదిన్నరగా ఢిల్లీ పెద్దల చుట్టూ తిరుగుతూ సమయం వృథా చేస్తున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలు ఆయనకు పట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులు తప్ప కాంగ్రెస్ వచ్చాక చేసింది ఏమీ లేదని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకురాలేని మల్‌రెడ్డి రంగారెడ్డి లాంటి వ్యక్తిని ఎమ్మెల్యేగా గెలిపించుకోవడం నియోజకవర్గ ప్రజల దురదృష్టమని అన్నారు. మల్రెడ్డి రంగారెడ్డి అభివృద్ధిని పక్కన పెట్టి ఢిల్లీ చుట్టూ, గాంధీ భవన్ చుట్టూ తిరుగుతున్నారని దుయ్యబట్టారు. నియోజకవర్గంలోని సమస్యలు పరిష్కరించాలనే కనీస ఆలోచన కూడా ఆయనకు లేదని అన్నారు.

ఆ 10 మంది ఎలా పెరిగారు?

- గ్రూప్-1 పరీక్షల ఫలితాలు వచ్చేసరికి 10 మంది ఎలా పెరిగారు?: రాకేశ్ రెడ్డి
- హైకోర్టు తీర్పు పోరాడిన అభ్యర్థుల విజయం : రాకేశ్ రెడ్డి

హైదరాబాద్, మనం ప్రతినిధిః గ్రూప్-1 పరీక్ష ఫలితాలలో ఆ 10 మంది అభ్యర్థులు ఎలా పెరిగారని బీఆర్ఎస్ నేత రాకేశ్ రెడ్డి ప్రశ్నించారు. ఈ పరీక్షలకు సంబంధించి తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు టీజీపీఎస్సీకి చెంపపెట్టులాంటిదని ఆయన వ్యాఖ్యానించారు. ధర్మానిదే అంతిమ విజయమని హైకోర్టు తీర్పు ద్వారా స్పష్టమైందని ఆయన అన్నారు. హైకోర్టు తీర్పు... పోరాడిన అభ్యర్థుల విజయమని, వారికి అండగా నిలిచిన బీఆర్ఎస్‌కు నైతిక విజయమని ఆయన పేర్కొన్నారు. మెయిన్‌కు 21,075 మంది హాజరు కాగా, ఫలితాలు ప్రకటించే సమయానికి 21,085 మంది అభ్యర్థులు ఉన్నారని... మరి ఈ అభ్యర్థుల సంఖ్య ఎలా పెరిగిందో చెప్పాలని టీజీపీఎస్సీని రాకేశ్‌రెడ్డి నిలదీశారు.

చారిత్రక కట్టడాలను పరిరక్షించుకుందాం

- అందరం కలసికట్టుగా ఉద్యమించాలని పిలుపు
- చుట్టూ ఉన్న అక్రమ కట్టడాలతోనే చార్మినార్‌కు దక్కని వారసత్వ హోదా
- అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని పిలుపు
- వాటిని భవిష్యత్ తరాలకు అందించాల్సి బాధ్యత అందరిపై ఉంది: ట్రస్ట్ చైర్మన్ వేదకుమార్

హైదరాబాద్, మనం ప్రతినిధిః హైదరాబాద్‌లోని అనేక వారసత్వ కట్టడాలు ఇతరుల చేతుల్లోకి వెళ్లిపోయాయని డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ వేదకుమార్ అన్నారు. చారిత్రక కట్టడాల చుట్టూ 100 మీటర్ల వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దనే నిబంధనలు ఉన్నప్పటికీ... అక్రమ నిర్మాణాలను చేపడుతున్నారని ఆయన చెప్పారు. ప్రపంచ వారసత్వ హోదాకు చార్మినార్‌కు అన్ని అర్హతలు ఉన్నప్పటికీ... చుట్టూ ఉన్న అక్రమ నిర్మాణాల కారణంగా అది సాకారం కావడం లేదని తెలిపారు. చార్మినార్ ప్రాంతంలో పురాతన కట్టడాలకు ముప్పు వాటిల్లేలా వాటి చుట్టూ నిర్మాణాలు సాగుతున్నాయని వేదకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. లాడ్ బజార్, సర్దార్ మహల్, చార్ కమాన్ చుట్టు కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని చెప్పారు. వరల్డ్ హెరిటేజ్ డేను పురస్కరించుకుని చార్మినార్ వద్ద ఆయన హెరిటేజ్ వాక్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పురాతన కట్టడాలు చారిత్రక ఆనవాళ్లని చెప్పారు. వాటిని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. చారిత్రక కట్టడాలను పరిరక్షించుకునేందుకు అందరం కలసికట్టుగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

భవద్గీత అధ్యాయనమండలి శ్రీశ్రీశ్రీ విశ్వ స్ఫూర్తి గురువు ఆధ్వర్యంలో సాధన శిబిరం

మంచిర్యాల, 18, ఏప్రిల్, (మనం న్యూస్): మంచిర్యాల రామ్ నగర్ లో భవద్గీత అధ్యాయనమండలి శ్రీశ్రీశ్రీ విశ్వ స్ఫూర్తి గురువు ఆధ్వర్యంలో సాధన శిబిరాన్ని శుక్రవారం ప్రారంబించారు .ఈ సాధన శిబిరాన్ని మూడు రోజుల పాటు నిర్వహించడం జరుగుతుందని నేటి 18 నుంచి 20 వ తేదీ వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు ఈ సాధన శిబిరం లో మంచిర్యాల ప్రాంతం నుంచె కాకుండా హైదరాబాద్, వరంగల్, భద్రాచలం ,తదితర ప్రాంతాలనుంచి కూడా హాజరు అయ్యారు . సాధన శిబిరం ఇన్చార్జిలు గుండ శ్రీనివాస్, ప్రతాప్, రాజి రెడ్డి , వెంకట్ రెడ్డి లు ఈ సాధన శిబిరం యొక్క ముఖ్య ఉద్దేశాలను తెలిపారు . మూడు రోజులపాటు కొనసాగే ఈ శిబిరం పూర్తిగా మానవ జీవనశైలిలో మార్పుకు తీసుకురావడం కోసం ఏర్పాటు చేయడం జరిగిందని, శిబిరంలో ముఖ్యంగా యోగ, మెడిటేషన్, సాత్వికమైన ఆహారం, మానవ జీవన విధానం ఏ విధంగా ఉండాలి, ఎలా మనం దానిని అలవాటు పంచుకోవాలి, అనే వాటిపై పూర్తి మార్పును తీసుకురావడం కోసం శ్రీశ్రీ విశ్వ స్ఫూర్తి గురువు కుటుంబ పరిహారంలో ఈ శిబిరాలను ఏర్పాటు చేసినట్లు త్లిపారు . ఈ సాధన శిబిరం ప్రతి సంవత్సరం జరుగుతుందని, శిబిరాలలో పాల్గొన్న వ్యక్తులు చక్కటి జీవనశైలి విధానాన్ని ఆహారాలను, మనకున్న అలవాట్లను మార్చుకోవాలనే ఈ విధమైన ఆలోచనలను మనం ఏర్పాటు చేసుకోవాలనవి పూర్తిగా నేర్చుకోవడం జరుగుతుందన్నారు ప్రత్యేకం గా పురుషులు, మహిళలు 14 సంవత్సరాలు పైబడిన వారందరూ పాల్గొనవచ్చని ప్రత్యేకంగాఏర్పాటు చేయడం జరిగిందన్నారు . ఈ మూడు రోజులపాటు నియమ నిబంధనాలతో శిక్షణను పొందడం జరుగుతుందని, శిక్షణ అనంతరం కూడా వీటిని ఏమనిబంధనాల్లో శ్రీశ్రీ విశ్వ స్ఫూర్తి దాయక కుటుంబం గా వారు నియమాలను పాటిస్తూ వారి యొక్క జీవన శైలిలో మార్పును పొందడం జరుగుతుందని,అత్యున్నతమైన జీవనశైలి విధానాలను, అత్యున్నతమైన ఆలోచన విధానాలను, అత్యున్నతమైన సమస్యల పరిష్కారాల జీవన విధానాలను చాలా సంక్లిష్టంగా స్పష్టంగా సునర్వ్చితంగా సరళంగా అర్థమయ్యే విధంగా స్ఫూర్తి ఇన్చార్జిగా ప్రతాప్ శ్రీశ్రీ విశ్వ అందిస్తు, నిర్వర్తిస్తూ సేవలందిస్తున్నందు కు ప్రత్యేక ధన్యవాదాలన్నారు. ఇలాంటి శిబిరాలను ఏర్పాటు చేయడం మంచిర్యాల ప్రాంతంలో ప్రత్యేకంగా ప్రజలు మార్పు తీసుకు రావడం కోసం శ్రీ శ్రీ విశ్వస్ఫూర్తి కుటుంబం పరివారహం వారికి ప్రత్యేక ధన్యవాదాలన్నారు .

క్రీస్తు శిలువ యాగంతోనే మానవాళికి పాప విముక్తి

నూతన అపోస్తులిక సంఘం ప్రీస్ట్ బి.సిమోన్

చేవెళ్ల, ఏప్రిల్ 18 (మనం న్యూస్) : క్రీస్తు శిలువ యాత్ర యాగంతోనే మానవాళికి పాప విముక్తి కలిగిందని ప్రీస్ట్ బి. సిమోన్ అన్నారు. శుక్రవారం గుడ్ ఫ్రైడే సందర్భంగా నూతన అపోస్తులిక సంఘం ప్రీస్ట్ సిమోన్ ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .... ఎంతో అద్భుతంగా జరుపుకుంటున్న గుడ్ఫ్రైడే ద్వారా ఏసు క్రీస్తూ శిలువలో పలికిన ఏడు మాటలు ద్వారా క్షమా గుణం, బాధ్యత, ప్రేమ, పాప'పు ఒప్పుకోలు, దయ గుణాలను అలవర్చుకోవాలన్నారు. పాపుల కోసమే ఏసూ క్రీస్తు ఈ లోకంలో జన్మించి, శిలువలో రక్తం చిందించి ప్రాణాలు అర్పించినట్లు తెలిపారు. పాపపు జీవితాన్ని వదలి క్రీస్తు చూపిన మార్గంలో నడిచి పరలోకం చేరాలని బోధించారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ధర్మ పరిరక్షణ ధ్యేయంగా పలువురికి ఆదర్శంగా నిలిచిన ఆచార్యులు

సుల్తానాబాద్, ఏప్రిల్ 18 (మనం న్యూస్): సత్ సంప్రదాయ పరిరక్షణ సభ పేరిట ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తో పాటు దక్షన భారతదేశంలోని అనేకమంది పండితులకు శిక్షణ ఇచ్చిన మహనీయుడు శ్రీరంగం నల్లాన్ చక్రవర్తుల శ్రీనివాస రఘునాథ ఆచార్యులవారనీ సుల్తానాబాద్ వికాస తరంగిణి కోఆర్డినేటర్ సాదుల సుగుణాకర్ అన్నారు. ఆచార్య రఘునాథచార్యుల శత తిరునక్షత్ర జయంతి వేడుకలను పురస్కరించుకొని సుల్తానాబాద్ పట్టణంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.. వికాస తరంగిణి ప్రజ్ఞ కోఆర్డినేటర్, రిటైర్డ్ ప్రభుత్వ ప్రధాన ఉపాధ్యాయురాలు శ్రీరంగం నల్లాన్ చక్రవర్తుల వనజ వెంకటరమణ దంపతుల నివాసంలో శుక్రవారం రఘునాథ చారుల వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించి నివాళులర్పించారు. ఆయన ధర్మ పరిరక్షణ కోసం సంప్రదాయ పరిరక్షణ కోసం చేపట్టిన కార్యక్రమాలను, వారు రచించిన గ్రంథాలను ప్రస్తావిస్తూ ఆయన సేవలను కొనియాడారు. రఘునాథ ఆచార్యుల వారి శతజయంతి ఉత్సవాల పురస్కరించుకొని ఈనెల 20న వరంగల్లో ఏర్పాటు చేస్తున్న సభలో చిన్న జీయర్ స్వామి వారు పాల్గొంటున్నారని పలువురు పండితులకు రఘునాథ చార్ల వారి పురస్కారాలను ప్రదానం చేస్తారని సుగుణాకర్ తెలిపారు అనంతరం పలువురు భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో అన్నమనేని సప్న, సుగుణ, ధనలక్ష్మి, భాగ్యలక్ష్మి, సునీత, చిట్టక్క తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ కార్యక్రమాలపై సమీక్షా సమావేశం

రామగిరి, ఏప్రిల్ 18 మనం న్యూస్: అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్ట్ గని సంక్షేమాధికారితో పాటు ఏరియా పర్సనల్ విభాగం అధికారులతో సంక్షేమ కార్యక్రమాలపై శుక్రవారం జి.యం. కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశానికి అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు హాజరై దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో భాగంగా ముందుగా గని సంక్షేమాధికారి వివిధ కారణాలతో ఉద్యోగ విరమణ పొందిన విశ్రాంత ఉద్యోగులకు సంబంధించిన టర్మినల్ బెనిఫిట్స్, కారుణ్య నియామక ఉద్యోగాల కల్పన, పదోన్నతులు, క్రమశిక్షణాచర్యలు లాంటి అంశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరాలు అందించారు. తదుపరి జి.యం. మాట్లాడుతూ సంక్షేమానికి సంబంధించి దరఖాస్తులు స్వీకరించిన వెంటనే తగినచర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా టర్మినల్ బెనిఫిట్స్ చెల్లింపులు, కారుణ్య నియామక ఉద్యోగాల కల్పనలో జాప్యం కాకుండా చూడాలన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం విశ్రాంత ఉద్యోగులకు అమలు చేస్తున్న వైద్యసేవల పథకానికి సంబంధించి విశ్రాంత ఉద్యోగులకు అవగాహన కల్పించి దరఖాస్తులు అందజేసేవిధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఉద్యోగుల సంక్షేమం పట్ల సంక్షేమాధికారులు అంకిత భావంతో పనిచేయాలని కోరారు. గ్రాట్యుటీ, సి.ఎం.పి.ఎఫ్. నామినేషన్ పత్రాలు ఉండేలా చూసుకోవాలన్నారు. ఉద్యోగుల సర్వీసు విషయాలకు సంబంధించి పలు సలహాలు, సూచనలు అందించారు. ఈ సమావేశంలో ఎస్వోటుజియం బండి సత్య నారాయణ, ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రవీణ్.వి.ఫాటింగ్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, అధికారులు గుర్రం శ్రీహరి, వి.సునీల్ ప్రసాద్, యం.డి.మతీన్ హుస్సేన్, పి.రాజేశం, ఎల్.రవిచంద్ర, సురేష్, కార్యాలయ సిబ్బంది రాజు, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

మల్లాపూర్, ఏప్రిల్ 18 (మనం న్యూస్): మండలంలోని కుస్తాపూర్, రత్నాపూర్ గ్రామాలలో ఐకెపి ఆధ్వర్యంలో. నిర్వహిస్తున్న వరిధాన్య కొనుగోలు కేంద్రాలను శుక్రవారం కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఆరుగాలం రైతులు కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకవచ్చి అమ్ముకోవాలన్నారు. దళారీలకు విక్రయించి మోసాలకు గురికావద్దని ఆయన తెలిపారు. రైతులకు కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు కలుగనీయకుండా సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

పంట మార్పిడి పద్దతులు పాటించాలి

- కందవాడలో రైతులకు అవగాహన కల్పించిన కొండ లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయ విద్యార్థులు

చేవెళ్ల, ఏప్రిల్ 18(మనం న్యూస్): రైతులు పంట మార్పిడి పద్ధతులను ఉపయోగించాలని ఆచార్య కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయ (మోజర్ల) విద్యార్థులు తెలిపారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని కందావాడలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో రైతులు సాగు చేస్తున్న పంటలను పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమై పంట మార్పిడి వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. ఒకే రకమైన పంటలను దీర్ఘకాలం పాటు సాగు చేయడం వల్ల పంటలను చీడపీడలు ఎక్కువగా ఆశిస్తాయని తెలిపారు. పంట మార్పిడి వల్ల రైతులకు ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని వివరించారు. ఉద్యాన విద్యార్థులు స్వాతి, ప్రీతి, అఖిల, లావణ్య, శారద, సంతోష, సానియా తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టాని వెనక్కి తీసుకోవాలి

- సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట రెడ్డి

నల్లగొండ- ఏప్రిల్ 18(మనం ప్రతినిధి): కేంద్రంలోమోడిప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ బోర్డు సవరణ చట్టం మైనార్టీ వర్గాలకు తీరని అన్యాయం జరుగుతుందని వెంటనే చట్టం సవరణను వెనక్కి తీసుకోవాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట రెడ్డి కేంద్ర ప్రభుత్వాని డిమాండ్ చేశారు. సిపిఐ నల్లగొండ జిల్లా సమితి కౌన్సిల్ సమావేశం శుక్రవారం స్థానిక మగ్దుం భవన్ లో జరిగింది . సమావేశానికి పల్లా వెంకట రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు సవరణ చట్టంనికి వ్యతిరేకంగా రాష్ట్రంలో ఉన్న ప్రజా స్వామ్యవాదులు, మేధావులు, ఉద్యమకారులను అన్నివర్గాల ప్రజలు కేంద్రప్రభుత్వ నిరంకుశ వైఖరికి పోరాటాల ద్వారా ఎండగట్టాలని పిలుపునిచ్చారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి సంపన్న వర్గాలకు దేశ సంపదను కట్టబెట్టడం కాకుండా వారికి అనుకూలమైన చట్టాలను తీసుకొచ్చి పేద ప్రజల పై ధరలు పనుల భారం మోపుతుందని ఆరోపించారు. రాష్ట్రంలో ఒకవైపు రేవంత్ రెడ్డి ప్రభుత్వం 500 రూపాయలు గ్యాస్ పై రాయితీ ఇస్తుంటే కేంద్రప్రభుత్వం 50 రూపాయలు గ్యాస్ ధర పెంచడం సిగ్గుచేటు అన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో భూ సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ధరణిని ఎత్తివేసి భూ భారతి తీసుకురావడం జరుగుతుందని ఈ భూ భారతి ద్వారా నైనా కొన్ని ఏళ్ల నుండి ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలు పరిష్కారం చేసేందుకు కృషి చేయాలని కోరారు.

వరి ధాన్యం కొనుగోలు వేగమంతం చేయాలి :ఏ మ్మెల్సీ నెల్లికంటి సత్యం

వాతావరణం మార్పుల వల్ల వడగాలులతో కురుస్తున్న అకాల వర్షాల వలన ఆరుగాలాలు రైతులు కష్టపడి పండించిన పంటలు పూర్తిగా దెబ్బతినిపోయాయని వెంటనే సర్వే చేసి నష్ట పరిహారం అందించేందుకు చర్యలు చేపట్టాలని సిపిఐ జిల్లా కార్యదర్శి,ఏ మ్మె ల్సీ నెల్లికంటి సత్యం ప్రభుత్వ అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చిన వరి ధాన్యం కొనుగోలు వేగమంతం చేయాలన్నారు. సిపిఐ గ్రామ శాఖ, మండల సమితి మహాసభలు మే, జూన్ మాసంలో జిల్లా వ్యాప్తంగా ఉత్సాపూరితంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సమావేశానికి జిల్లా కార్యవర్గ సభ్యులు బొడ్డుపల్లి వెంకటరమణ అధ్యక్షత వహించగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహా రెడ్డి, సీనియర్ నాయకులు మల్లెపల్లి ఆదిరెడ్డి,ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నరసింహ,సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్ రెడ్డి లోడంగి శ్రవణ్ కుమార్,జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి,ఆర్ అంజయ్య చారి, బులుగూరి నరసింహ,టి వెంకటేశ్వర్లు,నలపరాజు రామలింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫార్చ్యూన్ టయోటా కార్స్ ఆఫర్స్ గ్రామీణ మహోత్సవం షోరూం

- ముఖ్యఅతిథిగా టి పి సి సి ప్రధాన కార్యదర్శి కొత్త కుర్మ శివకుమార్

తుర్కయంజాల్, ఏప్రిల్ 18(మనం న్యూస్): నాగార్జున కాలనీ,రాగన్న గూడ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ప్రక్కన 18,19వ తేదీలో ఫార్చ్యూన్ టయోటా కార్స్ ఆఫర్స్ గ్రామీణ మహోత్సవ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టి పి సి సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త కుర్మ శివకుమార్, మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొత్త కుర్మ మంగమ్మ శివకుమార్, విచ్చేసి రిబ్బన్ కట్ చేసి ఓపెన్ చేశారు. ఫార్చ్యూన్, టయోటా, షోరూం షేర్ గూడ, నాగారం బ్రాంచ్ జనరల్ మేనేజర్ మధుసూదన్ మాట్లాడుతూ, ఇందులో కొత్త కార్ డిస్ప్లే గ్లాంజా, టైసర్, రూమియన్, హైర్డర్, ఇన్నోవా మరియు ఎక్స్ఛేంజ్ మేళా, సర్వీస్ క్యాంపు ఉంటుందని వారు అన్నారు. ఈ రెండు రోజులలో స్పాట్ బుకింగ్ ఆఫర్లో కస్టమర్లు 1 లక్ష 40 వేల రూపాయలు ప్రయోజనాలను పొందవచ్చని, స్పాట్ బుకింగ్ చేసుకున్న వారు అదనంగా పదివేల రూపాయలు డిస్కౌంట్ పొందుతారని వారన్నారు. టయోటా కార్ల ఎక్స్‌షోరూమ్ ధర 6 లక్షల 86 వేల నుండి ప్రారంభమవుతుంది. కార్ల కొనుగోలుదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో, ఫార్చ్యూన్ టయోటా వైస్ ప్రెసిడెంట్ రమణ, జనరల్ మేనేజర్ మధుసూదన్, మార్కెటింగ్ హెడ్ శైలేందర్, మార్కెటింగ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కళామాతల్లి ఆశీస్సులతో మునుముందు ఆస్కార్ అవార్డు పొందుతా

- 20 ఏళ్ల చలనచిత్ర సీమలో సేవలందించినందుకు గాను డాక్టరేట్ అవార్డు మే నెల 31న అందుకోనున్నారు
- నటులు అండ్ డైరెక్టర్ వినయ్ బాబు

INTERNATIONAL PEACE UNIVERSITY

Approved by Senate
Date :17.04.2025

MEMORANDUM
To : Mr/Ms/ Mrs. MUKKERA VINAY BABU
Proposed Doctorate : DOCTOR OF ARTS [FILM MAKER]
Ref : MAY/2025/ Univ / Con /Confer
Letter Subject : Conferring Letter- Doctor of Honours
Date :17.04.2025

Conferring Doctor of Honours

We are pleased to inform you that in receipt of your application and profile has been approved by the management of INTERNATIONAL PEACE UNIVERSITY after scrutinizing your profile and application, we have decided to felicitate you with HONOURARY DOCTORATE in the category of DOCTOR OF ARTS [FILM MAKER] on the occasion of University's Convocation which will be held on May - 31st - 2025 at Ooty South India.

Convocation program details will be informed shortly
wishing you All The best

With Regards,

SUPPORTED BY

చిగురు మామిడి, ఏప్రిల్ 18 (మనం న్యూస్): కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల పరిధిలోని కొండాపూర్ గ్రామానికి చెందిన ఎం వినయ్ బాబు చిన్నతనం నుండి సినిమా మక్కువతో,నటుడుగా ఎదగాలనే పట్టుదలతో చలనచిత్ర పరిశ్రమలో 20 ఏళ్లుగా అలుపెరుగని సేవలు అందించినందుకు గాను డాక్టరేట్ అవార్డు ప్రకటించినందుకు చాలా సంతోషంగా ఉందని అన్నారు చిత్ర పరిశ్రమలో ఎవరు తక్కువ ఎవరు ఎక్కువ కాదని అందరూ పట్టుదలతో శ్రమించి తన గమ్యాన్ని చేరుకుంటారని చెప్పుకొచ్చారు ఇప్పుడు నేను చేసే సినిమా అన్ని ఆనందంగా ఉన్నదని నటులు అలాగే డైరెక్టర్ వినయ్ బాబు అన్నారు కళామతల్లి ఆశీస్సులతో మునుముందు ఆస్కార్ అవార్డు పొందడమే తమ ధ్యేయమని వెల్లడించారు ఈ అవార్డుతో నాపై బాధ్యతలు ఇంకా పెరిగిపోయాయని చెప్పారు ఇప్పుడు నేను చేస్తున్న సినిమా 100% పెద్ద కమర్షియల్ హిట్ గా నిలవాలని పట్టుదలతో అన్ని జాగ్రత్తలతో ప్లాన్ చేస్తున్నామని కళామతల్లి అనుగ్రహంతో చిత్ర పరిశ్రమలో అనేక సేవలు, అందించినందుకు,ఈ డాక్టర్ రావడం చాలా వివరాలు అధికారికంగా త్వరలో ప్రకటిస్తానని ఇప్పటికే సాంగ్స్ రికార్డు పూర్తి చేసుకుని షూటింగ్ సిద్ధంగా ఉన్నామని అని వెల్లడించారు సరియైన అవకాశం సపోర్ట్ ప్రొడ్యూసర్ ఉంటే కథా బలం సక్సెస్ ఫుల్ గా ఉంటే తప్పకుండా విజయాలు సాధిస్తామని ధీమా వ్యక్తపరిచారు ఎవరు నిరుత్సాహ పడవద్దని ప్రయత్నిస్తూ మరణిస్తే గెలిచినట్టేనని ప్రయత్నం విరమిస్తే బతికున్న సచ్చినట్టే లెక్క అనే వినయ్ బాబు వెల్లడించారు ఏది ఏమైనా మంచి హిట్ తో ప్రజల ముందుకు రావాలని నా ధ్యేయం అని అన్నారు.

సుక్మా జిల్లాలో 22 మంది మావోయిస్టుల లొంగుబాటు

చర్ల, ఏప్రిల్ 18 (మనం న్యూస్) : ఛత్తీస్‌ఘడ్‌లో మావోయిస్టులకు గట్ట ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పటికే వరుస ఎన్ కౌంటర్లతో సహచరులను కోల్పోతున్న మావోయిస్టులకు లొంగుబాట్లు కలవరపాటుకు గురిచేస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో తీవ్ర నిర్బంధం నేపథ్యంలో నిత్యం పదుల సంఖ్యలో మావోయిస్టులు లొంగిపోతున్నారు. తాజాగా శుక్రవారం సుక్మా జిల్లాలో 40 లక్షల రివార్డు కలిగిన 22 మంది మావోయిస్టులు జిల్లా ఎస్ పి కిరణ్ చవాన్ ఎదుట లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో 9 మంది మహిళలు, 13 మంది పురుషులు ఉన్నారు. లొంగిపోయిన వారంతా మాడ్ డివిజన్ కమిటీకి చెందిన వారని ఎస్ పి వెల్లడించారు. సుక్మా జిల్లాలో ప్రవేశ పెట్టిన నెల్ నార్ పథకం పట్ల ఆకర్షితులై వారంతా జనజీవన స్రవంతిలో కలిసారని ఎస్ పి తెలిపారు. లొంగిపోయిన వారందరికీ పునరావాస పథకం క్రింద ఆర్థిక సహాయం అందచేయనున్నట్లు తెలిపారు.

కురుమ సంఘం నూతన భవనం ప్రారంభం

- దొడ్డి కొమరయ్య ఆశయ సాధన కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలి
- తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ చింపుల సత్యనారాయణ రెడ్డి

చేవెళ్ల, ఏప్రిల్ 18(మనం న్యూస్): తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య ఆశయ సాధన కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ చింపుల సత్యనారాయణ రెడ్డి అన్నారు. చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని దేవుని ఎర్రవల్లి వార్డులో నూతనంగా నిర్వహించిన కురుమ సంఘం భవనాన్ని ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం నూతన భవనంను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరుడు, తెలంగాణ హక్కుల సాధనకు విశేష కృషి చేసిన దొడ్డి కొమురయ్య మనందరికీ ఆదర్శం అన్నారు .అనిరజాకార్లను గ్రామాల్లోకి రాకుండా, దొరల పెత్తనాన్ని అడ్డుకోవడానికి దుడ్డుకర్రల సంఘం పెట్టి పోరాడిన గొప్ప యోధుడు దొడ్డి కొమురయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ చేవెళ్ల సీనియర్ నాయకులు దేశముల ఆంజనేయులు , దేవుని ఎర్రవల్లి కురుమ సంఘం అధ్యక్షుడు కరికే సత్యనారాయణ సంఘం ఉపాధ్యక్షులు అంగరెల్లి రాజు, ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్, మాజీ సర్పంచ్ కంకంటి శ్యామలయ్య, చంద్రయ్య, మల్లేష్, పత్తి సత్యనారాయణ, ఎదురే రాములు,కరికే శ్రీనివాస్, వెంకటరెడ్డి, నరసింహ, నవీన, రవి పాల్గొన్నారు.

నిమిత్తమాత్రుడివై...

దేవుడి పాదాలపైన పూలు వుంచడానికే
నీవు నిమిత్తమాత్రుడివై... గుడికి వెళ్ళకు;
అంతకన్నా ముందుగా-
నీ ఇంటిని ప్రేమపరిమళంతో నింపుకో!
దేవుడి సన్నిధిలో దీపాలు వెలిగించడానికే
నీవు నిమిత్తమాత్రుడివై... గుడికి వెళ్ళకు;
అంతకన్నా ముందుగా-
నీ హృదయంలో పాపతిమిరాన్ని
తొలగించుకో!
తలవంచి వినయంగా ప్రార్థించడానికే
నీవు నిమిత్తమాత్రుడివై... గుడికి వెళ్ళకు;
అంతకన్నా ముందుగా-
నీవు కిందికి వంగి
అణచివేతకు గురై లేవలేనివారిలో ఒకరిని
చేయూత నిచ్చి పైకి లేపు!

చేసిన పాపాలకు క్షమాపణ అడగడానికే
నీవు నిమిత్తమాత్రుడివై... గుడికి వెళ్ళకు;
అంతకన్నా ముందుగా-
పాపాలు చేసిన వారిని
(వారు పశ్చాత్తాపచిత్తులై అడిగినప్పుడు)
హృదయపూర్వకంగా క్షమించడం నేర్చుకో!!!

మూలం: రవీంద్రనాథ్ ఠాగూర్
స్వేచ్ఛానువాదం - 'రఘువర్మ'
9290093933

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.
- ఎడిటర్

ఆరోగ్యాన్ని హరిస్తున్న ఆధునిక జీవనశైలి

పెరుగుతున్న జీవనశైలి వ్యాధులు అన్నీ వయస్సుల ప్రజల జీవితం మీద ప్రభావం చూపుతున్నాయి. పాత తరం జీవనశైలిలో భౌతిక శ్రమ ఎక్కువగా ఉండేది, కానీ ఆధునిక జీవనశైలిలో శారీరక శ్రమ తక్కువవుతుంది. దీని ప్రభావంగా ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా మన దేశంలో అకాల మృతులకు 60 శాతం వరకు జీవనశైలి వ్యాధులే కారణమవుతున్నాయి. ఆధునికత పేరు చెప్పి మన ఆరోగ్యాన్ని మనమే నాశనం చేసుకుంటున్నాం. మన చేతుల చేత మన ఆరోగ్యాన్ని తుడిచిపెడుతున్నాం: జీవితశైలి పేరుతో వస్తున్న కొని తెచ్చుకుంటున్న నాశనం.

పెద్ద నగరాల్లో తీవ్రత ఎక్కువ

జీవనశైలి వ్యాధులలో ముఖ్యంగా గుండెజబ్బులు, మధుమేహం, అధిక రక్తపోటు లాంటి సమస్యలు అధికంగా ఉన్నాయి. ఫాస్ట్ ఫుడ్, శారీరక వ్యాయామం లోపం, తినే విధానం, ఒత్తిడిగల జీవనశైలి ఇవన్నీ ముఖ్య కారణాలు. మహానగరాల్లో జీవించే ప్రజల్లో ఈ వ్యాధులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. నలభై ఏళ్ల లోపే హార్ట్ ఎటాక్లు వస్తుండటం కేవలం జీవనశైలిలో మార్పుల వల్లే జరుగుతోంది.

మనుషులు ఆరోగ్యాన్ని తాకట్టు పెట్టారు

ఆహార అలవాట్లలో మార్పు, ఫిజికల్ యాక్టివిటీ లోపం, ఒత్తిడి మరియు నిద్రలేమి వల్ల నానాటికీ జీవనశైలి వ్యాధులు పెరిగిపోతున్నాయి. ఆధునిక జీవనశైలిలో మానవుడు ఆరోగ్యాన్ని తాకట్టు పెడుతున్నాడు.



గ్యాడ్జెట్లు, బిజీ షెడ్యూల్స్, ఆరోగ్యంపై నిర్లక్ష్యం వంటి వాటితో పాటు, స్మార్ట్ఫోన్ వినియోగం కూడా దీని మీద ప్రభావం చూపుతోంది.

మానసిక ఆరోగ్యంపై దృష్టి

జీవనశైలి మార్పులు శారీరక ఆరోగ్యమే కాకుండా మానసిక ఆరోగ్యాన్ని కూడా ప్రభావితం చేస్తున్నాయి. మానసిక ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు కొన్ని చిట్కాలు ముఖ్యమైనవి: రోజూ ఒకే సమయానికి నిద్ర, భోజనం, కార్యాచరణ ఉండేలా జీవనశైలి సజావుగా ఉండాలి. కనీసం 30 నిమిషాల వ్యాయామం లేదా యోగా, ప్రాణాయామం చేయడం మనశ్శాంతికి దోహదం చేస్తుంది. ధ్యానం మరియు శ్వాస నియంత్రణతో ఒత్తిడిని తగ్గించుకోవచ్చు. ఆహారంలో పండ్లు, కూరగాయలు, ఒమేగా-3 వంటివి చేర్చాలి. నిద్ర పరిపూర్ణంగా ఉండేలా చూసుకోవాలి (7-8 గంటలు అవసరం). స్నేహితులు, కుటుంబ సభ్యులతో అనుబంధం కొనసాగించాలి. సెల్ ఫోన్ వినియోగాన్ని నియంత్రించాలి. కళలకు అవకాశమివ్వడం ద్వారా భావోద్వేగాల్ని సమతుల్యంగా ఉంచుకోవచ్చు. ఈ చిట్కాల వల్ల మనస్సు ఆరోగ్యంగా ఉండటమే కాక, జీవితం సంతృప్తికరంగా మారుతుంది.

ఒత్తిడితో బతుకు చిద్రమవుతోంది

ప్రస్తుత ఆధునిక జీవన శైలి మనిషిని ఓ యంత్రంగా మార్చేసింది. పనుల ఒత్తిడి, సమయపు తగ్గుదల, సామాజిక ఒత్తిళ్లు అన్నీ కలిసివచ్చి మనుషులను అంతర్ముఖులుగా మార్చేస్తున్నాయి. నిత్యం పరుగులు పెట్టే జీవితంలో మనసుకు తృప్తి లేక, శరీరానికి విశ్రాంతి లేకుండా పోతోంది. ఈ ఒత్తిడిలో శ్వాస కూడా భారంగా అనిపించడం మనిషికి సాధారణంగా మారిపోతోంది. ఒత్తిడి వల్ల మానవ సంబంధాలు దెబ్బతింటున్నాయి, ఆరోగ్యం పాడవుతోంది, ఆనందం దూరమవుతోంది. ఆర్థిక విజయాల కోసం కష్టపడుతూ, మనిషి తనే నిస్సారంగా మారుతున్నాడు. భౌతిక విజయం కోసం పరిగెత్తే ఈ యుగంలో, మనస్సుకు నయం కలిగించే ప్రశాంతత అరుదైపోతోంది. ఈ పరిస్థితుల్లో మన మానసిక ఆరోగ్యాన్ని సంరక్షించుకోవడం అత్యవసరం.

మానసిక ప్రశాంతత ఇప్పుడు అత్యవసరమైన ఔషధం

ప్రజలు తమ జీవనశైలిని పునఃపరిశీలించాలి. రోజూ క్రమంగా వ్యాయామం, సమతుల్య ఆహారం, సరైన నిద్ర, మానసిక శాంతి కోసం యోగా, ధ్యానం లాంటి కార్యక్రమాలను అనుసరించాలి. ప్రభుత్వం మరియు ఆరోగ్య శాఖలు ఈ విషయంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. అలాగే కుటుంబ సభ్యుల మద్దతు, ప్రోత్సాహం కూడా ఎంతో అవసరం. ఈ నేపథ్యంలో ప్రజలందరూ తమ జీవనశైలిని మెరుగుపరచేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉంది. అప్పుడే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుంది. నవ్వు జాడలేని ముఖాలు, నిరాశతో నిండిన కన్నులు. ఇవే ఆధునిక జీవితం గుర్తులు. ఈ బతుకు జట్కా బండిలో ఏం కోల్పోయామో నెమ్మదిగా తెలుసుకుంటున్నాం. కానీ చాలా ఆలస్యం అయిన తర్వాత ఒత్తిడిలో మునిగిపోయిన ఈ సమాజానికి, ఓ కాసింత మానసిక ప్రశాంతత ఇప్పుడు అత్యవసరమైన ఔషధం.

- డా. అట్ల శ్రీనివాస్ రెడ్డి
9703935321

ఆరోగ్యానికి మూలం-కాలేయం

మన శరీరంలోని అతి ముఖ్యమైన అంతర్గత అవయవాల్లో కాలేయం (లివర్) కీలకమైనది. సుమారు 1.5 కిలోల బరువుతో ఇది శరీరంలో జీర్ణక్రియ, డీటాక్సిఫికేషన్, శక్తి నిల్వ, రక్తంలో చక్కెర నియంత్రణ, కొవ్వుల మార్పిడి వంటి అనేక ప్రక్రియల్లో భాగస్వామ్యమవుతుంది. మీ రక్తం శుభ్రంగా ఉండేలా మరియు మీ శరీరం సజావుగా పనిచేసేలా చేస్తుంది. ఇది దాదాపు 500కు పైగా విధులను నిర్వహించగలదు. కాలేయం లేకుండా మన ప్రాణాధారం నిలబడదు. మన శరీరంలో కాలేయం కీలకమైన పనులను నిర్వహిస్తుంది - రక్తాన్ని శుభ్రపరచడం, శక్తిని నిల్వ చేయడం, పోషకాలను సరఫరా చేయడం వంటి విభిన్న కార్యకలాపాల్లో ఇది ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఇది 60-70% వరకు నష్టం చెందినా కూడా తనను తాను పునరుత్పత్తి చేసుకునే అపూర్వ సామర్థ్యాన్ని కలిగి ఉంది. అయితే, ఈ శక్తివంతమైన అవయవం కూడా సులభంగా దెబ్బతినే అవకాశం కలిగి ఉంటుంది. మానవ శరీరంలో రెండవ అత్యంత సంక్లిష్టమైన అవయవంగా పరిగణించబడే కాలేయం లేకుండా, శరీరంలోని ఇతర కణజాలాలు పోషకాల కొరతతో బతకలేరు.

ఈ విలువైన అవయవాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది! అనేక మార్గాల్లో తెలిసో ,తెలియకో మనమే మన కాలేయానికి హాని కలిగించేలా ప్రవర్తిస్తున్నాం. సమతుల్యం లేని ఆహారం, మద్యపానం, శారీరక చలనం లేకపోవడం, వేగంగా తినే అహారాల అలవాటు, ఇవన్నీ కాలేయాన్ని దెబ్బతీసే ప్రధాన కారణాలు.

ఈ నేపథ్యంలో, ప్రతి ఏప్రిల్ 19న జరుపుకునే ప్రపంచ కాలేయ దినోత్సవం ప్రజల్లో కాలేయ ఆరోగ్యం పట్ల అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ఏర్పాటు చేయబడింది. 2025 సంవత్సరానికి గల ఇతివృత్తం: ఆహారమే ఔషధం. ఈ సందేశం కాలేయ ఆరోగ్య పరిరక్షణలో ఆహార ప్రాముఖ్యతను నొక్కిచెబుతోంది.

ఆహారం మన ఆరోగ్యం మీద ప్రధాన ప్రభావం చూపుతుంది. అధిక కొవ్వు, చక్కెరలతో కూడిన ప్రాసెస్డ్ ఫుడ్స్, డీప్ ఫ్రైడ్ పదార్థాల వల్ల కాలేయ కణజాలంలో కొవ్వు చేరి ఫ్యాటీ లివర్ (ఊబ్బడ ఔజీర్భిట) సమస్య ఏర్పడుతుంది. దీన్ని నిర్లక్ష్యం చేస్తే అది లివర్ ఇన్ఫ్లమేషన్, లివర్ ఫైబ్రోసిస్, చివరకు సిరోసిస్ వరకు తీసుకెళ్తుంది.

ఇవే కాదు, హెపటైటిస్ అ, ఆ, ఇ లాంటి వైరస్లు కూడా కాలేయ ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. ముఖ్యంగా ఆ మరియు ఇ వైరస్లు శరీరంలో మౌనంగా వ్యాపించి, సంవత్సరాల తరబడి తెలియకుండానే దెబ్బతీసి చివరికి కాలేయ క్యాన్సర్కు దారి తీసే ప్రమాదం కలిగి ఉంటాయి. అయితే ప్రారంభ దశల్లోనే ఇవి గుర్తించగలిగితే, టీకాలు; ఔషధాల ద్వారా ప్రభావాన్ని తగ్గించగలము. అందుకే కాలక్రమంగా పర్యవేక్షణ పరీక్షలు, స్క్రీనింగ్లు తప్పనిసరిగా చేయించుకోవడం అత్యవసరం.

కాలేయ ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవడం కోసం ఆహార నియమాలు పాటించటం అత్యవసరం:

అధిక ఫైబర్ కలిగిన పండ్లు, కూరగాయలు తీసుకోవాలి పూర్తి ప్రాసెసింగ్ చేయని ధాన్యాలు, పప్పులు ఉపయుక్తం ఆరోగ్యకరమైన కొవ్వులైన ఆలివ్ ఆయిల్ వాడాలి కాఫీ మరియు గ్రీన్ టీని మోతాదులో తీసుకోవడం లివర్ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.

ఎక్కువ నీరు తాగడం కాలేయం డీటాక్స్కు సహాయపడుతుంది ఇవి కాకుండా, ఆహారం మాత్రమే కాదు, వ్యాయామం, మంచి నిద్ర, ఒత్తిడి నియంత్రణ కూడా కాలేయ ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తాయి. మద్యపానం పరిమితిలో ఉంచుకోవాలి. అదేవిధంగా, డాక్టర్ అనుమతి లేకుండా ఏదైనా సప్లిమెంట్లు, లేదా ఆయుర్వేద మందులు స్వచ్ఛందంగా వాడకూడదు.

ప్రపంచంలో దాదాపు 150 కోట్ల మందికి పైగా ఫ్యాటీ లివర్, హెపటైటిస్, సిరోసిస్ వంటి కాలేయ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారు. ప్రతి ఏడాది 20 లక్షల మంది కాలేయ సంబంధిత కారణాలతో ప్రాణాలు కోల్పోతున్నారు. వీటిలో చాలావరకు తగిన సమయంలో గుర్తించి చికిత్స ప్రారంభిస్తే నివారించవచ్చు.

ప్రతి భోజనాన్ని ఔషధంగా భావించి, సమతుల్య ఆహారం, నిరంతర వ్యాయామం, మానసిక శాంతితో కూడిన జీవనశైలి- ఇవన్నీ కాలేయ సంరక్షణకు మూలస్తంభాలు. ఈ ప్రపంచ కాలేయ దినోత్సవం సందర్భంగా, మన శరీరం, ముఖ్యంగా ఈ అమూల్య అవయవాన్ని ప్రతిరోజూ జాగ్రత్తగా పరిరక్షిస్తామని గట్టి నిబద్ధతగా ప్రతిజ్ఞ చేద్దాం.

(ప్రపంచ కాలేయ దినోత్సవం - ఏప్రిల్ 19, 2025 సందర్భంగా)

డా. వేపకొమ్మ కృష్ణ కుమార్చ్

ఆమె జ్వరగ్రస్తం అయినప్పుడు

గిన్నెలో ఉన్న మెతుకంతా
పిల్లలకు ఊడ్చిపెట్టి
తాను ఉపవాసం అంటుంది

పట్టుచీర మీద ఆశ ఉన్నా
పండుగ పూట మనసు నొప్పించదు
ఎదురింటి అమ్మ ఏడు వారాల నగలు
వెక్కిరిస్తున్నా
పెళ్ళి నాటి పుస్తెలతాడుకు మురిసిపోతూ
పేదరికాన్ని ఎన్నడూ బాధ పెట్టదు

చీకటిని ఊడ్చేయాలని
కలలు ఎక్కడో పోగొట్టుకున్న
నిద్ర రాని నిత్య శ్రామికురాలు

తాను ఎప్పుడన్నా జ్వరగ్రస్తమయితే
రోజంతా
కాలం కదలని మొద్దు అవుతుంది
ఇల్లు

ఎంతకూ చేతికి చిక్కని
గొలుసు తెంచుకుని పోయిన కుక్కపిల్ల
ఎంత బుజ్జగించినా
మారాము చాలించని చంటి పాప

అన్నీ నల్లపూసలు అయినట్టు
ఏది ఎక్కడుంటదో
ఎంత మొత్తుకున్నా
వొంటిల్లు ఉలుకదూ పలుకదూ
చెయ్యి కాలకుండా పొయ్యి వెలగదు
దీపం కూడా కుదురుగా నిలబడదు

ఆమె విశ్రాంతి కోరుకుంటే
భూకంపం వచ్చినట్టు
పనులన్నీ కుప్పకూలుతయి
శిథిలాల లోంచి మొలిచినట్టు ఒక చేయి
తన సాయం కొరకు ఎదురుచూస్తుంది.

- గజ్జెల రామకృష్ణ
8977412795

ప్రేమ గాయం

ఆమె
తండ్రితో భేదించి గడప దాటింది
ఆయన
తల్లితో వాదించి ఇల్లు వదిలాడు
ఇద్దరూ
సమావేశమయ్యారు
సమాంతర రేఖలుగా ఉండొద్దని భావించారు
పేద ధనిక ప్రాంతీయ కులమతాలు
త్యజించారు
ప్రేమ దేవతను పూజించారు
రేపు వాకిలి
నెత్తురు లో తడుస్తుందని
కాపు కాసిన కొడవలి
ఒకటి వేటాడుతుందని ఊహించలేదు

- కోటం చంద్రశేఖర్
9492043348

లారీ చోదకుల సమస్యలు తీరేదెప్పటికి?

వ్యవసాయ రంగం తరువాత మన దేశంలో అత్యధిక ఉపాధి కల్పిస్తున్న రంగం రవాణా రంగం. ఈ రంగం దేశాభివృద్ధికి ఎంతో దోహదం చేస్తుంది. భారత దేశపు ట్రక్కింగ్ పరిశ్రమ దేశ ఆర్థిక వ్యవస్థకు ఒక ముఖ్యమైన ఊతమిస్తూ జిడిపికి ఆరు శాతానికి పైగా దోహదం చేస్తోంది. లక్షలాది మందికి జీవనోపాధిని అందిస్తున్నది. ఈ కీలకమైన రంగంలో ట్రక్కు డ్రైవర్లు ఒక అనివార్యమైన పాత్రను పోషిస్తున్నారు. దేశంలో 80 లక్షలకు పైగా ట్రక్కు డ్రైవర్లు ఉన్నారని అంచనా. ట్రక్కు డ్రైవర్లకు సౌకర్యాలు మెరుగుపరచడంపై దృష్టి సారించి కేంద్ర ప్రభుత్వం 2025 సంవత్సరం నుండి కొత్తగా తయారుచేసే ఎన్2, ఎన్3 వర్గాల ట్రక్కుల డ్రైవర్ క్యాబిన్‌లో ఎయిర్ కండిషనింగ్ తప్పనిసరిగా ఉండాలని ఇదివరకే ఆదేశించింది. వేడి వాతావరణ పరిస్థితుల్లో డ్రైవర్ల అలసటను తగ్గించి తద్వారా వారి పని సామర్థ్యాన్ని పెంచాలనే అవగాహనతో ఈ నిర్ణయం తీసుకోబడింది. ఇది నిజంగా ప్రశంసనీయమైన చర్య.

70 శాతం రోడ్డు ద్వారానే

2022 నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం మన దేశం తన దేశీయ సరుకులో 70శాతం రోడ్డు మార్గం ద్వారా రవాణా చేస్తుంది. భారతీయ రహదారులపై తిరుగుతున్న ట్రక్కుల సంఖ్య 2022లో నలభై లక్షల నుండి 2050 నాటికి ఒక కోటి డెబ్భై లక్షలకు చేరుకుంటుందని నివేదికలు సూచిస్తున్నాయి. ట్రక్కులు పరిమాణం ప్రకారం రహదారి వాహనాలలో కేవలం 2శాతం మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ భారతదేశంలోని 28 లక్షల ట్రక్కులు సమిష్టిగా సంవత్సరానికి పదివేల కోట్ల కిలోమీటర్లకు పైగా ప్రయాణిస్తూ 460 కోట్ల టన్నుల సరుకును రవాణా చేస్తున్నాయి. వార్షిక రవాణా డిమాండ్ ప్రస్తుతం 2.2 ట్రిలియన్ టన్ను-కిలోమీటర్లుగా ఉంది. 2050 నాటికి నాలుగు రెట్లు పెరిగి 9.6 ట్రిలియన్ టన్ను-కిలోమీటర్లకు చేరుకుంటుందని అంచనా వేయబడింది. రవాణా డిమాండ్ అనేది జనాభా, భూ వినియోగం, ఆర్థిక ప్రభావాలతో సహా వివిధ బాహ్య కారకాల కలయిక నుండి ఉత్పన్నమయ్యే సంచిత ప్రయాణ అవసరాన్ని సూచిస్తుంది.

ప్రమాదాల కారణాలు

రోడ్డు రవాణా రహదారుల మంత్రిత్వ శాఖ, నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో విడుదల చేసిన వేర్వేరు గణాంకాల ప్రకారం ట్రక్కులు రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలలో ఒకటిగా ఉన్నాయి. భారతదేశంలోని 'రోడ్డు ప్రమాదాలు - 2022' వార్షిక నివేదికలోని గణాంకాలను పరిశీలిస్తే మొత్తంరోడ్డు ప్రమాదాలలో 32.9 శాతం (1,51,997), మొత్తం మరణాలలో 35.7 శాతం (55,571) జాతీయ రహదారుల పైనే సంభవించాయి. కొంతమంది డ్రైవర్లు మద్యం లేదా మాదక ద్రవ్యాల ప్రభావంతో వాహనాలు నడపడం, వాహనాల అధిక బరువు వంటి అంశాలు ఈ ప్రమాదాలకు ముఖ్యమైన కారణాలుగా ఉన్నాయి.

ఎదుర్కొంటున్న సవాళ్లు

జాతీయ రహదారులపై ట్రక్కు డ్రైవర్లు అనేక కష్టతరమైన సవాళ్లను ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యలను పరిష్కరించి వారికి నాణ్యమైన డ్రైవింగ్ అనుభవాన్ని వారి జీవనోపాధిపై భరోసా ఇవ్వడం అత్యంత ప్రాముఖ్యత కలిగి ఉంది. ఈ డ్రైవర్లు తరచుగా ఆహారం, నిద్ర, విశ్రాంతి కోసం తగినంత సమయం లేక దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారు. చాలా మందికి, వారి ట్రక్కే వారి ప్రయాణాలలో తాత్కాలిక నివాసం. ఈ రంగం వృద్ధి చెందుతున్నప్పటికీ, పరిష్కారానికి ప్రత్యేక విధానం అవసరమయ్యే సంక్లిష్టమైన సవాళ్ల శ్రేణితో ఇది పోరాడుతోంది. జాతీయ రహదారులపై ప్రయాణించే ట్రక్కు డ్రైవర్లు తరచుగా తక్కువ సమయంలో సుదూర ప్రాంతాలకు సరుకులను చేర్చాలనే ఒత్తిడికి గురవుతారు, దీని కారణంగా రోజుకు ఎక్కువ గంటలు డ్రైవింగ్ చేయవలసి వస్తుంది. ఫలితంగా వాహన వేగాన్ని పెంచుతారు. గణనీయమైన సంఖ్యలో డ్రైవర్లు రోజుకు 14 గంటల వరకు వాహనాలు నడుపుతున్నారని పరిశోధనలు సూచిస్తున్నాయి.

ఇది ప్రమాదాల తీవ్రతను గణనీయంగా పెంచుతుంది. వారి నిరంతరాయమైన పని స్వభావం కారణంగా దాదాపు 50% మంది ట్రక్కు డ్రైవర్లు డ్రైవింగ్ సంబంధిత ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు.

ఎక్కువసేపు కూర్చోవడం తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. సమయం లేకపోవడం లేదా వారికి అలవాటైన భోజనం అందుబాటులో లేకపోవడం వల్ల 70శాతం కంటే ఎక్కువ మంది డ్రైవర్లు పోషకమైన ఆహారం తీసుకోలేక పోతున్నారు. ఇది ఊబకాయం, ఎముకలు, కండరాల సంబంధిత రుగ్మతలు, అధిక రక్తపోటు, నిద్రలేమి, అధిక ఒత్తిడి స్థాయిలు, డీహైడ్రేషన్ వంటి అనేక ఆరోగ్య సమస్యలకు వారిని గురిచేస్తుంది.

చాలా మంది స్థానిక భాష తెలియకపోవడం వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రయాణంలో అనారోగ్యానికి గురైతే, ఆర్థిక ఇబ్బందుల కారణంగా సరైన వైద్య సంరక్షణ పొందలేకపోతున్నారు. వాహనాలు మొరాయించినా లేదా ప్రమాదాలకు గురైనా తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుంది. అంతేకాకుండా కొన్ని మార్గాల్లో దోపిడీలు సర్వసాధారణం. సరుకు దొంగతనాలు తరచుగా జరుగుతున్నాయి. దురదృష్టవశాత్తు ఈ నేరాలకు ప్రతిఘటించే డ్రైవర్లు హత్యకు గురయ్యే ప్రమాదం కూడా ఉంది. స్థానిక సమాజాల నుండి మద్దతు తరచుగా ఉండదు. ఇంటి నుండి ఎక్కువ కాలం దూరంగా ఉండటం అనేక మంది డ్రైవర్లలో మానసిక వేదనకు దారితీస్తుంది. అదనంగా అసురక్షిత లైంగిక కార్యకలాపాలలో పాల్గొనడం లైంగికంగా సంక్రమించే అంటువ్యాధులు, హెచ్ఐవితో సహా ప్రమాదాన్ని పెంచుతుంది. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న ఈ డ్రైవర్లకు సాధారణంగా నెలవారీ జీతాలు ఉండవు, వారు ట్రిప్పులు చేసిన రోజులకు మాత్రమే వేతనాలు పొందుతారు. ఈ అస్థిరమైన ఆర్థిక పరిస్థితి వారి కుటుంబాలను పోషించడం కష్టతరం చేస్తుంది. యువత ఈ వృత్తిని స్థిరమైన కెరీర్ మార్గంగా ఎంచుకోవడానికి వెనుకడుగు వేయడానికి ఇది ఒక కారణం. మన దేశంలో ట్రక్కు డ్రైవర్ సగటు వార్షిక జీతం సుమారు₹3,14,600 లేదా నెలకు₹17,040, ఇది జాతీయ సగటు జీతం₹72,900 కంటే 19% తక్కువ. ఈ రంగంలో అధికారికీకరణ ఇంకా అభివృద్ధి చెందుతున్న దశలోనే ఉండటం వల్ల ట్రక్కింగ్ యొక్క వాంఛనీయ సామర్థ్యాన్ని ఉపయోగించుకోవడానికి అర్హత కలిగిన డ్రైవర్ల కొరత ఇటీవలి కాలంలో ఈ రంగాన్ని వేధిస్తున్న ఒక నిరంతర సమస్య. మన దేశంలో డ్రైవర్-టూ-ట్రక్ నిష్పత్తి ఇప్పటికీ 1000 ట్రక్కులకు 750 కంటే తక్కువగా ఉంది. దీని ఫలితంగా కొన్ని సమయాల్లో 25% నుండి 30% ట్రక్కులు డ్రైవర్లు లేకపోవడం వల్ల ఖాళీగా ఉండిపోతున్నాయి.

పరిష్కారాలు

కేంద్ర ప్రభుత్వం ట్రక్కు యజమానులను డ్రైవర్లకు నెలవారీ జీతం ఇచ్చేలా ఒప్పించాలి. కనీస వేతన ప్రమాణాలను అమలు చేయాలి. రహదారులపై పెట్రోలింగ్ను పెంచడం ద్వారా డ్రైవర్లు తమ ప్రయాణాలలో ఎదుర్కొనే అనేక సమస్యలను పరిష్కరించాలి. డ్రైవర్ల కోసం జాతీయ రహదారులపై ప్రత్యేక విశ్రాంతి స్థలాలను అభివృద్ధి చేయడం చాలా అవసరం. రాత్రిపూట బస చేయడానికి వసతి సౌకర్యాలు కల్పించాలి. ప్రతి 400 కిలోమీటర్లకు హైవేల వెంట వారి ప్రత్యేక అవసరాల కోసం ఆసుపత్రులను ఏర్పాటు చేయాలి. ప్రతి డ్రైవర్ను సమగ్ర ప్రమాద బీమా పరిధిలోకి తీసుకురావాలి. ఈ చర్యలన్నీ ఒకేసారి సాధ్యం కానప్పటికీ, డ్రైవర్లకు క్రమంగా సౌకర్యాలు కల్పిస్తే మనం నిస్సందేహంగా ఉన్నతమైన నాణ్యమైన సేవలను పొందగలుగుతాము.

- జనక మోహన రావు దుంగ
8247045230



కోతలు లేకుండా ధాన్యం కొనుగోళ్లు

- ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి

మానకొండూర్, ఏప్రిల్ 18(మనం న్యూస్): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తరుగు, తేమ పేరిట కోతలు విధించకుండా కొనుగోళ్లు చేపడతామని మానకొండూర్ శాసనభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ స్పష్టం చేశారు. మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కోరారు. శుక్రవారం మానకొండూర్ మండలంలోని ముంజంపల్లి, మానకొండూర్, రంగపేట, పచ్చునూరు, వెల్ది, వేగురుపెల్లి గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ తో కలిసి ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇక నుంచి తాలు,తేమ,తరుగు పేరిట ఎలాంటి కోతలు ఉండని , ఈ విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధర పొందాలని సూచించారు. దళారుల బారినపడకుండా ఉండేందుకు వరి, పత్తి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని ఆయన వివరించారు. రైతాంగానికి అండగా ఉండాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని, అందుకే ఆ దిశగా ప్రభుత్వం పని చేస్తోందని ఆయన పేర్కొన్నారు. గతంలో పదేళ్ల పాటు పాలించిన బీఆర్ఎస్ రాష్ట్రాన్ని అధోగతి పాల్జేసిందని ఆయన ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏనాడూ రైతులను ఏమాత్రం పట్టించుకున్న దాఖలాలు లేవని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి భిన్నంగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ రైతుల బాగు కోసం పాటుపడుతున్నదని ఆయన చెప్పారు. వరంగల్ రైతు డిక్లరేషన్ సభలో ఏఐసీసీ నేత రాహుల్ గాంధి రైతులకు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రూ 500 బోనస్ ఇస్తున్నదన్నారు. ఏకకాలంలో రైతులకు రుణమాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు.ఈ కార్యక్రమాల్లో మానకొండూర్ మండల తహశీల్దార్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందగిరి రవీంద్రాచారి, మానకొండూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మద్రి ఓదెలు యాదవ్, వైస్ చైర్మన్ ఆర్ తిరుమల్ రెడ్డి, పార్టీ నాయకులు తాళ్లపల్లి సంపత్ గౌడ్, పి.కనుకయ్య, శ్రీనివాస్ రావు, ఎం నాగిరెడ్డి, బి.మల్లయ్య గౌడ్, ఎన్.బాబురావు, దాసరి శంకర్, వాల అంజుత్ రావు, బోళ్ల మురళీధర్, సాయిరి దేవయ్య, మాడ తిరుపతి రెడ్డి, కనుకం అశోక్, కోండ్ర సురేష్,రొంటాల లక్ష్మారెడ్డి, శ్రీధర్,సుధగోని తిరుపతి గౌడ్, ఇర్ఫాన్, మడపు ప్రేమ్ కుమార్, కనుకం రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కరీంనగర్, ఏప్రిల్ 18(మనం బ్యూరో): సుడా నిధులతో పలు అభివృద్ధి పనులకు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు.ముందుగా చింతకుంటలోని వినాయకనగర్ ఇందిరమ్మ కాలనీకి వెళ్లే రోడ్డుకు 15 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు.అనంతరం 23 వ డివిజన్ లో మహిళా కమ్యూనిటీ భవనం, మురికి కాలువ నిర్మాణం జిమ్ అన్నీ కలిపి 20 లక్షల రూపాయలవ్యయంతో నిర్మించే పనులకు శంకుస్థాపన చేశారు.9 వ డివిజన్ లో 10 లక్షలతో పద్మశాలి సామాజిక భవన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ స్థానిక స్థానిక నాయకులు ప్రజల కోరిక మేరకు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని కాంగ్రెస్ ప్రభుత్వంలో అభివృద్ధికి సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ ముందుకు సాగుతున్నామని అన్నారు. ఈకార్యక్రమాలలో మడుపు మోహన్,శ్రవణ్ నాయక్,పిట్టల రవీందర్, మాజీ కార్పొరేటర్ ఆర్ష మల్లేశం,గంగుల దిలీప్, లింగ మూర్తి,కంకణాల అనిల్ కుమార్,గంగుల దిలీప్, పోరండ్ల రమేష్,వంగల శ్రీనివాస్, మాసం రమేష్,రంగా నాయక్, స్వప్న,నిర్మల, సుజాత, ఆర్పిలు విజయ లక్ష్మి,సిగిరి లక్ష్మి, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోడీ దిష్టిబొమ్మ దహనం

జన్నారం ఏప్రిల్ 18 (మనం న్యూస్) : కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ,ఎంపీ రాహుల్ గాంధీ లపై కుట్రపూరితంగా అక్రమ కేసులు పెట్టినందుకు నిరసనగా ఎన్.ఎస్.యు.ఐ రాష్ట్ర నాయకుడు సోహైల్ షా ఆధ్వర్యంలో శుక్రవారం రోజున మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మ ను దహనం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ కుట్రపూరితంగానే ప్రశ్నించే గొంతుకను కట్టడి వేయాలని అక్రమంగా ఈడీ కేసులు పెట్టించి చార్జీషీట్లు నమోదు చేయడం కేవలం కక్ష సాధింపు చర్యకు నిదర్శమని అన్నారు.ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ లక్ష్మీనారాయణ, మండల ప్రదాన కార్యదర్శి మేకల మాణిక్యం, సీనియర్ నాయకులు మిక్కిలినేని రాజశేఖర్ ,మోహన్ రెడ్డి ,ముత్యం రాజన్న ,సతీష్ ,నందు నాయక్ ,నగేష్ ఇఇఇ జిల్లా ప్రధాన కార్యదర్శి అజ్మత్ ఖాన్ ,మండల అధ్యక్షుడు గణేష్ మరియు కామెర రాకేష్ ,ఎన్, ఎస్,యు,ఐ మండల అధ్యక్షుడు సాయి నాయక్, మండల ఇంచార్జి తరుణ్ చీటి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం మొద్దు నిద్రవీడి రైతులను పట్టించుకోవాలి

- త్వరలో పోరుబాట చేపడుతాం
- కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్
- ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

కరీంనగర్, ఏప్రిల్ 18(మనం బ్యూరో): ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉండి రైతులను పట్టించుకోవడం లేదన్నారు మాజీ మంత్రి కరీంనగర్ శాసనసభ్యులు గంగుల కమలాకర్. శుక్రవారం రోజున కరీంనగర్ నియోజకవర్గంలోని రూరల్ మండలంలో గల దుర్శేడు, ముగ్దుంపూర్, జూబ్లీ నగర్, నగునూరు, గ్రామాలలో వరి ధాన్యపు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా దుర్శెడ్, ముగ్ధంపూర్ గ్రామాలకు చెందిన రైతులు, వారి వరి ధాన్యాన్ని అధికారులు స్థానిక మిల్లులకు కేటాయించకుండా దూరంగా ఉన్న ప్రాంతాల్లో కేటాయించారని, తద్వారా రవాణా భారం పెరుగుతుందని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్ కు ఫోన్ చేసి, సమస్యను వివరించగా వారు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా ముగ్ధంపూర్ గ్రామానికి చెందిన గోనె బాలరాజు అనే రైతు గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో సమృద్ధిగా నీళ్లు వచ్చాయని ఈ ప్రభుత్వంలో చుక్క సాగునీరు లేక పంట ఎండిపోయిందని కన్నీటి పర్యంతమయ్యారు. రైతును ఓదార్చిన ఎమ్మెల్యే గంగుల త్వరలోనే చలో నారాయణపూర్ పేరుతో పాదయాత్ర చేపట్టి ప్రభుత్వంపై పోరాటం చేసి కరీంనగర్ నియోజకవర్గానికి సాగునీటికి కొదవ లేకుండా కృషి చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు.

అదేవిధంగా ఏసంగి మొదట్లోనే సాగునీరు రావడం లేదని రైతులు నా దృష్టి కి తీసుకవచ్చిన వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి కాలువ ద్వారా నీళ్లు వదలకపోతే గేట్లు పగలగొడతానని చెప్పానని తద్వారా నీళ్లు వదిలారని గుర్తు చేశారు. అదేవిధంగా కొనుగోలు కేంద్రాలకు సంబంధించి, వివరాలను అధికారుల నుండి అడిగి తెలుసుకున్నారు. సరిపడ గన్ని బ్యాగులు ఉన్నాయని అధికారులనడిగారు. ధాన్యం 12% వరకు తేమ వచ్చిందని ఈ ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని అధికారులకు సూచించారు.

రాబోవు రోజుల్లో వడగలతో వర్షం పడే అవకాశం ఉన్నందున కల్లానికి వచ్చిన ధాన్యాన్ని వెంట వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని సూచించారు.

ఇప్పటికే రైతు బంధు, సాగునీరు, రుణమాఫీ లేక రైతులు హరిగోస పడుతున్నారని, ఒకవేళ మళ్లీ అకాల వర్షంతో ధాన్యం తడిస్తే రైతులు చాలా నష్టపోతారన్నారు. అందుకే వెంటవెంటనే కొనుగోలు ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో మార్చి రెండవ వారంలోనే కొనుగోళ్లను ప్రారంభించామని

రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా, తడిసిన ధాన్యాన్ని రంగు మారిన ధాన్యాన్ని కూడా కొనుగోలుచేసి, మద్దతు ధర చెల్లించినట్లు గుర్తు చేశారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను సకాలంలో ఏర్పాటు చేయకపోవడంతో రైతులు పండించిన పంటను మిల్లర్లకు తక్కువ ధరకు అమ్ముకున్నారని తద్వారా రైతు నష్టపోయాడని ఆవేదన వ్యక్తం చేశారు. మా ప్రభుత్వం హయాంలో 95 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని కానీ ఇప్పుడు 30 లక్షల కే పడిపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు.

ఈ కార్యక్రమంలోకరీంనగర్ ఫ్యాక్స్ చైర్మన్ పెండ్యాల శ్యాంసుందర్ రెడ్డి, దుర్శెడ్ ఫ్యాక్స్ చైర్మన్ తోట తిరుపతి, వైస్ చైర్మన్ గోనె నరసయ్య, మాజీ సర్పంచులు జక్కం నరసయ్య, దబ్బట రమణారెడ్డి, ఉప్పుల శ్రీధర్, రుద్ర రాము, మాజీ ఎంపీటీసీలు భోగ తిరుపతి, లింగారెడ్డి, బుర్ర తిరుపతి గౌడ్,

నాయకులు పాషా, భద్రయ్య, సాయిళ్ళ మహేందర్, ఎంపీడీవో సంజీవరావు, ఎంఏఓ బి. సత్యం, ఏఈఓ లు స్వర్ణలత, జాఫర్ ఉల్లా ఖాన్, దుర్శెడ్ ఫ్యాక్స్ డైరెక్టర్లు కందుల రమేష్, దాడి లచ్చయ్య, కుంభం అంజలి, వేల్పుల రమేష్, మహేందర్, శంకరయ్య, నరసయ్య, పోచాలు, మరియు పలువురు బిఆర్ఎస్ నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

లోక్ సభ, శాసనసభల కు ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే ఎన్నికల ఖర్చు తగ్గి భారం తగ్గుతుంది

- బిజెపి నాయకులు

ప్రజల వద్దకు వెళ్లి అవగాహన కార్యక్రమం

మంచిర్యాల, ఏప్రిల్ 18 (మనం న్యూస్): లోక్ సభ మరియు శాసనసభకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం వల్ల ఎన్నికల ఖర్చు తగ్గి భారం తగ్గ తుందని, సమయం కూడా వృధా కాదని బిజెపి నాయకులు అన్నారు .భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ ఆదేశాను సారం బిజెపి మాజీ జిల్లా అధ్యక్షులు వెరబెల్లి రఘునాథ్ సూచన మేరకు శుక్రవారం మంచిర్యాల పట్టణం లోని డిగ్రీ కాలేజీ గ్రౌండ్ లో వాకర్స్ నీ కలిసి వారికి వన్ నేషన్ వన్ ఎలక్షన్ గురించి వివరించారు .ఈ సందర్భంగా మాట్లాడుతూ,.వన్ నేషన్ వన్ ఎలక్షన్ గురించి ప్రజలందరికీ తెలియజెయాలనేఉద్దేశ్యంతో ప్రజల ముందుకు వస్తున్నామని, దీనివల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ దుర్గం అశోక్, కో కన్వీనర్ తులా ఆంజనేయులు, బీజేపీ పట్టణ అధ్యక్షులు అమిరి శెట్టి రాజు కుమార్, వన్ నేషన్ వన్ ఎలక్షన్ పట్టణ కన్వీనర్ ఆకుల అశోక్ వర్ధన్, కో కన్వీనర్ బోయిని హరికృష్ణ, సీనియర్ నాయకులు పెద్దపల్లి పురుషోత్తం ,తులా మధుసూదన్ , కాశెట్టి నాగేశ్వర్ రావు ,చిరంజీవి , వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

తిరుగులేని శక్తిగా సిపిఐ ఎదగాలి

- సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడా వెంకటరెడ్డి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 18 (మనం న్యూస్) : నగరంలో సిపిఐ పార్టీ ఎదుగుదల కోసం ప్రతి ఒక్క కార్యకర్త శక్తివంచన లేకుండా కృషి చేయాలని చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. సిపిఐ కరీంనగర్ నగర 11వ మహాసభ సందర్భంగా సిపిఐ కార్యాలయం ముందు ఏర్పాటుచేసిన పార్టీ పతా కాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి ఆవిష్కరించారు. అనంతరం చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ ఎర్రజెండా అంటే దోపిడీదారులకు పేదలను అణిచివేసేవారికి గుండెల్లో రైళ్లు పరిగెడతాయని పేర్కొన్నారు. సిపిఐ పార్టీ మార్క్సిజమ్ లెనిజం పునాదులపై ఆవిర్భవించిందని సమాజంలో అంతరాలు లేని సమాజ స్థాపన కోసం నిర్విరామ పోరాటం చేసి ఉందని భూమిలేని నిరుపేదలకు భూమి కావాలని ఇండ్ల స్థలాల కోసం, రేషన్ కార్డుల కోసం అనేక పోరాటాలు చేసిన ఘన చరిత్ర సిపిఐ కి ఉందన్నారు. అన్ని డివిజన్లలో పార్టీ ప్రజాసంఘాల విస్తరణకై ఇంటింటికి తిరిగి ప్రచారం చేయాలని అన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి మాట్లాడుతూ సిపిఐ పార్టీ దేశంలో పుట్టి 100 సంవత్సరాలు అడిగి పెట్టిందని 100 సంవత్సరాల చరిత్ర గల పార్టీ ఈ దేశంలో ఒక సిపిఐ మాత్రమేనని ఆయన తెలిపారు.నగరంలో అసైన్డ్,పరంపోగు, శిఖం భూములు కొంతమంది రాజకీయ నాయకుల కబంధ హస్తాల్లో ఉన్నాయని వీటిని ప్రభుత్వం వెంటనే స్వాధీన పరుచుకోవాలని ఆయన కోరారు.

ఈసమావేశంలో సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, కిన్నెర మల్లమ్మ, కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్, పంజాల శ్రీనివాస్, నలువాల సదానందం,సాయవేణి రాయమల్లు, శారద, బోనగిరి మహేందర్ నగర కార్యవర్గ సభ్యులు గామినేని సత్యం, కొట్టే అంజలి, ఎలిశెట్టి భారతి, కళ్యాణపు రేఖ, సత్యనారాయణ చారి, సాంబరాజు, తంగేళ్ళ సంపత్, నగునూరి రమేష్, ఓరుసు కొమురయ్య, భూక్య లక్ష్మి, సాధవేని బాలయ్య, కాళిదాస్, ఎర్రం యాదగిరి పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

- ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్

జన్నారం ఏప్రిల్ 18 (మనం న్యూస్) : రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని,ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు.శుక్రవారం జన్నారం మండలంలోని ఇంధనపల్లి, దేవుని గూడా కిష్టాపూర్ కామనపల్లి కవ్వాల్ గ్రామాలలో డిఆర్డిఏ ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.రైతులను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. 2లక్షల లోపు రుణ మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని పేర్కొన్నారు. రైతుల పండించిన పంటలను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో అమ్మాలని,దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రాజా మనోహర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ముజాఫర్ అలీ ఖాన్, మేకల మాణిక్యం, మిక్కిలినేని రాజశేఖర్, గుర్రం మోహన్ రెడ్డి, సయ్యద్ ఇసాక్, ముత్యం సతీష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

రైతులకు ఎమ్మెల్యే కవ్వంపల్లి పిలుపు

శంకరపట్నం ,ఏప్రిల్ 18 (మనం న్యూస్) : ప్రభుత్వపరంగా ఏర్పాటు చేస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కోరారు. శుక్రవారం శంకరపట్నం మండలంలోని తాడికల్,కరీంపేట్, కొత్తగట్టు, లింగాపూర్, మెట్పల్లి, ఆముదాలపల్లి, మొలంగూర్ గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ కష్టపడి పండించిన పంటను దళారులను నమ్మి, అమ్మి మోసపోవద్దని కోరారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయిస్తే మద్దతు ధర లభిస్తుందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, గన్ని సంచుల కొరత సమస్య తలెత్తకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకు రావాలన్నారు.

ఈ కార్యక్రమాల్లో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్, శంకరపట్నం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోపగోని బస్వాగౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపెల్లి తిరుపతి, పార్టీ నాయకులు బండారు తిరుపతి, ఉప్పుగళ్ల మల్లారెడ్డి, జనగామ అనిల్ కుమార్, ఎగ్గని రమేశ్, తాడిచర్ల తిరుపతి, తడిసిన నారాయణ రెడ్డి, గొట్టె మధు, అమ్ముల ఓదెలు, నేరెళ్ల సంతోష్, ఇషాముద్దీన్, షారుఖ్, బొంగోని శ్రావణ్, జి.ప్రవీణ్, రాజ్ కుమార్, గుర్రం వీరయ్య, గడ్డి తిరుపతి, టి.సత్యనారాయణ, తణుకు ప్రభాకర్, కె.మధుకర్ రెడ్డి, కల్వకుంట్ల తిరుపతి,చింతకుంట తిరుపతి, రమేశ్, టి.తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి అమ్ముతున్న ముగ్గురు వ్యక్తులు అరెస్ట్

- నిందితుల దగ్గర నుండి 290 గ్రాముల గాంజా స్వాధీనం

జైపూర్, ఏప్రిల్ 18 (మనం న్యూస్): గంజాయి అమ్ముతున్న ముగ్గురు వ్యక్తులను శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.జైపూర్ మండలంలోని ఏసిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఏసిపి వెంకటేశ్వర్లు నిందితుల వివరాలను వెల్లడించారు.మండలంలోని వేలాల,కిష్టపూర్,గ్రామాలకు చెందిన దుర్గం సాయి కార్తీక్,సుందిళ్ల సంపత్,ప్యాగ శేఖర్ అనే వ్యక్తులు తరచుగా గాంజా సేవిస్తూ ఇతరులకు అమ్ముతూ జల్సా చేసేవారని సుమారుగా 290 గ్రాముల గాంజాయిని వారి దగ్గర నుండి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు,ఆసిఫాబాద్ పట్టణానికి నిందితులు తన మోటార్ సైకిల్ల పై వెళ్లి (టీఎస్ 07 ఈక్యూ 5592) (ఏ పి012 ఎం1641) గుర్తు తెలియని వ్యక్తుల దగ్గర కొనుగోలు చేసి వారి గ్రామాలలో యువకులకు అమ్ముతూ జల్సా చేస్తున్నారు.అదే సమయంలో వేలాల ఇసుక క్వారీ సమీపంలో గాంజా సేవిస్తూ అమ్ముతున్నారని నమ్మదగిన సమాచారంతో స్థానిక ఎస్సై శ్రీధర్ తన సిబ్బందితో కలిసి దాడి చేయగా ముగ్గురు నిందితులను పట్టుకొని పోలీస్ స్టేషన్ కి తరలించారు.02 మోటార్ సైకిల్లు,02 సెల్ ఫోన్ లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే శిక్ష తప్పదు అని హెచ్చరించారు.ఈ మేరకు ఏసిపి వెంకటేశ్వర్లు కేసును దర్యాప్తు చేసిన సిఐ వేణు చందర్,ఎస్సై శ్రీధర్, ఇన్వెస్టిగేషన్ అధికారిగా అదనపు ఎస్సై రామలక్ష్మి ని అభినందించారు.ఈ కార్యక్రమంలో భీమారం ఎస్సై శ్వేత, హెడ్ కానిస్టేబుల్స్ తదితరులు పాల్గొన్నారు.

తాళ్ల గురజాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య శిబిరం

- పదిమందికి కిడ్నీసంబంధిత సమస్యలతో ఉన్నట్లు గుర్తింపు

మంచిర్యాల, ఏప్రిల్ 18, (మనం న్యూస్): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హరీష్ రాజు ఆదేశాను సారం మంచిర్యాల జిల్లా తాళ్ల గురజాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మాల గురజాల గ్రామంలో వైద్య శిబిరాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు . ఈ వైద్య శిబిరంలో 52 మందికి పరీక్షలు చేసి పదిమందికి కిడ్నీ సంబంధిత సమస్యలతో ఉన్నట్లు పరీక్షలు చేసి గుర్తించినట్లు డాక్టర్లు తెలిపారు . అదేవిధంగా వార్తాపత్రికలలో వస్తున్న మాదిరిగా ఈ గ్రామంలో ఎలాంటి ఎవరు కూడా బయోందోళనలకు గురి కావలసిన అవసరం లేదని వైద్య ఆరోగ్యశాఖ తరపున మూడు రోజులపాటు వైద్య శిబిరాలను ఇక్కడ ఏర్పాటు చేస్తున్నట్లు అదేవిధంగా నాలుగు వైద్య బృందాలతో గ్రామంలోని 250 ఇండ్లు 912 జనాభ కు పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు . రక్త మూత్ర పరీక్షలను శాంపుల్స్ కలెక్ట్ చేసి టీ హబ్ ద్వారా పరీక్షలు చేయించడం, అదేవిధంగా గ్రామంలో రెండు బోర్వెల్ ద్వారా మంచినీరును తీసుకుంటున్నారని, వాటిని కూడా వరంగల్ లాబరేటరీ కి పంపించి పరీక్షలు చేయించడం జరుగుతుందని, ఉప జిల్లా బెల్లంపల్లి వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధాకర్ నాయక్ ఆధ్వర్యంలో సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు . డాక్టర్ ఏంజలి వెంకటేశ్వర్లు, కమ్యూనిటీ ఆఫీసర్ మురళి, సూపర్వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్ పాల్గొన్నారు. వైద్య శిబిరాలను ఇక్కడ నిర్వహించిన తర్వాత జిల్లా కలెక్టర్ కు రిపోర్టును పంపించడం జరుగుతుందని, అదేవిధంగా ఈ గ్రామంలో ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తెలిపారు . ఈ వైద్య శిబిరంలో మల్లిక సూపర్వైజర్, చంద్రకళ, జ్ఞానేశ్వరావు, రాజేశ్వరి, వైద్య సిబ్బంది ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అవును భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్

- **పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే టీజేఆర్**

సంగారెడ్డి, ఏప్రిల్ 18 (మనంప్రతినిధి): అవును భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ దేవుడేనని తర్వాత భగవంతుడి అంతటివాడు అని టిపిసిసి కార్యా ధ్యక్షుడు, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే తూర్పు జయప్రకాష్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. శ్రీరాముడు అల్లా ఏసుప్రభువు తర్వాత ఈ దేశ ప్రజలకు అంబేద్కర్ జవహర్ లాల్ నెహ్రూ, మహాత్మా గాంధీ కూడా భగవంతు లేనని ఆయన తీవ్రంగా వ్యాఖ్యా నించారు. శుక్రవారంనాడు జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో టీపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో జై బాపు,జై భీమ్,జై సంవిధాన్ ర్యాలీ నిర్వహించి ననంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవును అంబేద్కర్ భగవంతుడు తర్వాత భగవంతుడి అంతటి వాడు,శ్రీ రాముడు, అల్లా, ఏసు ప్రభువు తర్వాత ఈ దేశ ప్రజలకు అంబేద్కర్ జవహర్ లాల్ నెహ్రూ; మహాత్మా గాంధీ కూడా భగవంతు లేనని సంచలనమైన వ్యాఖ్యలు చేశారు. ఈరోజు మనం స్వేచ్ఛగా జీవిస్తున్నాం అంటే, ఆలాంటి చట్టాలు తీసుకువచ్చిన అంబేద్కర్ మహానీయుడని జగ్గారెడ్డి కీర్తించారు. అంబేద్కర్ భగవంతుడా? అని అమిత్ షా అన్నాడు అవును అంబేద్కర్ భగవంతుడు, తర్వాత భగవంతుడి అంతటివాడు, రాముడు, అల్లా, జీసస్ తర్వాత అంబేద్కర్ భగవంతుడే, జవహర్ లాల్ నెహ్రూ; మహాత్మా గాంధీ కూడా భగవంతులేనని జగ్గారెడ్డి కుండలు బద్దలై నట్టు పేర్కొన్నారు. సంగారెడ్డి నుండి మొదలుకొని డిల్లీ వరకు దేశ ప్రజలందరూ క్షేమంగా ఉన్నారంటే ఆనాడు చేసిన చట్టాలు కారణమని తేల్చి చెప్పారు.దేశ ప్రజలందరూ సమానత్వం సాధించాలని, స్వాతంత్ర్యంగా, స్వేచ్ఛగా, ఆర్థిక సమానత్వం ఉండాలని ఆనాడు జవహర్ లాల్ నెహ్రూ ఆధ్వర్యంలో చట్టాలు చేశారని జగ్గారెడ్డి స్పష్టం చేశారు. ఈనాడు ఆర్థిక స్వేచ్ఛ, భద్రత, స్వతంత్రంగా, స్వేచ్ఛగా జీవిస్తున్నారంటే బిఆర్ అంబేద్కర్ చేసిన రాజ్యాంగమే కారణమని ఆయన సుస్పష్టం చేశారు. నేడు ప్రధాన మంత్రిగా నరేంద్ర మోడీ ఉన్నా, హోం మంత్రిగా అమిత్ షా ఉన్నా దానికి కారణం బిఆర్ అంబేద్కర్ ఇచ్చిన ఓటు హక్కే కారణమని, పార్లమెంటులో

అంబేద్కర్ ను అవమానించేలా అమిత్ షా వ్యవహరించినపుడు కూడా బేషరతుగా క్షమాపణ చెప్పాలని మా నాయకుడు రాహుల్ గాంధీ డిమాండు చేశారన్న విషయాన్ని జగ్గారెడ్డి గుర్తు చేశారు. అంబేద్కర్ పట్ల పార్లమెంటులో వ్యవహరించిన తీరుపై ఇంతవరకు బీజేపీ నాయకులు గాని, మోడీ, అమిత్ షాలు గాని ఇంతవరకు క్షమాపణ చెప్పలేదని జగ్గారెడ్డి తప్పుబట్టారు. అంబేద్కర్ భగవంతుడా? అని పార్లమెంట్ సాక్షిగా అమిత్ షా అవమానించాడని ఇది ఆయన స్థాయికి తగదని జగ్గారెడ్డి హితవు పలికారు. అందుకు నిరసనగా రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో దేశ వ్యాప్త నిరసనలను చేపట్టిందని చెప్పారు. బీజేపీ నేతలకు సిగ్గులేదా, అంబేద్కర్ ను అవమానిస్తారా? క్షమాపణ చెప్పరా,అమిత్ షా, మోడీ లు క్షమాపణ చెప్పేవరకు కాంగ్రెస్ పార్టీ వదలదని ఆయన హెచ్చరించారు. త్వరలో సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలు ఏమి? కోరుకుంటున్నారో? ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ సహకారంతో అవన్నీ తీర్చే ప్రయత్నం చేస్తానని ఆయన భరోసానిచ్చారు. త్వరలో సంగారెడ్డిలో సీఎం సభ ఉంటుందని జగ్గారెడ్డి ప్రకటించారు.సంగారెడ్డి ప్రజల అవసరాలు ఎంటి? ఏం అభివృద్ధి కార్యక్రమాలు జరగాలి అనే దానిపై త్వరలో సంగారెడ్డిలో ఓ మీటింగ్ ఏర్పాటు చేస్తానని పేర్కొన్నారు.

వీర బ్రహ్మేంద్ర స్వామి కళ్యాణ మహోత్సవం

నంగునూరు, ఏప్రిల్ 18, (మనం న్యూస్) : మండల పరిధిలోని అక్కెనపల్లి గ్రామంలో శుక్రవారం నాడు శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆలయ 29వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా వీరబ్రహ్మేంద్రస్వామి కళ్యాణం అంగరంగ వైభవంగా జరిపారు. శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పురోహితులు బ్రహ్మచారి వేద మంత్రాల మధ్య స్వామి వారి కళ్యాణం కన్నులపండువగా నిర్వహించారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి కళ్యాణ మహోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామి వారి కళ్యాణాన్ని కనులారా తిలకించి తరించిపోయారు. ఈ సందర్భంగా భక్తులకు పురోహితులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం అక్కెనపల్లి గ్రామానికి చెందిన చామంతుల కమలవ్వ- రామచంద్రం కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ సన్నిధిలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టగా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కాగా ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని ఆలయ కమిటీ నిర్వాహకులు సుమారు 300 స్టీల్ ప్లేట్లు, గ్లాసుల్లో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించడం విశేషం. అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో ప్లాస్టిక్ ను నిషేధిస్తూ స్టీల్ ప్లేట్లు గ్లాసుల వాడకానికి ప్రాధాన్యత ఇవ్వడం పట్ల ఆలయ కమిటీ నిర్వాహకులను పలువురు అభినందిస్తున్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహణ సభ్యులు కైరంకొండ భాస్కర్, వెంకటయ్య, కొమురయ్య, పెద్దరాజిరెడ్డి, రజినీకర్ రెడ్డి, శ్రీనివాస్, మల్లారెడ్డి పలువురు భక్తులు పాల్గొన్నారు.

అకాల వర్షంతో అతలాకుతలం

కొండపాక, ఏప్రిల్ 18, (మనం న్యూస్): కొండపాక మండలంలో శుక్రవారం సాయంత్రం ఈదురు గాలులు ఉరుములు మెరుపులతో కూడిన అకాల వర్షం కురిసింది. ఒక్కసారే వర్షం రావడంతో రోడ్లపై ఆరపోసిన ధాన్యం కుప్పలు, కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం కుప్పలకు నీరు చేరింది. అప్పటి కప్పుడే కవర్లు కప్పినప్పటికీ లాభం లేకపోయింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కుప్పల చుట్టూ చేరిన నీటిని ధాన్యం తడవకుండా రైతులు తొలగించు కున్నారు. వర్షానికి ధాన్యం కొట్టుకు పోయింది. రాజీవ్ రహదారిపై దుద్దెడ మూల మలుపు వద్ద పెద్ద వేపచెట్టు ఈదురు గాలులకు నేలకులింది. రోడ్డు పక్కన ఉన్న ఇంటిపై పడడంతో ఇల్లు పాక్షికంగా దెబ్బతిన్నది. ఈదురు గాలులకు మామిడికాయలు నేల రాలాయి. మండలంలోని దుద్దెడ, బందారం, దర్గా, అంకిరెడ్డిపల్లి, వెలికట్ట, కొండపాక, దమ్మకపల్లి, సిరిసినగండ్ల మర్పడగ తదితర గ్రామాల్లో సుమారు అరగంట పాటు వర్షం కురిసింది.

మహిళలను అగౌరవపరిచిన వారిపై చర్యలు తీసుకోవాలి

- **జీ.వి.డి. కమిటీని రద్దు చేయాలి**

కల్లు గీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు తాళ్లపల్లి రాజు గౌడ్

కొమురవెల్లి, ఏప్రిల్ 18, (మనం న్యూస్): మండల కేంద్రంలో శుక్రవారం రోజు కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు మల్లన్న దేవాలయం వద్ద పోలీస్ బొమ్మ చౌరస్తాలో దిష్టిబొమ్మ దగ్ధం చేసి నిరాసనం వ్యక్తం చేస్తూ గౌడ కులస్థులైన మహిళలను అగౌరవపరిచి దైవ కార్యానికి వెళ్ళినటువంటి ఆడపడుచులను కుంకుమార్చన చేయవద్దని అడ్డుకొని గుడి నుండి బయటకు వెళ్లిపోవాలని (వి.డి.సీ.) విలేజ్ డెవలప్మెంట్ కమిటీ మహిళలపై దుర్భాషలాడుతూ గుడిలో నుండి వెళ్లిపోవాలని బహిష్కరించారన్నారు. గీతా వృత్తిని నమ్ముకొని ఉన్న ఆ ఊరి గౌడ కుటుంబాలు పోషించుకునే జీవనోపాధి చేసుకుంటున్నా ఈత చెట్లను సైతం దగ్ధం చేశారు. నిజాంబాద్ జిల్లా వెల్లికట్ట మండలం తాళ్ల రాంపూర్ గ్రామంలో నిరంకుశ పాలన రజాకారులు చేసినటువంటి ఆ ఊరి డెవలప్మెంట్ కమిటీ ఆగడాలు 7 నెలల నుండి గౌడ కుటుంబాలపై నిరీక్ష చూపుతూ ప్రతి పనికి అడ్డుపడుతున్నారు అలాంటి కమిటీని వెంటనే రద్దు చేయాలని విలేజ్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులపై చట్టపరమైన చీరలు రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ శాఖ వారు తక్షణమే తీసుకోవాలని కొమరవెల్లి మండల కల్లు గీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు తాళ్లపల్లి రాజు గౌడ్ ఆధ్వర్యంలో వి డి సి దిష్టిబొమ్మ దగ్ధం చేసి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి బాండకిది అరుణ్ గౌడ్ కొమురవెల్లి మండల గౌరవ అధ్యక్షులు దొడ్లే విష్ణుమూర్తి గౌడ్ ప్రధాన కార్యదర్శి గణబోయిన నర్సింలు గౌడ్ కోశాధికారి జనగాం శ్రీకాంత్ గౌడ్ తాళ్లపల్లి కనకయ్య గౌడ్ రాజులబాద్ గౌడ సంఘం అధ్యక్షులు బాలన్స్ గౌడ్ యూత్ అధ్యక్షులు కొయ్యడ నరేష్ గౌడ్ మండల ఉపాధ్యక్షుడు శివలింగు రమేష్ గౌడ్ పట్టణ గౌరవ అధ్యక్షులు బత్తిని యాదగిరి గౌడ్ ఉపాధ్యక్షులు ముత్యం పార్శారాములు గౌడ్ కోశాధికారి బత్తిని చిన్న నర్సింలు గౌడ్ సలహాదారుడు ముత్యం శేఖర్ కరుణాకర్ స్వామి బొంగోని నరసింహులు వెంకటేష్ శీను బత్తిని పెద్ద నరసింహులు శ్రీధర్ నరసింహులు కిరణ్ బొంగోని ప్రశాంత్ గౌడ్ బత్తిని శ్రీను గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్ తో బాలుడి మృతి

- **తుక్కాపూర్ గ్రామంలో విషాదఛాయలు**

తొగుట, ఏప్రిల్ 18, (మనం న్యూస్): తొగుట మండలం తుక్కాపూర్ గ్రామానికి చెందిన చిక్కుడు స్వామి రెండవ కుమారుడు సాయి ప్రణీత్ విద్యుత్ షాక్ తో మరణించిన దురదృష్టకర సంఘటన శుక్రవారం గ్రామంలో చోటు చేసుకుంది. తొగుట పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా వున్నాయి. గ్రామానికి చెందిన చిక్కుడు స్వామి ఆరవ తరగతి చదువుతున్న రెండవ కుమారుడు సాయి ప్రణీత్ (12) గ్రామంలో జరుగనున్న గ్రామ దేవతల పూజల కోసం వేసిన టెంటు వద్ద విద్యుత్తు బల్బులు ఏర్పరచగా అక్కడే మిత్రులతో కలిసి ఆడుకుంటున్న క్రమంలో ప్రమాదవశాత్తు ఇనుప పైపును ముట్టుకోగా అతని ఎడమ చేతికి కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే మరణించినాడు. స్వామి తన చిన్న కొడుకు అయిన సాయి ప్రణీత్ ఆడుకుంటున్న క్రమంలో ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తో మరణించిన క్రమంలో అతని కొడుకు మరణం పై ఎటువంటి అనుమానం లేదని బాలుని కుటుంబ సభ్యులు పోలీసులకు దరఖాస్తు ఇవ్వగా కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించినట్లు తొగుట ఎస్సై తెలిపారు.

తుక్కాపూర్ గ్రామంలో విషాద ఛాయలు

గ్రామ దేవతల పూజలు నిర్వహించాలని ఊరంతా ఓ వైపు పండగ వాతావారణం నెలకొన్న తరుణంలో తుక్కాపూర్ గ్రామంలో గురువారం రాత్రి విద్యుత్ షాక్ తగిలి ముక్కుపచ్చలారని 12 ఏళ్ల బాలుడు చిక్కుడు సాయి ప్రణీత్ దేవాలయ ఆవరణలో వేసిన టెంట్ కింది తన అన్నతో పాటు మిత్రులతో కలిసి ఆడుకుంటుండగా టెంట్ కోసం వేసిన పైపుకు బాలుని చేయి తగలగా ఒక్కసారిగా విద్యుత్ షాక్ కు గురై చనిపోయాడు. ఊహించని సంఘటనకు అక్కడే ఉన్న గ్రామస్థులు తేరుకొనేలోపే బాలుడు మృతి చెంది విగత జీవిగా పడి ఉండడంతో ఆ హఠాత్పరిణామనికి గ్రామస్థులు షాక్ అయ్యారు. బాలుని మరణ వార్త తెలిసి గ్రామస్థులు, బంధువులు సంఘటన జరిగిన ప్రదేశానికి పెద్ద సంఖ్యలో చేరుకుని బాలుని తల్లిదండ్రులను ఓదార్చారు. బాలుని అం తిమయాత్రలో గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తల్లి, కుమారుడి అదృశ్యం

జగదేవపూర్, ఏప్రిల్ 18, (మనం న్యూస్): తల్లి కుమారుడు అదృశ్యమైన సంఘటన జగదేవపూర్ మండలం దౌలాపూర్ గ్రామంలో చేసుకుంది. ముక్కెర పోచమ్మ మల్లయ్య దంపతుల కుమార్తె ముక్కెర లావణ్యకు గత పది సంవత్సరాల క్రితం గజ్వేల్ మండలం కొల్గూర్ గ్రామానికి చెందిన వేముల కృష్ణతో వివాహం జరిగింది. వారికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు స్వరణ్ దీప్ (10), రెండవ కుమారుడు దీక్షిత్ (7) ఉండగా పెద్ద కుమారుడు తండ్రి వద్ద, చిన్న కుమారుడు తల్లి లావణ్య వద్ద ఉంటున్నారు. గత పది నెలల నుండి తల్లిదండ్రులతో లావణ్య నివాసం ఉంటుంది. కాగా గురువారం రాత్రి దౌలాపూర్ గ్రామం నుండి వెళ్ళిందని, ఆచూకీ తెలిసినవారు సంబంధిత నెంబర్లకు సమాచారం అందించవలసిందిగా లావణ్య కుటుంబీకులు కోరుతున్నారు. ఆచూకీ తెలిసిన వారు 9908985011, 9963317844, 9949686813, 8074749381 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

భూసేకరణ సర్వేకు వెళ్లిన సింగరేణి అధికారి పై దాడి

- **దాడిని ఖండించిన సింగరేణి బీసీ అండ్ ఓబిసి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు**

మంచిర్యాల, ఏప్రిల్ 18 (మనం న్యూస్): సింగరేణి సంస్థ రామగుండం-3 ఏరియా పరిధిలోని ఓసీపీ-2 ఉపరితల గని విస్తరణలో భాగంగా 88 ఎకరాల భూమిని సేకరించడం కోసం బుధవారం పేట గ్రామంలో నిర్వహిస్తున్న భూసర్వేను రైతులు కాని వ్యక్తులు అడ్డుకొని సర్వే పరికరాలు ధ్వంసం చేశారు . ఆ సమయంలో అడ్డుగా వెళ్లిన సింగరేణి అడిషనల్ మేనేజర్ కోల శ్రీనివాస్ పై పలువురు వ్యక్తులు దాడి చేయడంతో గాయపడిణ కోలా శ్రీనివాసును సెంటినరీ కాలనీ డిస్పెన్సరీ కి చికిత్స నిర్వహించారు. కాగా చికిత్స పొందుతున్న కోల శ్రీనివాస్ ను రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు పరామర్శించా రు. మెరుగైన చికిత్స కోసం అవసరమైన వైద్య పరీక్షలను నిర్వహించి మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను కోరారు. మెరుగైన వైద్య చికిత్స కోసం కోలా శ్రీనివాసును గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రికి పంపించడం జరిగిందని వైద్యులు తెలిపారు. దాడి చేసిన నిందితులపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు . ఓసీపీ-2 ప్రాజెక్టు ఆఫీసర్ చిట్టా. వెంకటరమణ, మేనేజర్ కె.వి.రామారావు, ఎస్టేట్ ఆఫీసర్ కనవేన ఐలయ్య, అధికార ప్రతినిధి బి సుదర్శనం, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ శబురుద్దీన్ అబ్దుల్ లు కూడా శ్రీనివాసును పరామర్శించారు. దాడి చేయడం సరి కాదు బీసీ అండ్ ఓ బి సి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్... భూసేకరణ సర్వే కు వెళ్లిన సింగరేణి అధికారి పై దాడిపై దాడి చేయడం సరి కాదని సింగరేణి బీసీ అండ్ ఓ బి సి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఏ నాగేశ్వరరావు, ఎన్ రమేష్ .జనరల్ సెక్రటరీ కార్యవర్గం తీవ్రంగా ఖండించారు .ఈ సంఘటన పూర్తిగా విచారణ చేసి దాడి చేసిన వ్యక్తులపై తగు చర్య తీసుకోగలరని అలాగే భూసేకరణకు వెళ్లిన అధికారికి పూర్తిస్థాయిలో రక్షణ కల్పించాలని వారు డిమాండ్ చేశారు .

హెచ్‌పిఎస్‌లో ఎస్సీ విద్యార్థులకు ప్రవేశం కల్పించాలి

- **రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళికి డిబిఎఫ్ నేత శంకర్ విన్నపం**

గజ్వేల్, ఏప్రిల్ 18, (మనం న్యూస్): హైదరాబాదు పబ్లిక్ స్కూల్ లో ఎస్సీ విద్యార్థులకు యధావిధిగా ఒకటవ తరగతి నుండి ప్రవేశం కల్పించాలని రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళికి డిబిఎఫ్ నేత పి.శంకర్ విన్నవించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ హైదరాబాదు పబ్లిక్ స్కూల్ లో ఒకటవ తరగతి నుండి కాకుండా మూడవ తరగతి నుండి ప్రవేశం కల్పించెందుకు హైదరాబాదు పబ్లిక్ స్కూల్ యాజమాన్యం కుట్ర చెస్తుందన్నారు. విద్యార్థులు ఇతర విద్యార్థులతో పోటిపడటం లేదని, ప్రభుత్వం బకాయిలు ఇవ్వటం లేదనే సాకుతో ఒకటవ తరగతి నుండి కాకుండా మూడవ తరగతి నుండి ప్రవేశం కల్పిస్తే సామర్ధ్యాలు ఎలా వస్తాయని, ఎలా పోటీ పడుతారని ప్రశ్నించారు. ప్రభుత్వం బకాయిలు చెల్లించినందున తక్షణమే ఒకటవ తరగతి నుండి ప్రవేశాలు ప్రారంభించాలని కోరారు. ఎస్సీ విద్యార్థుల పట్ల వివక్షను సహించబోమన్నారు. ఈ మేరకు తగిన చర్యలు తీసుకుంటామని విద్యా కమిషన్ చైర్మన్ హామీ ఇచ్చారని శంకర్ తెలిపారు.

మర్యాదపూర్వకంగా ఎసిబిని కలిసిన ఇందల్వాయి ఎస్సై

నిజామాబాద్ క్రైమ్,ఏప్రిల్ 18 (మనం న్యూస్): నూతనంగా ఎస్సైగా బాధ్యతలు చేపట్టినందుకు ఏసిపి రాజా వెంకటరెడ్డికి ఇందల్వాయి ఎస్సై సందీప్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. శుక్రవారం ఏసీబీ కార్యాలయంలో సందీప్ కుమార్ తో ఏసిబి రాజా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ విధి నిర్వహణలో నికాసుగా ఉండాలని ఎస్ఐకు ఆయన సూచించారు. ముఖ్యంగా ఇందల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని సత్వరంగా పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. ప్రస్తుతం జిల్లా పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న అధిక వడ్డీ వసూలు దారులపై శాఖ పరమైన చర్యలు

తీసుకునే విధంగా కృషియాలని ఏసిపి రాజా వెంకటరెడ్డి సూచించారు.

ఆర్థిక సహాయం అందజేత

భీంగల్ , ఏప్రిల్ 18(మనంన్యూస్): భీంగల్ మండలం బాబాపూర్ గ్రామానికి చెందిన పేదింటి ఆడపిల్ల వివాహానికి శుక్రవారం బాబాపూర్ గ్రామానికి చెందిన కింగ్స్ యూత్ సభ్యులు నేడు జరగబోయే పేదింటి ఆడపిల్ల పెళ్లి వివాహానికి ఇచ్చిన మాట ప్రకారం,తండ్రి లేని ఆ ఆడపడుచుకి ఒక అన్నతమ్ముళ్లగా ముందుకు వచ్చి ఆమెకు,10000, రూపాయలు ఆర్థిక సహాయం కింగ్స్ యూత్ సభ్యులు ఇవ్వడం జరిగింది...ఈ సందర్భంగా ఆర్థిక సహాయం తీసుకున్న పేదింటి ఆడపిల్ల కుటుంబ సభ్యులు మాట్లాడుతూ. పేదవారిని గుర్తించి కింగ్స్ యూత్

సభ్యులు వివాహానికి పదివేల ఆర్థిక సాయం చేయడంతో చాలా సంతోషంగా ఉందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మొహమ్మద్ సూర్జిల్,30 మంది కింగ్స్ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్ ఏరియా బొగ్గు గని కార్మిక సంఘం సమావేశం

మంచిర్యాల, 18, ఏప్రిల్, (మనం న్యూస్): మంచిర్యాల జిల్లా లోని శ్రీరాంపూర్ ఏరియా తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం సమావేశం ఆర్.కే 5 గని ఆవరణలో శుక్రవారం శ్రీరాంపూర్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ పెట్టెం లక్ష్మణ్ అద్వర్యములో నిర్వహించారు ఈ కార్యక్రమమానికి ముఖ్య అతిథిగా సంఘం జనరల్ కార్యదర్శి కె.సురేందర్ రెడ్డి పాల్గొన్నారు .పలు సమస్యలపై చర్చించారు .ఈ సందర్భంగా , ఆర్.కే 5 గని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం పిట్ కమిటీ ని ఏర్పాటు చశారు.పిట్ సెక్రటరీ గా దుర్గం రవి కుమార్, జనరల్ మజ్దూర్,అసిస్టెంట్ పిట్ సెక్రటరీ గా పాపి రెడ్డి, జనరల్ మజ్దూర్,ఆర్గనైజింగ్ సెక్రటరీ గా జాడి శ్రీనివాస్ , జనరల్ మజ్దూర్, ఎ.

రిలే షిఫ్ట్ సెక్రటరీ పిండి రమేష్, కోల్ కట్టర్, సి రిలే షిఫ్ట్ కార్యదర్శి చంద్రగిరి మల్లేష్, మైనింగ్ సర్దార్,డి . రిలే. కార్యదర్శి లు గా సెగ్గం వెంకటేష్, జనరల్ మజ్దూర్,ఇండ్ల భూమ్ రాజ్, సపోర్ట్ మాన్ లను , అదే విధంగా పది మంది కార్యనిర్వాహక సభ్యులను కూడాఎన్నుకున్నారు. ఈ సమావేశం లో డివిజన్ నాయకులు తొంగల రమేష్, మారం శ్రీనివాస్, మారం ఉత్తేజ్ రెడ్డి, రమణారెడ్డి, గోవిందుల రమేష్ లు పాల్గొన్నారు.

ఉద్యోగులకు క్వార్టర్ల కేటాయింపు కౌన్సిలింగ్

రామగిరి ఏప్రిల్ 18 మనం న్యూస్: రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు ఆదేశాల మేరకు రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్టు ఏరియాలలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు సెంటినరీ కాలనీలో గల క్వార్టర్ల కేటాయింపు కొరకు శుక్రవారం నాడు సెక్యూరిటీ కార్యాలయ ఆవరణలో క్వార్టర్ల కేటాయింపు కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగింది.

మొత్తము 167 ఖాళీ క్వార్టర్లు ఉండగా, ఫ్రెష్ అలాట్మెంట్, చేంజ్ ఆఫ్ క్వార్టర్ల కొరకు 31 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకోగా, 11 మంది ఉద్యోగులు హాజరై,10మంది క్వార్టర్లను ఎంపిక చేసుకున్నారు. వారికి త్వరలోనే క్వార్టర్ల కేటాయింపు పత్రాలు ఇస్తామని ఇంచార్జ్ ఎస్టేటుజియం బి.వి.సత్యనారాయణ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు యం.రామచంద్రరెడ్డి, కోట రవీందర్ రెడ్డి, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, డి.పి.ఎం. గుర్రం శ్రీహరి, సివిల్ విభాగం అధికారి ఫణీంద్ర, ఎస్టేట్స్ విభాగం అధికారి మణిదీప్ రెడ్డి, క్వార్టర్ల విభాగం సిబ్బంది మహేందర్, సదయ్య తదితరులు పాల్గొన్నారు.

నాయకుల చిత్ర పటాలకు పాలాభిషేకం

రామడుగు ఏప్రిల్ 18.(మనం న్యూస్) : రామడుగు మండలం లోని దేశరాజు పల్లి గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకున్న విషయం తెలిసిందే.ఇందులో భాగంగా సుమారుగా వంద ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, బేస్మెంట్ లెవల్ పూర్తి ఐన లబ్ధిదారుల ఖాతాలో ప్రభుత్వం లక్ష రూపాయలు జమ చేసిన సందర్భంగా లబ్ధిదారులు మరియు నాయకులు, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ల చిత్ర పటాలకు శుక్రవారం రోజు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్

కమిటీ చైర్మన్ బొమ్మరవేణి తిరుమల తిరుపతి, మాజీ సర్పంచ్ కొల రమేష్, నాయకులు తిరుపతి, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

భూ భారతి చట్టంతో మీ భూమి మీ చేతుల్లో..

- కలెక్టర్ జితేష్ వి పాటిల్..
- ఏళ్ల తరబడి ఉన్న భూ సమస్యలకు పరిష్కారం
- గత ధరణితో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు
- రైతులకు అవగాహన కార్యక్రమం..

కరకగూడెం, ఏప్రిల్ 18(మనం న్యూస్): ప్రజల కోసం, ప్రత్యేకంగా రైతుల భూములపై భరోసా కల్పించేందుకు ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కరకగూడెం మండలం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తాసిల్దార్ నాగప్రసాద్ ఏర్పాటుచేసిన భూభారతి అవగాహన కార్యక్రమానికి ఆర్డీఓ దామోదరావుతో కలిసి శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. భూసమస్యలపై రైతులు మీసేవలో దరఖాస్తు చేసుకుంటే నిర్దేశించిన సమయంలో స్థానిక తాసిల్దారులు పరిష్కరిస్తారన్నారు.ఈ చట్టం ద్వారా భూములకు సంబంధించి అవినీతిని అరికట్టి రెవెన్యూ శాఖను బలోపేతం చేసేందుకు ఉపయోగపడుతుందన్నారు. లోటుపాట్లు, ఇబ్బందులు లేకుండా ముందుకు వెళ్లడానికి పైలట్ స్టడీ కోసం ప్రత్యేకించి కొన్ని మండలాలను ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. ధరణి స్థానంలో తీసుకొచ్చిన భూభారతి నూతన ఆర్వోఆర్ చట్టం భూ వివాదాలకు పరిష్కారం చూపుతుందని పేర్కొన్నారు. వివాదాలకు తావు లేకుండా రైతుల భూములపై వారికి పూర్తి యాజమాన్య హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం అనేక కొత్త అంశాలను పొందుపరుస్తూ కొత్త చట్టాన్ని తెచ్చిందన్నారు. ఈ చట్టం ద్వారా రికార్డుల్లో తప్పుల సవరణలకు ఆస్కారం ఉంటుందన్నారు. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేసేందుకు ముందు భూముల వివరాలు పూర్తిస్థాయిలో సర్వే చేసి మ్యాప్ తయారు చేయనున్నట్లు చెప్పారు. వారసత్వంగా వచ్చిన భూములకు ముందు సమగ్ర విచారణ చేస్తామన్నారు. గ్రామస్థాయిలోని సమస్యలపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టి పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామన్నారు. భూభారతి కొత్త చట్టం ద్వారా హక్కులు, భూ సమస్యలు వెంటనే పరిష్కారమవుతాయని, నిజమైన భూ యజమానికి న్యాయం జరుగుతుందని తెలిపారు. భూ సమస్యల పరిష్కారంలో అప్పీల్ వ్యవస్థ ఉందని తహసీల్దార్ జారీ చేసిన ఆర్డర్ పై ఆర్డీవోకు, ఆర్డీవో జారీ చేసిన ఆర్డర్ పై కలెక్టర్ కు అప్పీలు చేసుకునే వెసులు బాటు తీసుకువచ్చిందని వివరించారు. కొనుగోలు, దానం, తనఖా, పాలు పంపకాల ద్వారా భూమిపై హక్కుల సంక్రమిస్తే తహసీల్దార్ రిజిస్ట్రేషన్ చేసి హక్కుల రికార్డుల్లో మార్పు చేసి హక్కుల రికార్డుల్లో మార్పు చేసి పట్టాదారు పాసు పుస్తకాన్ని జారీ చేస్తారని ఈ ప్రక్రియ ఒకేరోజులో పూర్తయ్యే విధంగా చట్టంలో పొందుపరిచారని తెలిపారు. భవిష్యత్తులో ప్రజల భూ సమస్యలు తలెత్తకుండా భూభారతితో చెక్ పెట్టవచ్చన్నారు. భూమి రిజిస్ట్రేషన్ అనంతరం లబ్ధిదారుడి పట్టా పాస్ బుక్ లో భూ మ్యాపింగ్ నమోదవుతుందని తెలిపారు. భూకమతాలకు భూధార్ కార్డులు జారీ చేయనున్నట్టు చెప్పారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా చట్టంలోని ముఖ్యాంశాలను కలెక్టర్ స్వయంగా సమావేశంలో వివరించారు. మండలానికి చెందిన రైతుల నుంచి భూసంబంధిత ఫిర్యాదులు స్వీకరించి వాటిపై సమీక్షించి పరిష్కార విధానాలను తెలిపారు. రైతులు అడిగిన ప్రతి సమస్యకు కలెక్టర్ సవివరంగా వివరణ ఇచ్చారు. భూభారతి చట్టంపై తహసీల్దార్లు, సిబ్బంది అవగాహన కలిగి ఉండాలన్నారు.నూతన చట్టాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. ప్రతి గ్రామంలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నిష్పక్షపాతంగా చట్టాన్ని అమలు చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం ఇటీవల ప్రవేశ పెట్టిన భూభారతి పోర్టల్ కు గతంలోని ధరణి పోర్టల్ కు చాలా తేడా ఉందని, భూముల విషయంలో ప్రజలకు ఇబ్బందులు కలగవద్దని ఉద్దేశంతో ప్రభుత్వం మరో 14అంశాలను పొందుపరిచిందని తెలిపారు. భూముల విషయంలో ఎలాంటి సమస్యలు వచ్చినా ఏడాదిలో పరిష్కరించుకోవడానికి అవకాశం కల్పించిందన్నారు. భూమి విలువ రూ.5లక్షల లోపు ఉంటే ఆర్డీఓ స్థాయి, రూ.5లక్షలకు పైగా ఉన్న పక్షంలో కలెక్టర్ స్థాయి అధికారులు సమస్యను పరిష్కరించడానికి అవకాశం ఉందని తెలిపారు. ఇక నుంచి పరిశీలించిన తర్వాతనే రిజిస్ట్రేషన్ ప్రక్రియను ముగిస్తారని తెలిపారు. మే 1 నుంచి 31 వరకు పరిశీలన చేసిన అనంతరం జూన్ 2నుంచి పట్టాలు ప్రభుత్వం రైతులకు అందజేస్తుందని తెలిపారు.భూ సమస్యల పరిష్కారానికే కాంగ్రెస్ ప్రభుత్వం'భూ భారతి' చట్టాన్ని తెచ్చిందని దీని ద్వారా రైతులకు సరైన న్యాయం జరుగుతుందని అన్నారు. గత ప్రభుత్వం తెచ్చిన ధరణిలో చాలా పొరపాట్లు జరిగాయని, అర్హులైన రైతులు నష్టపోగా పాలకులు వేల ఎకరాల భూమిని కబ్జా చేశారని అన్నారు. ధరణి ద్వారా అక్రమ రిజిస్ట్రేషన్లు చేసుకున్న వారిని గుర్తించి క్రిమినల్ కేసులు పెట్టాలని అన్నారు. భూ సమస్యలు లేని రాష్ట్రంగా మార్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తున్నదని చెప్పారు. అధికారులు గ్రామ స్థాయిలో రైతులకు అవగాహన కల్పించడంతోపాటు ఈ చట్టంతో కలిగే ప్రయోజనాలను వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో దామోదర్ రావు, ఏడిఏ తాతారావు, తాసిల్దార్ నాగప్రసాద్, ఎంపీడీవో దేవ వర కుమార్, ఎంపీఓ మారుతి, డిప్యూటీ తాసిల్దార్ నాగయ్య,వ్యవసాయ శాఖ అధికారులు ప్రశాంత్ ,అనిల్, వైద్యాధికారి కారం మాదు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

రైతులు కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి ...

- ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళీ నాయక్
- సన్నాలకు రూ.500 బోనస్ అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ : ఎమ్మెల్యే

ఇనుగుర్తి, ఏప్రిల్ 18(మనం న్యూస్): రైతులు పండించిన వడ్లు కొనుగోలు కేంద్రం లోనే అమ్మాలని తద్వారా రైతులకు అదనంగా ఇచ్చే 500రూ. లను పొందవచ్చని మహబూబాబాద్ ఎమ్మెల్యే డా. భూక్యా మురళీ నాయక్ అన్నారు. ఇనుగుర్తి మండలం ఇనుగుర్తి,చెట్లముప్పారం గ్రామాలలో ప్రాథమిక వ్యవసాయం సహకారం సంఘం, చిన్న నాగారం లో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం రోజు ఎమ్మెల్యే డా. భూక్యా మురళీ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర అందించాలి, మహిళా సంఘాలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సన్నాలు పండిస్తున్న రైతులను ప్రోత్సహించడానికి క్వింటాకు 500బోనస్ అందిస్తున్నట్లు గుర్తుచేశారు. రైతులకు ఉచిత కరెంట్, రుణ మాఫీ, రైతు భరోసా, 500బోనస్ అందిస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం అని అన్నారు.దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమని తెలిపారు. అందుకోసమే రాష్ట్రంలో సన్నాలు పండించే రైతులను ప్రోత్సహస్తుందని అన్నారు. దీనివల్ల మన రైతుల వద్దనే సన్నాలు కొని మళ్ళీ మనకే సన్న బియ్యం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అందువలన రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే పంటను అమ్మాలని సూచించారు.వాతావరణ పరిస్థితులు ఎప్పుడు ఎలా ఉంటుందో తెలియడం లేదని కావున కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్లను అందుబాటులో ఉంచుకోవాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. తేమ 17శాతం ఉండాలని తెలియబర్చారు.ఈ కార్యక్రమంలో కేసముద్రం పిఎసిఎస్ అధ్యక్షులు దీకొండ వెంకన్న,శ్రీరామగిరి పిఎసిఎస్ అధ్యక్షులు గుండా వెంకన్న, ఇనుగుర్తి మండల అధ్యక్షులు కూరెల్లి సతీష్,పిఎసిఎస్ డైరెక్టర్ కొట్టం మహేందర్,ఎఎంసి డైరెక్టర్ కొట్టం రాము,మాజీ ఎంపిటిసి తమ్మడపెల్లి కుమార్,ఏఈఓ ముజాహిద్ ,జిల్లా నాయకులు బైరి అశోక్,చిన్నాల కట్టయ్య,గంజి శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వల్లముల మురళి,తుమ్మనబోయిన సతీష్,మామిడి జనార్ధన్, రావుల మల్లేశం, శ్రీనివాస్ రెడ్డి,గండు అజయ్,పరుపాటి రామన్న,మాంకాళి సలీం,మీటు నాయక్ దేవులపల్లి వెంకన్న,చెట్టబోయిన యాకన్న, బూర ఇస్తారి ,పిఏసిఎస్ సిబ్బంది,మండల నాయకులు,మాజీ ప్రజా ప్రతినిధులు, డైరెక్టర్లు, అధికారులు, గ్రామ హమాలీ లు , గ్రామ నాయకులు కార్యకర్తలు తదిపరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి రాస లీలలు

- దేహశుద్ధి చేసిన గ్రామస్తులు

చర్ల, ఏఫ్రిల్ 18 (మనం న్యూస్) : చర్ల మండలంలోని మారుమూల అటవీప్రాంత గ్రామంలో గిరిజన సంక్షేమ శాఖ ఆద్వర్యంలోని ప్రభుత్వ ప్రాదమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విదులు నిర్వహిస్తున్న రమేష్ బాబు వివాహితతో అక్రమ సంబంధం పెట్టుకుని రాసలీలలు నిర్వహిస్తూ రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడటంతో గ్రామస్తులు దేహశుద్ధి చేసారు. గత ఏడాది అక్టోబర్ లో డిప్యూటేషన్ పై గ్రామంలోని పాఠశాలకు డిప్యూటేషన్ పై వచ్చిన రమేష్ బాబు ఒక విద్యార్థి తల్లితో అసభ్యంగా ప్రవర్తించ సాగాడు. కొన్నాల్లకు ఆమెను లొంగదీసుకొని అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. దీనిని గమనించిన గ్రామస్తులు వలపన్ని గురువారం సదరు ఉపాద్యాయుడిని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఆగ్రహించిన గ్రామ యువకులు ఉపాధ్యాయుడిని చితక బాదారు. అనంతరం పెద్దల సమక్షంలో పంచాయతీ నిర్వహించి కుల తప్పు విదించారు. సదరు ఉపాద్యాయుడు వాజేడు మండలంలో విదులు నిర్వహించిన సందర్భంలోనూ తన కామవాంచను ప్రదర్శించడంతో అక్కడి జనం దేహశుద్ధి చేసి పంపారు. అనంతరం చర్ల మండలానికి బదిలీపై వచ్చి ఇక్కడ కూడా అదే తీరును ప్రదర్శించి అబాసుపాలయ్యాడు. ఐటిడిఏ అదికారులు ఈ విషయమై విచారించి ఉపాద్యాయుడిపై చర్య తీసుకోవాలని గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు.

గుడ్ ఫ్రైడే సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

మధిర, ఏప్రిల్ 18(మనం న్యూస్): ఖమ్మం మేత్రాసనం, బయ్యారం విచారణలో పవిత్ర శుక్రవారం (గుడ్ ఫ్రైడే) సందర్భంగా బయ్యారం విచారణ గురువులు ఫాదర్ ప్రేమ్ సాగర్ ఆధ్వర్యంలో సిలువ మార్గం , ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏసుక్రీస్తు పొందిన సిలువ శ్రమలను, పొందిన పాటులను గూర్చి తెలియజేస్తు మడుపల్లి ఆర్.సి.యం చర్చి నుండి బయ్యారం ఆర్.సి.యం చర్చి వరకు సిలువను మోస్తూ, సిలువను ఆరాధిస్తూ, ప్రదర్శనగా బహిరంగ సిలువ మార్గం నిర్వహించారు.ఏసు మరణం ప్రజల పాప విమోచనకు కారణమైన మరణం, కావున ఈ శుక్రవారాన్ని శుభదాయకం అని క్రైస్తవులు నమ్ముతారు, క్రీస్తు శ్రమలను తెలియజేస్తూ, క్రీస్తును ఆరాధిస్తు ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ప్రజలందరూ ఏసుక్రీస్తు మార్గంలో నడుస్తూ, సాటి వారి పట్ల ప్రేమ, గౌరవంతో ఉండాలని, శాంతి సమాధానంతో ఏసు ప్రేమలో జీవించాలని ప్రార్థించారు. ఈ సిలువ మార్గంలో బయ్యారం విచారణ పరిధిలో గల బయ్యారం,మడుపల్లి, దేశినేనిపాలెం, మహాదేవపురం, ఇల్లూరు, అల్లీనగరం, గోవిందాపురం గ్రామాల దీక్షాపరులు, సంఘస్తులు, సంఘ కాపరులు చిలకబత్తిని కిరణ్, చిలకబత్తిని కళ్యాణ్, గుంజా సునిల్ , విశ్వాసులు పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లింల నిరసనలు

గార్ల, ఏప్రిల్ 18(మనం న్యూస్): కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన వక్ఫ్ చట్ట సవరణ బిల్లుపై గార్ల మండల ముస్లింలు స్థానిక జామ మజీద్ అధ్యక్షులు ఎండి. షఫీయుద్దీన్ ఆధ్వర్యంలో శుక్రవారం జామ మజీద్ ఎదురుగా బిల్లును వ్యతిరేకిస్తూ కుడి చెయ్యికి నల్ల రిబ్బన్ కట్టుకొని ప్లే కారడ్స్ తో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పూర్వీకులు దానం చేసిన ఆస్తులతో సహా వక్ఫ్ ఆస్తులను అక్రమంగా స్వాధీనం చేసుకుని వాటిని కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని తీవ్రంగా ఆరోపించారు. వక్ఫ్ బోర్డుల స్వయంప్రతిపత్తిని దెబ్బతీసే ఈ ప్రయత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, కేంద్రం ఈ చట్ట సవరణను పునఃపరిశీలించి, వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమం లో సెక్రెటరీ ఎస్.కె. బుడన్, వైస్ ప్రెసిడెంట్ ఎం.డి. రహీం ఖాన్, ఎండి ఖదీర్, జిలాని, జానీ, మౌలానా, మన్సురలి, జానీ, హైమద్, సత్తార్, అబ్దుల్ హకీం, జబ్బార్, మౌలానా, పటాన్ మీరా, మునీర్, సలీం, అబ్జలి, షబ్బీర్ ఖాన్, అజారుద్దీన్, జాన్ కాన్, సద్దాం, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలుంటే దరఖాస్తు చేసుకోండి

- జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ డా. శ్రీజ
- భూ భారతి చట్టంతో భూ సమస్యలు వేగంగా పరిష్కారం
- చెరువు మాధారం, కొత్త కొత్తూరులో రెవెన్యూ సదస్సులు
- తనిఖీ చేసిన ఇంచార్జ్ కలెక్టర్

ఖమ్మం(నేలకొండపల్లి), ఏప్రిల్ 18(మనం న్యూస్): భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని అమల్లోకి తెచ్చిందని, గ్రామాల్లో చేపడుతున్న రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యల పరిష్కారానికి దరఖాస్తు చేసుకోవాలని ఇంచార్జ్ కలెక్టర్ డా. పి. శ్రీజ తెలిపారు. శుక్రవారం నేలకొండపల్లి మండలం చెరువు మాధారం, కొత్త కొత్తూరు గ్రామాలలో చేపట్టిన రెవెన్యూ సదస్సులను ఇంచార్జ్ కలెక్టర్ తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ, నిర్వహిస్తున్న రిజిస్టర్లు, దరఖాస్తుదారులకు ఇస్తున్న రశీదు, ఏ ఏ సమస్యలపై దరఖాస్తులు వస్తున్నది పరిశీలించారు. సమస్యల పరిష్కారానికి దరఖాస్తు చేసుకుంటున్న రైతులతో సమస్యలు అడిగి తెలుసుకుని, భూ భారతి చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ, రైతులకు తమ భూముల విషయంలో ఉన్న అభద్రత భావాన్ని తావు నీయకుండా జవాబుదారుతనాన్ని పెంచేందుకు భూ భారతి చట్టాన్ని చేపట్టడం జరిగిందని అన్నారు. కొత్త చట్టం ద్వారా లావాదేవీల సేవలు, రిజిస్ట్రేషన్, ముటేషన్, నిషేధిత భూములు, ఆర్ఓఆర్ మార్పులు చేర్పులు వంటి సేవలు సులభతరం అవుతాయని తెలిపారు. రైతులకు, అధికారులకు సులభంగా అర్థం అయ్యేలా సామాన్య, గ్రామీణ ప్రజల, రైతుల సమస్యలు పరిష్కారం అయ్యేలా భూ భారతి చట్టం ఉందన్నారు. హక్కుల రికార్డులలో తప్పుల సవరణకు భూ భారతి లో అవకాశం ఉందన్నారు. పెండింగ్ సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం లభిస్తుందన్నారు. భూమి హక్కులు ఏ విధంగా సంక్రమించిన మ్యుటేషన్ చేసి రికార్డులలో నమోదు చేయవచ్చన్నారు. భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టంలో రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ ఉందని ఇంచార్జ్ కలెక్టర్ తెలిపారు. భూదార్ కార్డుల జారీ జరుగుతుందన్నారు. రైతులకు ఉచిత న్యాయ సహాయం లభిస్తుందని తెలిపారు. చెరువు మాధారం గ్రామంలో చేపట్టిన రెవెన్యూ సదస్సులో భూ సమస్యలకు సంబంధించి 160, కొత్త కొత్తూరు గ్రామానికి సంబంధించి 28 దరఖాస్తులు అధికారులు స్వీకరించారు. స్వీకరించిన దరఖాస్తులకు అధికారులు రశీదులు అందజేశారు. రెవెన్యూ సదస్సుల షెడ్యూల్ ప్రకారం మండలంలోని సదాశివపురం గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం నుండి రెవెన్యూ సదస్సు నిర్వహించి 46 కు పైగా దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎస్డీసి, పాలేరు నియోజకవర్గ ఇంచార్జ్ అధికారి ఎం. రాజేశ్వరి, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, నేలకొండపల్లి మండల తహసీల్దార్ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ తఫజ్జుల్ హుస్సేన్, నాయబ్ తహసీల్దార్ ఇమ్రాన్, ఆర్ఐ లు శ్రీనివాస్, రవి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సోనియా, రాహుల్ చూసి మోడీ భయపడుతున్నారు

- రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య

భద్రాచలం, ఏప్రిల్ 18(మనం న్యూస్): నేషనల్ హెరాల్ కేసులో ఏఐసీసీ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పేర్లను ఛార్జ్ షీట్లో చేర్చడాన్ని నిరసిస్తూ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో కులగణన అడ్డుకోవడానికే సోనియా, రాహుల్ పై అక్రమ కేసుల పెట్టేందుకు బిజెపి ప్రభుత్వం సిద్ధపడుతుందని అన్నారు. రాహుల్ ని చూసి ప్రధాని మోడీ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం భయపడుతున్నది.దేశవ్యాప్తంగా ఈవీ మిషన్లు కాదు, బ్యాలెట్ పేపర్ కావాలన్న ఏఐసీసీ ప్లీనరీ నిర్ణయానికి బిజెపి భయపడుతున్నది.ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి ప్రజలే కాంగ్రెస్ ను గెలిపించుకుంటారు అని అన్నారు.దేశం కోసం త్యాగాలు చేసిన గాంధీ కుటుంబానికి దేశ ప్రజలు అండగా ఉన్నారు.భారతదేశంలో రాజ్యాంగాన్ని పరిరక్షించడానికి అఖిలభారత కాంగ్రెస్ పార్టీ జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది అని తెలిపారు.భారత దేశంలోని అన్ని మతాలను ఏకం చేస్తూ నడవాలన్న కాంగ్రెస్ అభీష్టాన్ని తిరగరాస్తు, ముస్లిం సోదరులకు అన్యాయం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం వక్ఫ బిల్లును మొన్న పార్లమెంట్లో ప్రవేశపెట్టిన విషయమే దాన్ని తిరస్కరిస్తూ కాంగ్రెస్ పార్టీ ప్లీనరీ సమావేశాల్లో తీర్మానం చేయడం పట్ల భయభ్రాంతులకు గురై కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు మీద కేసులు పెట్టడం జరుగుతుంది అని పేర్కొన్నారు.రేపటి నుంచి భద్రాచలం నియోజకవర్గం లో ఏఐసీసీ నిర్దేశించిన జై బాపు, జై భీమ్, జై సమేధాన్ కార్యక్రమం, శనివారం ఉదయం 9 గంటలకు భద్రాచలం పాత మార్కెట్ కూడలి వద్ద ఉన్న గాంధీ విగ్రహం నుండి భద్రాచలం అంబేద్కర్ కూడలి వద్ద ఉన్న డా:బీ ఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు కార్యక్రమం కొనసాగనుంది. ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు తమ్ముళ్ల వెంకటేశ్వరరావు(టివి) చింతిరాల రవికుమార్, ప్రదీప్, వాసిరెడ్డి సాంబ, చింతరాల సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

పేదింటి ఆడపడుచులకు కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ ఓ పథకం వరం

- శాసనసభ్యులు కూనంనేని
- కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులు పంపిణీ



పాల్వంచ, ఏప్రిల్ 18(మనం న్యూస్): పేదరికంలో తమ ఆడపిల్లలకు వివాహం చేయలేని స్థితిలో ఉన్న తల్లిదండ్రులకు, ఆ ఇంటి ఆడపడుచులకు ప్రభుత్వం అమలుచేస్తున్న కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ పథకం ఓ వరం లాంటిదని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ పథకంక్రింద మంజూరైన 46 చెక్కులను శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో లబ్దిదారులకు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం అమలుచేసిన షాదిముబారక్, కళ్యాణలక్ష్మి పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మరింత మెరుగుపర్చి అమలుచేయడం అభినందనీయమన్నారు. పేద కుటుంబాలు, ప్రధానంగా మహిళల ఆర్థిక అవసరాలు గుర్తించి ప్రభుత్వం మహాలక్ష్మి పథకాన్ని, ఆరు గ్యారెంటి పథకాల అమలుకు శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. అతిత్వరలో పూర్తిస్థాయిలో ఈ పథకాలన్నీ అమల్లోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పేదకుటుంబాలు ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని, లబ్ధిపొందాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ వివేక్, మున్సిపల్ కమిషనర్ సుజాత, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, మాజీ డీసీఎంఎస్ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, సీపీఐ, కాంగ్రెస్, టీడీపీ నాయకులు ఎర్రంశెట్టి ముత్తయ్య, కనగాల అనంతరాములు, నూకల రంగారావు, బండి నాగేశ్వరరావు ఉప్పుశెట్టి రాహుల్, గుండాల నాగరాజు, డీ సుధాకర్, అన్నారపు వెంకటేశ్వర్లు, మనేం వెంకన్న, వేములపల్లి రాజశేఖర్, భూక్యా విజయ, జకరయ్య, బిక్కులాల్, కొంగర అప్పారావు, వల్లపు యాకయ్య, బానోత్ రంజిత్, మాడుపు ఉపేంద్ర చారి, వైఎస్ గిరి, ఆదినారాయణ, దుర్గా మహేష్, రాము, వివిధ శాఖల అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మనం Manam

Mahabubnagar
మహబూబ్ నగర్

నకిలీ విత్తనాలు విక్రయించే షాపుల పై ప్రత్యేక నిఘా

- **జిల్లా ఎస్పీ డి. జానకి, ఐపీఎస్**

మహబూబ్ నగర్,ఏప్రిల్ 18(మనం బ్యూరో): నకిలీ విత్తనాలు సరఫరా జరిగి రైతులు నష్టపోక ముందే అధికారులు ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలి, నకిలీ విత్తనాలు గుర్తించి సీజ్ చేయాలి, నకిలీ విత్తనాల వల్ల జిల్లాలో ఒక్క రైతు కూడా నష్టపోవద్దు అని జిల్లా ఎస్పీ డి.జానకీ తెలిపారు. సంభందిత అధికారులు అందరూ సమన్వయంగా పని చేసి రైతులకు నకిలీ వితనాలు సరఫరా జరగకుండా చూడాలి అన్నారు. రాష్ట్రానికి, దేశానికి వ్యవసాయం ముఖ్యమైన ఆధారం అలాంటి వ్యవసాయం చేసే రైతులు ఆరుగాలం కష్టపడి నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత కూడా విత్తన సంస్థలు, డీలర్లు, వ్యాపారులపై పై ఉన్నది, విత్తన వ్యాపార డీలర్స్ బాధ్యతగా మంచి నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలి అన్నారు. రైతులకు, వ్యవసాయానికి నష్టం కలిగేలా నకిలీ విత్తనాలు అమ్మితే అలాంటి వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేస్తాము, పీడీ యాక్ట్ తప్పదు, షీట్స్ నమోదు చేస్తాం అని హెచ్చరించారు. మహబూబ్ నగర్ జిల్లా సరిహద్దుల ప్రాంతంల నుండి నకిలీ విత్తనాలు ఎక్కువగా సరఫరా అయ్యే అవకాశం ఉన్నది, ముందస్తు తనిఖీలు, రైతులకు అవగాహన కల్పించడం, డీలర్స్ కు అవగాహన కల్పించడం, సరిహద్దు లలో పటిష్టమైన నిఘా తో నకిలీ విత్తనాలు నివారించాలి అని ఎస్పీ అన్నారు. రైతులతో

సమావేశాలు నిర్వహించి చైతన్య పరచాలి, గతంలో నకిలీ విత్తనాల కేసుల్లో సంబంధం ఉన్నవారి పై నిఘా ఉంచాలి అని ఆదేశించారు. రైతులు అత్యంత అప్రమత్తంగా ఉండాలి అని ఎస్పీ విజ్ఞప్తి చేసినారు నాణ్యమైన కంపెనీ విత్తనాలు ఎంచుకోవాలి, లేబుళ్లు, ప్యాకింగ్ లేని విత్తనాలు కొనుగోలు చేయవద్దు అని కోరినారు, తక్కువ ధరకు వస్తున్నాయని గ్రామాల్లోకి వచ్చే మధ్యవర్తుల వద్ద విడి విత్తనాలు కొనుగోలు చేయవద్దు, ప్రభుత్వ గుర్తింపు పొందిన డీలర్స్ నుండి విత్తనాలు కొనుగోలు చేస్తే మంచిది అన్నారు. ఇతర రాష్ట్రాల నుండి జిల్లాల లనుండి ఎక్కువ మొత్తంలో విత్తనాలు కొనుగోలు చేసే రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు తీసుకోవాలని కోరినారు. నకిలీ విత్తనాల గురించి, అనుమానిత బ్రోకర్లు, డీలర్ల గురించి పోలీసు వారికి, వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలి అని కోరినారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

- **ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

మహబూబ్ నగర్, ఏప్రిల్ 18(మనం బ్యూరో): రక్తదానం ప్రాణదానంతో సమానమని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా మహబూబ్ నగర్ లోని టి డి గుట్ట వద్ద ఉన్న అగ్నిమాపక కేంద్రంలో ఏర్పాటు చేసిన రక్త దాన శిబిరానికి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రక్తదాన శిబిరాన్ని లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్త దానంతో మరొకరి జీవితానికి వెలుగును నింపవచ్చన్నారు. సమయానికి రక్తం అందక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడం బాధ్యతగా తీసుకోవాలని పిలుపు నిచ్చారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా సిబ్బంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్త దానం చేయడం అభినందనీయమన్నారు. ఇదిలా ఉండగా అగ్నిమాపక దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకొని ఆ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలపై ఏర్పాటు చేసిన ప్రదర్శనను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తిలకించి అగ్ని మాపక సిబ్బంది సేవలను ప్రత్యేకంగా ప్రశంసిూ చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్ని మాపక అధికారి (డి ఎఫ్ ఓ) పి.కిషోర్, స్థానిక స్టేషన్ ఫైర్ అధికారి మల్లికార్జున్ , రాష్ట్ర రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ మెంబర్ లయన్ జి.రమణయ్య,నేషనల్ యూత్ ప్రాజెక్ట్ , నేషనల్ ఇంటిగ్రేటెడ్ ఫోరం ఆఫ్ ఆర్టిస్టు జిల్లా ఇంచార్జ్ యాదవ రాజ్ ,జూనియర్ రెడ్ క్రాస్ సమన్వయ కర్త లయన్ అశ్విని చంద్రశేఖర్, మేనేజర్ అనేల నరసింహా, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

పలువురు ఉపాధ్యాయులపై పోక్సో కేసు నమోదు

- **రామారెడ్డి మండల కేంద్రంలో ఘటన..**
- **షీ టీం కి పిర్యాదు చేసిన విద్యార్థినులు**
- **ఆలస్యంగా వెలుగులోకి..**

కామారెడ్డి క్రైమ్, ఏప్రిల్ 18 (మనం న్యూస్): విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పుతూ వారికి మార్గదర్శకంగా ఉండాల్సిన ఉపాధ్యాయులు దారి తప్పుతున్నారు. విద్యాబుద్ధులు నేర్పాల్సిన చేతులతోనే దారుణాలకు పాల్పడుతున్నారు. చదువులు నేర్పాల్సిన వారే విద్యార్థినుల పట్ల వేధింపులకు గురి చేస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలోని పలువురు విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటనలు ఇటీవల వెలుగుచూశాయి. గడిచిన మూడు నెలల్లో 8 మంది టీచర్లపై పోక్సో కేసులు నమోదయ్యాయి. అనంతరం విద్యాశాఖ వారిని విధుల నుంచి తొలగించింది. అయినా పలువురి తీరు మాత్రం మారడం లేదు. వివరాల్లోకి వెళ్తే కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలంలోని ఓ గ్రామ పాఠశాలలో పనిచేసే పీఈటీ డాన్స్ క్లాసులు చెప్పేవాడు. అయితే కొందరు విద్యార్థినుల పట్ల పీఈటీ అసభ్యకరంగా ప్రవర్తిస్తుండడంతో వారు షీటీంకు ఫిర్యాదు చేశారు. స్పందించిన చైల్ ప్రొటెక్షన్ ఆఫీసర్ స్రవంతి విచారణ చేపట్టారు. 9మంది విద్యార్థినులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేయగా సదరు పీఈటీపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్కు తరలించారు. ఈ విషయాన్ని గోప్యంగా ఉంచడంతో నాలుగు రోజుల తర్వాత ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పీఈటీపై పోక్సో కేసు నమోదైన రామారెడ్డి మండలంలోనే రెండురోజుల క్రితం మరో ఇద్దరు ఉపాధ్యాయులపై కూడా పోక్సో కేసులు నమోదవ్వడం విస్మయానికి కలిగిస్తోంది. ఇదే మండలంలోని పాఠశాలల్లో 8 మంది విద్యార్థినుల పట్ల ఇద్దరు ఉపాధ్యాయులు అసభ్యంగా ప్రవర్తించడంతో వారిపై కేసులు నమోదయ్యాయి. చాలా చోట్ల విద్యార్థినులు హెచ్ఎంలకు చెప్పడంతో సదరు ఉపాధ్యాయులను మందలించి వదిలేస్తున్నా రని సమాచారం. భిక్కనూరు మండలంలో ఇలాగే సెటిల్మెంట్ ఘటన వెలుగులోకి రాగా సదరు టీచ్చ సెటిల్మెంట్ చేసిన వారిపై కూడా కేసులు నమోదు చేశారు. గతంలో బాన్సువాడలోనూ ఇలాంటి ఘటనే జరిగింది.

ఆర్టీసీ షట్టర్ వివాదం..

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 18 (మనం న్యూస్) : కామారెడ్డి పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ పక్కన ఓ షట్టర్ విషయంలో వివాదం నెలకొంది. ఈ క్రమంలో శుక్రవారం షట్టర్ నిర్వాహకుడు, ఆర్టీసీ యూనియన్ నాయకుల మధ్య శుక్రవారం వాగ్వాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో 40 ఏళ్లుగా కందారం పోచయ్య అనే వ్యక్తి హోటల్ నడుపుతున్నాడు. పూరిగుడిసె ఉన్న స్థలంలో సొంతంగా షెటర్ వేసుకుని హోటల్ నడుపుతున్నాడు. అయితే ఈ స్థలం ఆర్టీసీలోని ఓ యూనియన్కు చెందిందని పేర్కొనడంతో ఇరువర్గాల మధ్య వివాదం చోటు చేసుకుంది. షట్టర్కు యూనియన్ నాయకులు తాళం వేయగా బాధితుడు పోచయ్య కోర్టుకు వెళ్లాడు. ఇటీవల కోర్టు తనకు అనుకూలంగా తీర్పునిచ్చిందని పేర్కొంటూ శుక్రవారం పోచయ్య షట్టర్ తాళాలు పగుగొట్టేందుకు ప్రయత్నించాడు. దీంతో శుక్రవారం మళ్లీ యూనియన్ నాయకులు, పోచయ్య కుటుంబానికి వాగ్వాదం జరిగింది. పోలీసులు పోచయ్యాను అదుపులోకి తీసుకుని స్టేషన్కు తరలించారు. కోర్టు తనకు అనుకూలంగా తీర్పునిచ్చిందని అయినప్పటికీ పోలీసులు వారికే మద్దతిస్తున్నారని, కోర్టు ఆదేశాల ప్రకారం షట్టర్ తమకు అప్పగించి న్యాయం చేయాలని వేడుకున్నాడు.

రాష్ట్రంలో విప్లవాత్మకమైన మార్పు

- **ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**



మహబూబ్ నగర్, ఏప్రిల్ 18 (మనం బ్యూరో): తెలంగాణ రాష్ట్రంలో విప్లవాత్మకమైన మార్పు వచ్చిందని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్ నగర్ నియోజకవర్గం లోని ఎదిర రైతు వేదిక దగ్గర వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు తాము పండించిన పంటలను దళారులకు అమ్మకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే తాము పండించిన ధాన్యం అమ్మాలని ఆయన సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా వీలైనన్ని ఎక్కువ వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. రైతులు పండించే సన్న వడ్లు కొనుగోలు చేసి, రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. అంతేకాకుండా మన పిల్లలు చదువుతున్న హాస్టల్ లో, గురుకుల పాఠశాలల్లో కూడా సన్న బియ్యం ద్వారా నే భోజనం అందిస్తున్నామన్నారు. సన్న బియ్యం పంపిణీ చేస్తున్నందుకు రేషన్ షాపుల దగ్గర పండుగ వాతావరణం నెలకొందన్నారు. గతంలో పది వేల కోట్ల రూపాయలు ప్రభుత్వం ఖర్చు చేస్తే 20% కూడా ప్రజలు ఉపయోగించలేదన్నారు. ప్రజా ప్రభుత్వం ఇప్పుడు 13 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి, సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని, 100% మంది లబ్దిదారులు సన్న బియ్యాన్ని రేషన్ షాపుల్లో తీసుకొని తమ పిల్లలకు కమ్మని వంట చేసి పెడుతున్నారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి, డిసిసిబి వైస్ చైర్మన్ కొరమోని వెంకటయ్య, ఐఎన్టీయుసి రాములు యాదవ్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు హన్మంతు, శివశంకర్, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, అనుప ఆంజనేయులు, సిరిగిరి మురళీధర్, రాములు బచ్చన్న, చర్ల శ్రీనివాసులు, కోస్గి శివప్రసాద్, మలుగు ఆంజనేయులు , శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

జిటిహెచ్ సందర్శన

నిజామాబాద్ ప్రతినిధి మనం న్యూస్ ఏప్రిల్ 18: ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ''పేరుకె పెద్ద డాక్టర్లు'' ఇలా వస్తారు..అలా వెళ్ళిపోతారు'' మనం పేపర్లో వచ్చిన అనే శీర్షికపై రాష్ట్ర వైద్య విద్య డైరెక్టర్ గురువారం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి సందర్శించడం జరిగింది. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పనిచేసే పెద్ద పెద్ద డాక్టర్లు సరిగా విధులు నిర్వహించకుండా బయోమెట్రిక్ వేసుకొని ఇలా వచ్చి అలా వెళ్ళిపోవడం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో పూర్తిగా నిర్లక్ష్యం చేయడం వల్ల ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని రోగులు రోగి బంధువులు ఆరోపిస్తున్న విషయం తెలిసిందే.. '' మనం'' దినపత్రికలో వచ్చిన స్టోరీ పై రాష్ట్ర వైద్య విద్య డైరెక్టర్ స్పందించడంతో గురువారం ఆకస్మిక తనీఖి నిర్వహించారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని పెద్ద పెద్ద డాక్టర్లు నిర్వస్తున్న విధులతోపాటు సర్జరీలు, వైద్య చికిత్సలు రోగులకు ఎలాంటి సేవలు చేస్తున్నారని శూన్యంగా పరిశీలించారు. అంతేకాకుండా జిల్లా కలెక్టర్ తో డైరెక్టర్ ఆఫ్ వైద్య విద్య డైరెక్టర్ ఆన్లైన్లో డాక్టర్ల పనితీరుపై సంభాషించారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి వచ్చి రోగులు ఎంతో నమ్మకంతో మెరుగైన వైద్యం కోసం

వస్తుంటారని, అన్ని విభాగాలకు సంబంధించిన ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, తోపాటు హౌస్ సర్జన్, మెడికో విద్యార్థులు రోగులకు సకాలంలో వైద్యం అందించాలని ఆదేశించినట్లు తెలిసింది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు మొహమ్మద్ షబ్బీర్ అలీ సలహాల సూచనలు మేరకు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులకు అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని ఆయన వైద్యులకు సూచించినట్లు విశ్వసనీయ సమాచారం. ముఖ్యంగా పేరుకే పెద్ద పెద్ద వైద్యులని తీరా చూస్తే ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రోగులకు అత్యవసర సమయంలో క్షతగాత్రులకు ఆపరేషన్ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తూనందుకు చిన్న చిన్న వైద్యులు ఏమి చేయలేక హైదరాబాద్లోని ఉస్మానియా, గాంధీ, నిమ్స్ ఆసుపత్రులకు రెఫర్ చేస్తున్నట్లు డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ కార్యాలయానికి ఫిర్యాదులు వస్తున్నాయని, మరోసారి ఇలాంటి పిర్యాదు ఫిర్యాదులు వస్తే మాత్రం ఎంత పెద్ద వైద్యుడైన ఉపేక్షించేది పోదని, శాఖ పరమైన చర్యలు తప్పవని ఆయన ప్రభుత్వ జనరల్ ఆస్పత్రులని వైద్యులకు హెచ్చరించినట్లు తెలిసింది.

బోధన్‌లో ఫైనాన్స్ సంస్థలపై మెరుపు దాడులు

బోధన్, ఏప్రిల్ 18 (మనం న్యూస్): భోధన్ పట్టణంలో అధిక వడ్డీలతో ప్రజలను వేధిస్తున్న ఫైనాన్స్ సంస్థలపై పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు.బోధన్ ఏసీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అనుమతుల్లేని ఫైనాన్స్ కేంద్రాలను తనిఖీ చేసి మూసేశారు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఆదేశాల మేరకు ఈ దాడులు చేపట్టారు. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్లలో ఒకేసారి దాడులు జరిగాయి. వడ్డీ వ్యాపారం పేరుతో ప్రజలను మోసగిస్తున్న సంస్థలపై పోలీసులు చర్యలు ప్రారంభించారు.ప్రజలపై అధిక వడ్డీలతో అప్పులు ఇస్తూ అమాయక ప్రజలపై ఒత్తిడి పెడుతున్న ఫైనాన్స్ మాఫియాలపై వచ్చిన ఫిర్యాదుల మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు సమాచారం.ఇక నుంచి ఇలాంటి అక్రమ వ్యాపారాలు సాగించేవారినీ పోలీస్ శాఖ ఉపేక్షించదని అధికారులు హెచ్చరించారు.

రద్దీ ప్రాంతాల్లో పోలీసులు డాగ్ స్క్వాడ్ తో తనిఖీలు

- **శాంతిభద్రతలను పరిరక్షించేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలి**

టూ టౌన్ ఎస్సై సైదులు

నల్గొండ,ఏప్రిల్ 18 (మనం న్యూస్): నల్లగొండ జిల్లా కేంద్రంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ ఆదేశాల మేరకు టూ టౌన్ ఎస్ఐ సైదులు ఆధ్వర్యంలో నిషేధిత మత్తుపదార్థాలు, ఇతర చట్టవిరుద్ధ వస్తువులను గుర్తించేందుకు శిక్షణ పొందిన నార్కోటిక్ డాగ్ స్క్వాడ్లతో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. బస్టాండు తో పాటు లాడ్జి, దుకాణాలను సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఎస్సై సైదులు మాట్లాడుతూ.. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కల్పిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు.మరియు అదే విధంగా లాడ్జీల్లో బస చేసే వారి సరైన ధ్రువీకరణ పత్రాలు తీసుకోవాలని, వారి యొక్క వివరాలు

రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. చట్ట విరుద్ధంగా ఎవరికీ గదులు ఇవ్వవద్దన్నారు. అనుమానితుల వివరాలను వెంటనే తమకు తెలియజేయాలని సూచించారు. నిబంధనలు పాటించని వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు..

గంజాయి నిర్మూలనకు కృషి చేయాలి

గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని వాటి నిర్మూలనకు ప్రజలు పోలీస్ వారికి సహకరించాలని కోరారు. ఎవరైన నిషేధిత మత్తు పదార్థలు వాడితే చర్యలు తప్పవన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను గమనిస్తూ ఉండాలని సూచించారు. ప్రజల ప్రాణాలకు హాని చేసే గంజాయి లాంటి మత్తు పదార్థాలను నిర్మూలించడంలో ప్రజలు, యువత కీలక పాత్ర పోషించాలని చెప్పారు. పట్టణంలో గంజాయి మూలాలను తొలగించడం కోసం పట్టణ పోలీసులు పటిష్ఠంగా పనిచేస్తున్నామన్నారు. సమాజంలో శాంతిభద్రతలను పరిరక్షించేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్సై అన్నారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు

ఆర్మూర్, ఏప్రిల్ 18(మనంన్యూస్): తెలంగాణ పిసిసి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో, ఏఐసీసీ ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ సమక్షంలో సికింద్రాబాద్, నిజామాబాద్, జైరాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఆయా నియోజకవర్గాల శాసనసభ్యులు, ప్రోటోకాల్ ఇంచార్జ్ విశ్వనాథ్, జిల్లా, ఇన్చార్జ్ రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ ఎంపీ హనుమంతరావు, మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, డిసిసి అధ్యక్షులు లక్ష్మణ్ కుమార్, జువ్వాడ నర్సింగ్ రావు, జిల్లా మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆర్మూర్ బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి నాయకులు ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి, వినయ్ కుమార్ రెడ్డి, ఊరు వివిధ పార్లమెంట్ స్థాయి నాయకులతో సమీక్ష సమావేశం గాంధీభవన్లో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పిసిసి మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ నిబంధనలకు విరుద్ధంగా, ప్రభుత్వ ఆశయాలకు అనుకూలంగా, కాంగ్రెస్ పార్టీలోని ప్రతి ఒక్కరూ ప్రజల్లో ఉండి, ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలను అర్హులైన వారికి అందిస్తూ, ప్రజా ధారణ పొందాలన్నారు. పార్టీలో ఉంటూ వ్యతిరేక పనులు చేపట్టిన, సంక్షేమ పథకాల్లో అవినీతికి పాల్పడిన వారు ఎంతటి వారైనా సహించేలేదని రాష్ట్ర పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ సూచించారు.

నేషనల్ హెరాల్ కేసులో సోనియా,రాహుల్ గాంధీపై చార్జ్‌షీట్‌పై

- **కాంగ్రెస్ కార్యకర్తల నిరసన**

బోధన్, ఏప్రిల్ 18 (మనం న్యూస్): నేషనల్ హెరాల్ కేసులో కాంగ్రెస్ నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పేర్లను చార్జిషీట్లో చేర్చడాన్ని తీవ్రంగా ఖండిస్తూ బోధనలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు న్యాయబద్ధంగా పోరాటం చేస్తామని, బీజేపీ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గుజరాత్ పర్యటనలో రాహుల్ గాంధీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్న సమయంలో ఈ కేసులు వేయడం రాజకీయం ముసుగులో అణిచివేత చర్యగా అభివర్ణించారు. బీసీ డిక్లరేషన్ వంటి కీలక విషయాల్లో ధైర్యం లేని ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా అక్రమ కేసులతో ప్రతిపక్షాన్ని భయపెట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు.కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష హోదాలో ఉండగానే బీజేపీ భయపడుతోంది. రేపు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తమ స్థితి ఏమవుతుందో అన్న భయంతోనే ఇలాంటి చర్యలకు దిగుతున్నార అన్నారు.రాహుల్ గాంధీ కుటుంబానికి దేశ ప్రజల అండగా నిలుస్తారని స్పష్టం చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో తూము శరత్ రెడ్డి, టౌన్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు తలారి నవీన్, మీర్ నజీర్ అలీ డబ్బు గుండేటి రాములు, హర్షద్ భూమేష్, కిషోర్, మైనార్టీ అధ్యక్షుడు కలీం, ఎస్టీ సెల్ సాయి కృష్ణ, హైమత్, సలీం, ఇమ్రాన్, ఆర్ నవీన్, జునేత్, కమర్, ఇనాయత్ అలీ, అశోక్, తరుణ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

లాఠీ చార్జ్ చేయడం సిగ్గుచేటు

మోర్తాడు మనం న్యూస్ ఏప్రిల్ 18: కళ్యాణ్ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలలో లక్ష రూపాయల తో పాటు తులం బంగారం అమలు చేసి అందించాలంటూ నిలదీస్తే లారి లాటి చార్జి చేయడం సిగ్గుచేటు అని మోర్తాడ్ మండల నాయకుడు మండిపడ్డారు. భీమ్గల్ మండలంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను లబ్ధిదారులకు లక్ష రూపాయల తో పాటు తులం బంగారం అందించాలంటూ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి మంత్రి జూపల్లి కృష్ణారావు వినతిపత్రం అందించడమే కాకుండా, ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలంటూ బాల్కొండ ఎమ్మెల్యే లబ్ధిదారులతో, టీఆర్ఎస్ నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేస్తే పోలీసులతో లారి చార్జి చేయించడం, కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు నిదర్శనంగా నిలిచిందని మోర్తాడ్ మండల టీఆర్ఎస్ నాయకులు ఖండిస్తూ శుక్రవారం టీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పత్రిక విలేకరుల సమావేశంలో ఆరోపించారు. బాల్కొండ నియోజకవర్గం బీమ్ గల్ లో కల్యాణ లక్ష్మీ షాది

ముబారక్ చెక్కుల పంపిణీ చేసేందుకు మంత్రి జూపల్లి కృష్ణారావు కార్యక్రమంలో ఆడ బిడ్డల పెళ్ళి కి లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పి ఆరు గ్యారంటీ లో ముఖ్యమంత్రి చెప్పారు. అధికారంలోకి వచ్చిన నెల రోజుల తర్వాత తులం బంగారం ఇస్తామని చెప్పి ఇప్పుడు 16 నెలలు గడుస్తున్నా ఇవ్వక పోవడంతో ప్రజల తరపున ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి బిఆర్ఎస్ నాయకులు అడిగితే బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి సునీల్ రెడ్డి పోలీసులను ఉసిగొలిపి బిఆర్ఎస్ కార్యకర్తలపై లారీ చార్జీ చేయించి 30 మంది .మా కార్యకర్తల పై విచక్షణ రహితంగా లాఠీ దెబ్బలు కొట్టడాన్నీ మోర్తాడ్ మండల పార్టి తరపున దీన్ని తీవ్రంగా ఖండింస్తున్నాము. బాల్కొండ చరిత్ర లో ఇలాంటి సంఘటన లు గతంలో ఎప్పుడు జరగలేదని దీని అంతటికీ కారణం కాంగ్రెస్ పార్టీ నాయకులు మూత్యాల సునీల్ రెడ్డే కారణం అని దీనికి బాధ్యత వహిస్తూ తులం బంగారు అడిగితె లాఠీ దెబ్బలు కొట్టడం వలన చాలా మంది గాయపడ్డారు అని బేషరతుగా క్షేమాపన చెప్పాలని మోర్తాడ్ మండల పార్టీ అధ్యక్షులు కల్లెడ ఏలియా డిమాండ్ చేశారు.మీరు ఎన్ని కుట్రలు చేసిన ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసేదాక ప్రశ్నిస్తూనే ఉంటామని ప్రజల తరపున పోరాడుతామని మీ అధికార జులుంతో పోలీసులను అడ్డుపెట్టుకుని లాఠీ దెబ్బలకు తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదని అన్నారు. ఇకనైనా ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని కోరారు. ఇట్టి కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రవి తదితరులు పాల్గొన్నారు

గర్భిణులకు పోషకాహారం అవసరం

- **ఐసిడీఎస్ అధికారిణి పద్మజ సూచన**

బోధన్, ఏప్రిల్ 18 (మనం న్యూస్): గర్భిణీ స్త్రీల ఆరోగ్యం బాగుండాలంటే వారు తప్పనిసరిగా పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని ఐసిడిఎస్ బోధన్ ప్రాజెక్ట్ అధికారిణి పద్మజ తెలిపారు. శుక్రవారం బోధన్ మండలంలోని మా వంది ఖుర్ద్ గ్రామం,పట్టణంలోని ద్యాకం గల్లీ అంగన్వాడి కేంద్రాల్లో 'పోషణ పక్వాడ' కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలు తీసుకోవలసిన సరైన ఆహార నియమాలపై ఆమె అవగాహన కల్పించారు.రక్తహీనతను నివారించాలంటే తాజా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, చిరుధాన్యాలు, పాలు వంటివి సమృద్ధిగా తీసుకోవాలని సూచించారు.అలా చేస్తే తల్లీబిడ్డల ఆరోగ్యం మెరుగవుతుందని చెప్పారు.పోషకాహారం తీసుకోకపోతే వచ్చే ఆరోగ్య సమస్యలను వివరించిన

పద్మజ, పిల్లలకు బయట జంక్ ఫుడ్ ఇవ్వకూడదని, ఇంట్లో తయారుచేసిన ఆరోగ్యకరమైన భోజనమే అందించాలని తల్లిదండ్రులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ గోపిలక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట రమణ, గ్రామ కార్యదర్శి రాజేష్, పోషణ అభియాన్ కోఆర్డినేటర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

భూ భారతి చట్టంపై అవగాహన కలిగి ఉండాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నిజామాబాద్ రూరల్, ఏప్రిల్ 18(మనం న్యూస్): భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టంపై రైతులు పరిపూర్ణమైన అవగాహన ఏర్పర్చుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. ఈ చట్టంలోని అంశాలపై గ్రామాలలో విస్తృతంగా చర్చిస్తూ, తోటి రైతులకు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.శుక్రవారం డిచ్పల్లి మండలంలోని నడిపల్లిలో, మోపాల్ మండల కేంద్రంలో గల రైతు వేదికలలో వేర్వేరుగా నిర్వహించిన భూభారతి చట్టం అవగాహన సదస్సులలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూ భారతి చట్టం ద్వారా రైతులకు.చేకూరే ప్రయోజనాల గురించి కలెక్టర్ ఒక్కో అంశం వారీగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. భూ సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం రూపొందించిన భూ భారతి (ఆర్ ఓ ఆర్) చట్టం - 2025 జనవరిలో గెజిట్ రూపంలో వచ్చిందని, సమగ్ర అంశాలను పొందుపరుస్తూ ప్రభుత్వం ఏప్రిల్ 14న ఈ చట్టాన్ని ప్రవేశపెట్టిందని కలెక్టర్ వివరించారు. భూ సమస్యలు కలిగిన రైతులు ఏడాది కాలం లోపు భూభారతి పోర్టల్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అవగాహన సదస్సుల అనంతరం మే మొదటి వారంలో అధికారులు గ్రామాల వారీగా సదస్సులను ఏర్పాటు చేసి అర్జీలు స్వీకరిస్తారని అన్నారు. భూ భారతి చట్టం ప్రకారం భూ సంబంధిత సమస్యలను నిర్దిష్ట గడువులోపు పరిష్కరించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. సమస్య పరిష్కారం కాకుంటే కలెక్టర్ కు లేదా సీసీఎల్ఏ కు అప్పీల్ చేసుకోవచ్చని, ఈ చట్టంలో కొత్తగా ల్యాండ్ ట్రిబ్యునల్ కూడా అందుబాటులో ఉంటుందని సూచించారు. ధరణి లో రెవెన్యూ కోర్టులను తొలగించడం వల్ల భూ వివాదాల విషయంలో రైతులు సివిల్ కోర్టులను ఆశ్రయించాల్సి వచ్చేదని గుర్తు చేశారు. దీనివల్ల రైతులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం ప్రస్తుత భూభారతి చట్టం ద్వారా ఇదివరకటి తరహాలోనే రెవెన్యూ కోర్టులు పునరుద్ధరించిందని వివరించారు. భూ సమస్యలను స్థానికంగానే పరిష్కరించుకునేందుకు రెవెన్యూ డివిజన్ అధికారికి, కలెక్టర్ కు అధికారాలు కల్పించారని తెలిపారు. అయినా కూడా సమస్య పరిష్కారం కాలేదని రైతులు భావిస్తే అప్పీలు చేసుకోవచ్చని సూచించారు. ఆర్థిక స్థోమత లేని పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం కూడా సమకూర్చడం జరుగుతుందని తెలిపారు. రెవెన్యూ డివిజన్ అధికారి నిర్ణయం సరైంది కాదని భావిస్తే కలెక్టర్ వద్ద, కలెక్టర్ నిర్ణయంపై అభ్యంతరం ఉంటే ల్యాండ్ ట్రిబ్యునల్ కు అప్పీల్ చేసుకోవచ్చని అన్నారు.

కాగా, ప్రతి గ్రామంలో రెవెన్యూ రికార్డులు తయారు చేసి, ప్రతి సంవత్సరం గ్రామాలలో రికార్డు డిస్ ప్లే చేయడం జరుగుతుందని అన్నారు. రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రతి గ్రామంలో గ్రామ పరిపాలన అధికారులను నియమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. మనిషికి ఆధార్ కార్డు లాగా భూమికి భూదార్ సంఖ్య కేటాయింపు చేస్తారని, దీని ద్వారా భూ ఆక్రమణలకు అవకాశం ఉండదని అన్నారు. ప్రస్తుతం ధరణి లో ఉన్న భూ రికార్డులు భూ భారతి చట్టంలో కొనసాగుతాయని తెలిపారు. భూ హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు అర్హులైన వారు జిల్లాలో నూతన చట్టం అమల్లోకి వచ్చిన ఏడాదిలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పెండింగ్ లో ఉన్న సాధా బైనామా పరిష్కారం కోసం భూ భారతి చట్టంలో ప్రభుత్వం అవకాశం కల్పించిందని అన్నారు. వీటికి సంబంధించి త్వరలోనే మార్గదర్శకాలు వెలువడనున్నాయని తెలిపారు. భూ భారతి చట్టం పై ఏమైనా సందేహాలు ఉంటే తీర్చడానికి అధికారులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారని అన్నారు. ఈ సదస్సులలో నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, ఐడిసీఎంఎస్ చైర్మన్ తారాచంద్, నిజామాబాద్ మార్కెట్ కమిటి చైర్మన్ ముప్ప గంగారెడ్డి, డిచ్పల్లి మండల స్పెషల్ ఆఫీసర్ యోహాన్, స్థానిక అధికారులు, రైతులు పాల్గొన్నారు.

టీజీ ఈ జేఏసీ నూతన కమిటీ ఎన్నిక

నిజామాబాద్, ఏప్రిల్ 18(మనం న్యూస్): తెలంగాణ ఉద్యోగ,గెజిటెడ్ అధికారుల, ఉపాధ్యాయుల, కార్మిక,, పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ టి జిఈ జేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్ మరియు రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఏలూరీ శ్రీనివాస్ ఆదేశానుసారం... ఈ రోజు టీఎన్జీవో జిల్లా కార్యాలయం నందు, టీజీఈ జెఏసి జిల్లా నూతన కార్యవర్గ ఏర్పాటు సమావేశము అట్టహాసంగా నిర్వహించుకోగా... కార్యక్రమంలో భాగంగా మొదటగా టీజీవో జిల్లా అధ్యక్షులు అలుక కిషన్ మాట్లాడుతూ.. . గౌరవ టీజీఈ జెఏసి రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు టీఎన్జీవోస్' జిల్లా అధ్యక్షులు నాశెట్టి సుమన్ కుమార్ పేరును ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్ పదవికి ప్రతిపాదించగా... టి జి ఈ జెఏసి భాగస్వామ్య సంఘాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులందరూ చప్పట్లతో, ముక్తకంఠంతో అంగీకరించగా, ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్ నాశెట్టి సుమన్ కుమార్ ని ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటించారు. టి జి ఈ జెఏసి జిల్లా కన్వీనర్ గా టీజీవో జిల్లా అధ్యక్షులు అలుక కిషన్ , కో కన్వీనర్ గా పి ఆర్ టి యు మోహన్ రెడ్డి ని మరియు కో చైర్మన్ లు గా యు టి ఎఫ్, రమేష్ టి జి ఆర్ ఈ ఎస్ ఏ ఎల్ రమణ రెడ్డి ఎస్ టి యు ధర్మేందర్ క్లాస్ ఫోర్ అసోసియేషన్ శ్రీనివాస్ టిఆర్టిఎఫ్ కృష్ణారెడ్డి , టిపిటిఎఫ్ సురేష్ టి యు.యు రాము లతీకర్ గవర్నమెంట్ జేఎల్ఎస్ అసోసియేషన్ నర్సయ్య డి టి ఎఫ్ బాలయ్య , పెన్షనర్ అసోసియేషన్ రవీందర్ వైస్ చైర్మన్ గా టీఎన్జీవో జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్ టీజీవో జిల్లా కార్యదర్శి సంఘం అమృత్ కుమార్ ఫైనాన్స్ సెక్రటరీ జాకీర్ హుస్సేన్ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.అనంతరం రాష్ట్ర కమిటీ కూర్పు మేరకు జిల్లాలో కూర్పు ఏర్పరచుకొని, ఏకగ్రీవంగా ఎన్నికైన అనంతరం రాష్ట్ర కమిటీ తెలిపిన 57 అంశాల ఉద్యోగుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి రాష్ట్ర నాయకత్వం ప్రకటించిన కార్యచరణ ప్రకారంగా జిల్లాలో కూడా ఉద్యమాలు నిర్వహించుటకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

ఐ.డీ.ఓ.సీ (కలెక్టరేట్)లో కంట్రోల్ రూం ఏర్పాటు

నిజామాబాద్, ఏప్రిల్ 18(మనం న్యూస్): జిల్లాలో ప్రస్తుత వేసవిలో ఎక్కడైనా తాగునీటి సమస్య తలెత్తినా, ధాన్యం అమ్మకాలలో రైతులకు కొనుగోలు కేంద్రాల వద్ద ఇబ్బందులు నెలకొని ఉంటే, వారు ఫిర్యాదులు చేసేందుకు వీలుగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా పాలనాధికారి రాజీవ్ గాంధీ హనుమంతు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 6644 కు ఫోన్ చేసి సమస్యలు తెలుపవచ్చని అన్నారు. కంట్రోల్ రూమ్ కార్యాలయాల పని దినాలలో ప్రతి రోజు ఉదయం 10.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు అందుబాటులో ఉంటుందని, నిర్ణీత వేళల్లో టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేసి ధాన్యం అమ్మకాలు, తాగునీటి సరఫరాలో ఏమైనా సమస్యలు ఉంటే తెలుపవచ్చని సూచించారు. వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి తక్షణమే వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లేందుకు వీలుగా కంట్రోల్ రూమ్ లో ప్రత్యేకంగా సిబ్బందిని నియమించామని అన్నారు.అదేవిధంగా, తాగునీటి సమస్య ఉన్నట్లయితే సెల్ నెంబర్ : 7382844951 కు, ధాన్యం అమ్మకాలలో ఇబ్బందులు ఉంటే సెల్ నెంబర్ : 7382844769 కు వాట్సాప్ ద్వారా సమాచారం అందించవచ్చని కలెక్టర్ సూచించారు. మెయిల్ ద్వారా కూడా సమాచారం తెలియజేయవచ్చని అన్నారు. జిల్లా ప్రజలు, రైతుల సౌకర్యార్థం నెలకొల్పిన కంట్రోల్ రూమ్ సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.

విజయవంతంగా ముగిసిన జాతీయ సేవా ప్రత్యేక శిబిరం

భీంగల్ , ఏప్రిల్ 18(మనం న్యూస్): భీంగల్ మండలం నలంద డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో గతవారం రోజుల నుండి బాబానగర్ గ్రామంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ శిబిరం శుక్రవారం నాటికి ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ సురేఖ హాజరై ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. కళాశాల ఆధ్వర్యంలో ప్రారంభం నుండి ముగింపు వరకు చేపట్టిన వివిధ జాతీయ సేవా కార్యక్రమాల గురించి వివరించారు.అలాగే వారం రోజుల నుండి జాతీయ సేవ కార్యక్రమాలు చేసిన కళాశాల విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ సంజీవ్ కుమార్ చేతుల మీదుగా విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.అలాగే ఎన్ఎస్ఎస్ వాలంటీర్లతో వ్యక్తిగత వికాసం సైబర్ క్రైమ్ ఎయిడ్స్ వంటి వ్యాధుల గురించి అనేక విషయాలపై అవగాహన కల్పించారు. అలాగే ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ సంజీవ్ కుమార్ మాట్లాడుతూ. గత వారం రోజుల నుండి నిర్వహించిన ఎన్ఎస్ఎస్ శిబిరానికి సహకరించిన గ్రామ వీడీసీ అధ్యక్షుడు సురేష్, మాజీ సర్పంచ్, వీడీసీ వారికి గ్రామస్తులకు సహకరించడంతో ఈ కార్యక్రమం విజయవంతం చేయడం జరిగింది. ప్రోగ్రాం సహకరించి కోఆర్డినేటర్ చేస్తూ సహకరించిన గ్రామస్తులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల రెస్పాండెంట్ వెంకట కిషన్,ఎంపీపీఎస్ హెడ్మాస్టర్ సుష్మ,కళాశాల అధ్యాపకులు శ్రీనివాస్,సుధా, ప్రీతి, అధ్యాపక బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయం- అంతర్జాతీయం

కర్ణాటకలో 'రోహిత్ వేముల' చట్టం చేయాలి: రాహుల్ గాంధీ

ఢిల్లీ,ఏప్రిల్ 18: విద్యావ్యవస్థలో నేటికీ బలహీన వర్గాలు కుల వివక్షను ఎదుర్కొంటున్నాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. దళిత విద్యార్థులెవరూ అటువంటి వివక్షను ఎదుర్కోకుండా ఉండాలంటే 'రోహిత్ వేముల' చట్టాన్ని రూపొందించి.. అమలు చేయాలని కర్ణాటక సీఎం సిద్ధరామయ్యకు లేఖ రాశారు. నేటికి కూడా మన విద్యావ్యవస్థలో దళిత, ఆదివాసీ, ఓబీసీ వర్గాలకు చెందిన లక్షలాది మంది విద్యార్థులు ఇటువంటి వివక్షను ఎదుర్కోవడం సిగ్గుచేటని రాహుల్ పేర్కొన్నారు. రాజ్యాంగ రూపకర్త అంబేడ్కర్ జీవితంలో ఎదుర్కొన్న కుల వివక్ష గురించి ఈ లేఖలో రాసుకొచ్చారు. వెనుకబడిన వర్గాల బిడ్డగా అంబేడ్కర్ ఎదుర్కొన్న కష్టాన్ని మరే బిడ్డ ఎదుర్కోకుండా చర్యలు తీసుకోవడానికి సిద్ధరామయ్య కృషి చేస్తారని తాను నమ్ముతున్నట్లు రాహుల్ పేర్కొన్నారు. కొందరు వ్యక్తులు చూపిన వివక్షతో రోహిత్ వేముల, పాయల్ తడ్వి, దర్శన్ సోలంకి వంటి మంచి భవిష్యత్తు ఉన్న ఎందరో యువకులు ప్రాణాలు కోల్పోయారని.. ఇకనైనా ఇటువంటి హత్యలకు ముగింపు పలకాల్సిన సమయం ఆసన్నమైందని రాహుల్ అన్నారు. 2016 జనవరి 17న హెచ్‌సీయూ విద్యార్థి రోహిత్ వేముల ఆత్మహత్య చేసుకున్నాడు. యూనివర్సిటీ అధికారులు, ఇతర విద్యార్థి సంఘాల వేధింపుల కారణంగానే రోహిత్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని దళిత సంఘాలు దేశవ్యాప్తంగా ఉద్యమించాయి. విద్యాసంస్థల్లో దళిత విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం రోహిత్ చట్టం రూపొందించాలని డిమాండ్ చేశారు. అతడు ఆత్మహత్య చేసుకున్న ఎనిమిదేళ్ల తర్వాత మృతుడి తల్లి విజ్ఞప్తి మేరకు తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కేసుపై పునర్విచారణ ప్రారంభించింది.

ఢిల్లీ పరిపాలనకు తమిళనాడు తలొగ్గదు: స్టాలిన్

చెన్నై,ఏప్రిల్ 18: ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా పార్టీలను చీల్చడం, ప్రభుత్వాలను ఏర్పాటు చేయడం తమిళనాడులో కుదరదని ఆ రాష్ట్ర సీఎం ఎంకే స్టాలిన్ స్పష్టం చేశారు.

తమిళనాడులో 2026లో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పాటవుతుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై ఆ రాష్ట్ర సీఎం ఎంకే స్టాలిన్ స్పందించారు. ఢిల్లీ పరిపాలనకు లొంగని ప్రత్యేకత తమిళనాడుకు ఉందని.. భాషా వివాదం నేపథ్యంలో ఇప్పటికే ఆ విషయాన్ని కేంద్ర ప్రభుత్వానికి తెలియజేశామన్నారు. ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా పార్టీలను చీల్చడం, ప్రభుత్వాలను ఏర్పాటు చేయడం ఇక్కడ కుదరదని వ్యాఖ్యానించారు. 2026 ఎన్నికల్లో కూడా తమ పార్టీనే అధికారం చేపడుతుందని ధీమా వ్యక్తం చేశారు.

తమిళనాడుకు నీట్ నుంచి మినహాయింపు ఇస్తామని.. త్రిభాషా సూత్రాన్ని అమలు చేయబోమని అమిత్ షా హామీ ఇవ్వగలరా అని ప్రశ్నించారు. డీలిమిటేషన్ (పార్లమెంటరీ ఎన్నికల్లో)తో సీట్లను తగ్గించమని చెప్పగలరా అని నిలదీశారు. ఇటీవల కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తమిళనాడు ప్రజలను కించపరిచేలా మాట్లాడారని.. అమిత్షా సైతం అదే విధమైన వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. రాజ్యాంగం ప్రకారమే కేంద్రం, రాష్ట్రాలు ఏర్పాటయ్యాయని.. ఎవరూ ఎవరికి సబార్డినేట్ కాదని రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ పేర్కొన్నారని పునరుద్ఘాటించారు.

వచ్చే ఏడాది జరగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా అన్నాడీఎంకేతో కలిసి పోటీ చేయనుంది. 2026లో తమిళనాట అధికారంలోకి వస్తామని భాజపా అగ్రనేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. కాగా.. జాతీయ విద్యలో త్రిభాషా సూత్రం, డీలిమిటేషన్ మొదలైన విషయాలపై తమిళనాడు ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో తీవ్రంగా తలపడుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో స్టాలిన్

ప్రభుత్వం.. కేంద్రం అనుసరిస్తున్న విధానాలపై విస్తృతంగా పోరాటం చేస్తోంది.

దీని కోసం ఇటీవల ఆయన ఓ కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రాల స్వయం సాధికారత కోసం అత్యున్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసెఫ్ నేతృత్వంలో ఈ కమిటీ పని చేస్తుందని తెలిపారు. రాష్ట్రాల చట్టబద్ధ హక్కులను పరిరక్షించడంతోపాటు కేంద్ర, రాష్ట్రాల మధ్య సంబంధాలను మెరుగుపరచడమే ఈ కమిటీ లక్ష్యమని స్టాలిన్ వివరించారు.

వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా బోధన్ లో ముస్లింల నిరసన

బోధన్, ఏప్రిల్ 18 (మనం న్యూస్): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ బిల్లుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ బోధన్లో ముస్లిం సమాజం శుక్రవారం నిరసన చేపట్టింది. జుమ్మా నమాజు అనంతరం భారీ

సంఖ్యలో ముస్లింలు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్దకు చేరుకుని శాంతియుతంగా ఆందోళన చేపట్టారు.వారి తరఫున మత పెద్దల నేతృత్వంలో ఒక వినతిపత్రాన్ని సబ్ కలెక్టర్ వికాస్ మహతోకు అందజేశారు. వక్ఫ్ బిల్లులోని పలు నిబంధనలు ముస్లింల హక్కులను హరించేందుకు దారి తీసే విధంగా ఉన్నాయని వారు ఆరోపించారు. ఫ్లెక్సీలు, ప్లకార్డులు ధరించి 'వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బిల్లును దేశవ్యాప్తంగా ముస్లిం సమాజం తీవ్ర నిరసన వ్యక్తం చేస్తోందని, ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే పోరాటం ముమ్మరంగా మారుతుందని హెచ్చరించారు.వక్ఫ్ ఆస్తుల పరిరక్షణే లక్ష్యంగా కొత్త బిల్లును తేవాలని కోరుతూ వారు విజ్ఞప్తి చేశారు.

జేఈఈ (మెయిన్) సెషన్-2 ఫైనల్ కీ విడుదల..

ఢిల్లీ, ఏప్రిల్ 18: జేఈఈ (మెయిన్) సెషన్- 2 పరీక్షల తుది కీమళ్లీ విడుదలైంది. తొలుత గురువారమే జేఈఈ (మెయిన్) రెండో సెషన్ పేపర్ -1కు సంబంధించిన తుది కీని జాతీయ పరీక్షల మండలి(ఎన్టీఏ)విడుదల చేసినప్పటికీ.. కొద్దిగంటల్లోనే తొలగించింది. ఇందుకు కారణమేంటో



తెలపకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర గందరగోళానికి గురైన విషయం తెలిసిందే. దీంతో ఎన్టీఏ అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారంటూ పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమయ్యాయి. తాజాగా శుక్రవారం మధ్యాహ్నం మరోసారి తుది కీని విడుదల చేసిన ఎన్టీఏ.. ఫిజిక్స్లో రెండు ప్రశ్నలను (ఐడీలు: 347577562, 347577939) విరమించుకున్నట్లు పేర్కొంది. మరోవైపు, జేఈఈ మెయిన్ పరీక్షల షెడ్యూల్లో పేర్కొన్న ప్రకారం ఏప్రిల్ 17 నాటికి ఫలితాలు విడుదల చేయాల్సి ఉన్నప్పటికీ.. నిర్ణీత గడువులోగా రిజల్ట్స్ ఇవ్వడంలోనూ ఎన్టీఏ విఫలమైందంటూ విమర్శలు వస్తున్నాయి. దీంతో శుక్రవారం ఉదయం స్పందించిన ఎన్టీఏ.. శనివారం లోగా ఫలితాలు విడుదల చేయనున్నట్లు 'ఎక్స్' వేదికగా ప్రకటించింది. అలాగే, ఈ మధ్యాహ్నం 2గంటల కల్లా తుది కీ విడుదల చేస్తామని ప్రకటించడంతో విద్యార్థులు ఎదురుచూశారు. అయితే, తుది కీని సైతం చెప్పిన సమయం కన్నా గంటకు పైగా ఆలస్యంగా విడుదల చేయడంతో ఎన్టీఏ అధికారుల తీరుపై పలువురు నెటిజన్లు అసహనం వ్యక్తం చేస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారు.

అమెరికా ప్రయాణమా..? జాగ్రత్త

వాషింగ్టన్, ఏప్రిల్18: అమెరికాలో ఇటీవల కాలంలో తనిఖీలు భారీగా పెరిగినట్లు నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ (సీబీపీ) ఆఫీసర్లు ఎలక్ట్రానిక్ వస్తువులను కూడా పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనేపథ్యంలో అమెరికన్ ఇమిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్, అమెరికన్ సివిల్ లిబర్టీస్ యూనియన్ పలు విషయాలతో ఎఫ్ఏక్యూ (తరచుగా అడిగే ప్రశ్నలు)ను జారీ చేశాయి. దీంతోపాటు సీబీపీ ఆఫీసర్లు ప్రయోజనకర సమాచారాన్ని వెబ్సైట్లో ఉంచారు. ఇవి కేవలం వీసాదారులకే కాదు.. గ్రీన్కార్డు హోల్డర్స్, అమెరికా పౌరులకు కూడా వర్తిస్తాయి. కాకపోతే వారి హోదాను బట్టి హక్కులు మారుతుంటాయి. అమెరికాలో ప్రవేశించేవారి వద్ద ఉండే ఫోన్లు, ల్యాప్టాప్, టాబ్లెట్లు, ఇతర గ్యాడ్జెట్లను తనిఖీ చేయడానికి సీబీపీ సిబ్బందికి అధికారం ఉంది. దేశంలోకి ప్రవేశించే ప్రదేశాల్లో, ఎయిర్ పోర్టుల్లో, నౌకాశ్రయాల్లో ఈ చెకింగ్స్ ఉంటాయి. ఇందుకోసం ఎటువంటి వారెంట్ అవసరం లేదు.

ఈ తనిఖీలు రెండు రకాలుగా ఉంటాయి. తొలుత మనం ఫోన్ వంటి వాటిని అన్లాక్ చేసి లేదా పాస్వర్డ్ చెప్పి ఇవ్వాల్సి ఉంటుంది. వీటిని అక్కడే చెక్ చేస్తారు. మరింత స్పష్టత కోసం ప్రత్యేకమైన పరికరాలు వాడి వాటిని తనిఖీ చేయవచ్చు. వాటిల్లో కంటెంట్ను కాపీ చేయడం లేదా విశ్లేషణ చేస్తారు. ఇక వారికి చట్ట వ్యతిరేకమైనవి లేదా జాతీయ భద్రతకు సంబంధించినవి ఆ పరికరాల్లో ఉన్నాయని అనిపిస్తే అడ్వాన్స్ సెర్చ్ నిర్వహిస్తారు. ఇందుకోసం సీనియర్ మేనేజర్ అనుమతి తీసుకొంటారు. కొన్ని సందర్భాల్లో సీబీపీ అధికారులు మీరు ఎయిర్ పోర్టు నుంచి బయటకు వెళ్లేలోపు మీ పరికరాలు వాపస్ కూడా ఇవ్వకపోవచ్చు. అదనపు తనిఖీల కోసం ఐదు రోజులు వారివద్దే ఉంచుకోవచ్చు. ఆ తర్వాత అవసరమైతే మరో వారం చొప్పున పొడిగించుకుంటూ వెళ్లొచ్చు. గతంలో కొన్ని వారాలపాటు ప్రయాణికుల పరికరాలను సీబీపీ అధికారుల వద్దే ఉంచుకొన్న ఘటనలు ఉన్నాయి. అమెరికన్ ఇమిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్ ప్రకారం ఇలాంటి పరిస్థితుల్లో ప్రయాణికులు సీబీపీ అధికారి పేరు, బ్యాడ్జి నెంబర్ను నోట్ చేసుకోవాలి. వారు అడిగిన ప్రశ్నలను జాగ్రత్తగా రాసుకోవాలి. ఒకవేళ ప్రయాణికులను అధికారులు ప్రశ్నిస్తున్నప్పుడు రికార్డు చేస్తే.. ఆ ట్రాన్స్క్రిప్ట్ కాపీ అడగాలి. పౌరులు కాని వారికి ఈ విషయంలో తక్కువ హక్కులు ఉంటాయి. డివైజ్లను అన్లాక్ చేయడానికి అంగీకరించకపోతే.. వీసాదారులను ఒక్కోసారి అమెరికాలోకి అడుగుపెట్టనీయకపోవచ్చు. ఇక గ్రీన్ కార్డుదారులకు ఇమిగ్రేషన్ జడ్జి ఎదుట వాదనలు వినిపించే హక్కు ఉంటుంది. ఇక పౌరులను దేశంలోకి రాకుండా అడ్డుకొనే అవకాశం లేదు. కానీ, ఆ పరికరాన్ని సీజ్ చేయవచ్చు.

అమెరికన్ సివిల్ లిబర్టీస్ యూనియన్ ఈ విషయంలో ఓ సూచన చేసింది. వీసాదారులు తమ పాస్వర్డ్ను అధికారులకు చెప్పే బదులు తామే డివైజ్ను అన్లాక్ చేసి ఇవ్వాలని పేర్కొంది. ఒకవేళ అది సాధ్యం కాకపోతే.. వారి డివైజ్ తిరిగి చేతికి వచ్చిన వెంటనే పాస్వర్డ్ మార్చుకోవాలని సూచించింది.

మీ పరికరాన్ని స్వాధీనం చేసుకొంటే ఏం చేయాలి..?

ఒకవేళ మీ పరికరాన్ని సీజ్ చేస్తే.. ఫామ్ 6051-డి రశీదును కచ్చితంగా తీసుకోవాలి. దీనిలో ఆ పరికరం వివరాలు మొత్తం ఉంటాయి. మీరు తర్వాత ఎక్కడ సంప్రదించాలో వెల్లడిస్తారు. సాధారణంగా పరీక్షలు పూర్తయ్యాక ప్రయాణికుడి వద్దకు దానిని చేరుస్తారు.

మీ పరికరంలో ఎటువంటి నేరాలకు సంబంధించిన ఆధారాలు లేవని నిర్ధరించుకొన్నాక.. దానినుంచి కాపీ చేసిన సమాచారాన్ని అధికారులు 21 రోజుల్లోపు నాశనం చేస్తారు. ఒక్కో సందర్భంలో సీబీపీ అధికారులు మిమ్మల్ని తనిఖీ చేసినప్పటి వివరాలు నమోదు చేసుకొని భద్రపరుస్తారు. మీరు తిరిగి వచ్చిన సందర్భంలో డిజిటల్ పరికరాల సాఫ్ట్వేరు వంటి వాటిల్లో చేయకూడని మార్పులు ఏమైనా జరిగాయేమో కూడా స్కాన్ చేస్తారు.

అమెరికాకు వెళ్లే సమయంలో ప్రయాణాల కోసమే ఉద్దేశించిన పరికరాలను వాడాలని నిపుణులు చెబుతున్నారు. వీటిల్లో తక్కువగా వ్యక్తిగత సమాచారం ఉండేట్లు చూసుకోవాలి. వ్యక్తిగత సమాచారం ఉండే సున్నితమైన యాప్ల నుంచి సైన్ ఔట్ కావాలి. ఆటోలాగిన్ ఆప్షన్ను డిజేబుల్ చేయాలని చెబుతున్నారు. దీంతోపాటు వ్యక్తిగత పరికరాల్లో కీలక డేటా, ఫైల్స్ బ్యాకప్ను డ్రైవ్లో భద్రపర్చుకోవాలి. సీబీపీ అధికారులు డివైజ్లో ఉన్న డేటాను మాత్రమే పరిశీలిస్తారు. క్లౌడ్ వంటి రిమోట్ విధానంలో భద్రపర్చిన డేటాను పరిశీలించరని నిపుణులు చెబుతున్నారు.

22 మంది మావోయిస్టుల లొంగుబాటు

దంతెవాడ, ఏప్రిల్ 18: ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో శుక్రవారం 22 మంది మావోయిస్టులు భద్రతా దళాల ముందు లొంగిపోయారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాలో శుక్రవారం 22 మంది మావోయిస్టులు భద్రతా దళాల ముందు లొంగిపోయారు. వారిలో 12 మందిపై రూ.40 లక్షల రివార్డు ఉందని పోలీసులు తెలిపారు. అమానవీయ మావోయిస్టు భావజాలం, స్థానిక గిరిజనులపై జరిగిన దురాగతాలతో నిరాశ చెందామని పేర్కొంటూ తొమ్మిది మంది మహిళలు సహా 13 మంది మావోయిస్టులు సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్సెస్ (సీఆర్పీఎఫ్) సీనియర్ అధికారుల ముందు లొంగిపోయారని సుక్మా పోలీసు సూపరింటెండెంట్ కిరణ్ చవాన్ తెలిపారు. వీరంతా పలు హింసాత్మక, విధ్వంసకర సంఘటనల్లో పాల్గొన్నారని పోలీసులు చెప్పారు. గతేడాది సుక్మాతో సహా బస్తర్ ప్రాంతంలో దాదాపు 792 మంది మావోయిస్టులు లొంగిపోయారని పేర్కొన్నారు.

అంబేద్కర్ రాజ్యాంగమే దేశానికి ఆదర్శం

- రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

సూర్యాపేట, ఏప్రిల్ 18 (మనం ప్రతినిధి): భారతదేశంలో ప్రతి ఒక్కరు సమానంగా స్వేచ్ఛత వాతావరణంలో ఉండేలా భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగం రచనయే నేటి భావితరాలకు అన్ని వర్గాలకు సమకూలంగా ఫలాలు అందేలా కృషి చేశారని రాష్ట్ర ఎస్సీ ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శుక్రవారం చివ్వెంల మండల పరిధిలోని మున్యా నాయక్ తండ గ్రామపంచాయతీ ఆవాస గ్రామమైన పీక్లా తండాలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ... ప్రపంచ వ్యాప్తంగా మేధావులలో ఒకరైన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఎన్నో డిగ్రీలు చదివి భారత దేశంలోని అన్ని కులాలు అన్ని మతాల ప్రజలు నా కుటుంబ సభ్యులుగా భావించి ప్రతి ఒక్క వర్గాలకు సమన్యాయం చేకూర్చేలా భారత రాజ్యాంగాన్ని లిఖించారని అన్నారు.ప్రపంచ దేశాలలో ముఖ్యమైన దేశాలను పర్యటించి ఆయా దేశాలలో ఉన్న రాజ్యాంగ ని చదివి వాటి నుండి గ్రహించి భారత దేశ రాజ్యాంగాన్ని దృఢమైన లిఖిత రాజ్యాంగంగా సంవత్సరలు పాటు కష్టపడి భారత రాజ్యాంగాన్ని రూపొందించాలన్నారు.నేటి సమాజంలో యువత కష్టపడి భావి భవిష్యత్తులో అత్యున్నత పదవులు ఉద్యోగాలు పొందాలని అన్నారు.సమాజంలో యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి మంచి పనులు వైపు సాగాలని కష్టపడి చదివి మంచి ఉన్నత స్థాయిలో ఎదగాలని పిలుపునిచ్చారు. సమాజంలో ఉన్న అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించే అన్ని సంక్షేమ పథకాలు అర్హత ఉన్న అన్ని కులాల వరకు అందించేలా ఆనాడే భారత రాజ్యాంగంలో రాసిపెట్టిన ప్రపంచ మేధావి అని కొనియాడారు.డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కీర్తి ఏ భారతదేశానికి ఇంకా గొప్ప మహోన్నతునిగా ఎదిగేలా చేసిందని భారతదేశంలో ఉన్న 130 కోట్ల ప్రజలు అందరూ భారత రాజ్యాంగాన్ని అనుసరించి దేశం రాష్ట్రంలో ఉండే వాటిని అనుగుణంగా వ్యవహరించాలని తెలిపారు.ఆనాడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తన కుటుంబాన్ని సైతం త్యాగం చేసి దేశ జనాభా యే కుటుంబ సభ్యులుగా భావించి దేశం కోసం ఎంతో కృషి చేశారని భారతదేశంలో ప్రతి ఒక్కరు కూడా భారత రాజ్యాంగాన్ని,అంబేద్కర్ జీవిత కథనాన్ని చదువుకోవాలని సూచించారు. భారత దేశంలోనే జనాభా ప్రతి ఒక్కరు కూడా ఎన్ని తరాలకు అయినా మరువలేని మహోన్నతమైన వ్యక్తి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రామచంద్రనాయక్, జిల్లా షెడ్యూల్ కులాల అధికారులు కే శంకర్, లత, తహసిల్దార్ కృష్ణయ్య, సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్, స్థానిక ఎస్సై మహేశ్వర్, సామాజిక కార్యకర్త నరసింహారావు,మాజీ సర్పంచ్ బికారి, మాజీ ఎంపిటిసి సుశీల సాగర్, విగ్రహ దాత సురేష్,విద్యార్థి సేన నాయకులు,సంఘనాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పట్టణ సమస్యలపై దృష్టి సారించాలి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, ఏప్రిల్ 17 (మనం న్యూస్): ప్రజా సమస్యలపై ఆఫీసర్లు, సిబ్బంది దృష్టి సారించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ ఆఫీస్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ తో కలిసి మాట్లాడారు. పట్టణంలో రద్దీగా ఉన్న ప్రాంతలైన డాక్టర్స్ కాలనీ, కురగాయాల మార్కెట్, బస్టాండ్ తదితర ప్రదేశాలలో డ్రైనేజీ , పారిశుధ్యం సమస్యలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్, తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఎప్పటికపుడు రివ్యూలు చేయనున్నట్లు పేర్కొన్నారు. మున్సిపాలిటి పరిధిలో పనుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో కమిషనర్ యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐకెపి కేంద్రాల లో ధాన్యం కొనుగొళ్లను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మండల పరిధిలోని అవంతీపురం మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగొలు కేంద్రాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నాణ్యమైన ధాన్యం తీసుకొచ్చి మద్దతు ధర తో పాటు ప్రభుత్వ బోనస్ పొందాలని కోరారు.

రాజు కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన ఎమ్మెల్యే

తిరుమలగిరి, ఏప్రిల్ 18(మనంన్యూస్): తిరుమలగిరి మండలం తాటిపాముల గ్రామ పంచాయతీ శ్రీరామ్ తండ కు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు ధరావత్ రాజు గత కొద్ది క్రితం మరణించారు.వారి కుటుంబాన్ని ఎమ్మెల్యే మందుల సామేలు శుక్రవారం పరామర్శించారు. రాజు కుటుంబానికి 5000 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు వై నరేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ జుమ్మిలాల్, గ్రామ శాఖ అధ్యక్షులు నాయిని కృష్ణ, ఎర్ర యాదగిరి, పొట్టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భూభారతి యాప్ ను స్వాగతిస్తున్నాం

గరిడేపల్లి,ఏప్రిల్ 18 (మనం న్యూస్): రాష్ట్ర ప్రభుత్వం రైతుల భూముల సమస్యల పరిష్కారం కోసం ప్రవేశపెట్టిన భూభారతి యాప్ ను సిపిఐ పార్టీ స్వాగతిస్తుందని ఆ పార్టీ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు తెలిపారు.ఆయన గరిడేపల్లిలో శుక్రవారం మాట్లాడుతూ ప్రభుత్వాలు ప్రజల సంక్షేమం కోసం చేసే చట్టాలను అధికారులు నిజాయితీగా బాధ్యతగా అమలు చేస్తేనే ఏ సంక్షేమ పథకమైన విజయవంతమవుతుందని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టాన్ని కూడా అధికారులు చిత్తశుద్ధితో అమలు చేస్తే రైతులకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.గత బి.ఆర్.ఎస్ ప్రభుత్వం రైతుల భూముల సమస్యల పరిష్కారం కోసం ధరణి యాప్ ను తీసుకొచ్చి రెవెన్యూ అధికారులకు విశేష అధికారాలను చూస్తే వారు ఇష్టం వచ్చిన విధంగా ధరణి యాప్ లో పట్టేదారుల పేర్లను మార్పులు చేర్పులు చేసి రైతాంగంతో ఆటలు ఆడుకున్నారని ఆరోపించారు.ధరణి యాప్ కారణంగా అనేకమంది రైతులు భూములు కోల్పోయి ఆత్మహత్యలు కూడా చేసుకున్నారని తెలిపారు.రెవిన్యూ అధికారులు,అప్పటి వీఆర్వోలు తమ అక్రమ సంపాదన కోసం సర్వే నెంబర్లలో ఉన్న విస్తీర్ణం కూడా పెంచి పట్టాలు ఇచ్చారని తెలిపారు.సర్వే నెంబర్లలో భూమి తక్కువ పట్టేదారులు ఎక్కువగా ఉన్నారని వాటన్నిటిని సరిచారని ఆయన కోరారు.ధరణి లో ఉన్న లసుగులను ఆధారంగా చేసుకుని డబ్బులు ఇచ్చిన వారికి తమకు ఇష్టం వచ్చిన విధంగా దొంగ పట్టాలు చేయడంతో పొజిషన్ పై ఉన్న రైతుకు పట్టలేకుండా పోయిందని ఈ పరిస్థితి చాలా మంది రైతులు ఎదుర్కొంటున్నారని,వాటన్నింటినీ ఇప్పుడు భూ భారత్ ద్వారా సరి చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.ఈ భూభారతి యాప్ గత ప్రభుత్వం అమలు చేసిన ధరణి యాప్ మాదిరిగా కాకుండా రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా అమలుచేసి చరిత్రలో నిలిచిపోయే విధంగా చూడాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు త్రిపురం సుధాకర్ రెడ్డి,సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు కడియాల అప్పయ్య,కుందూరు వెంకటరెడ్డి,నబి సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో పోలీసు విస్తృత తనిఖీలు

శాంతిభద్రత పరిరక్షణలో ప్రజలు సహకరించాలి సీఐ

సూర్యాపేట ఏప్రిల్ 18 (మనం ప్రతినిధి): అక్రమ రవాణా నిరోధించడం లో భాగంగా జిల్లా ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు శుక్రవారం సూర్యాపేట పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో కొత్త బస్టాండ్, హైటెక్ బస్టాండ్ ప్రాంగణాలలో, రద్దీ ప్రాంతాలు, ఫ్లై ఓవర్స్, ముఖ్యమైన వాణిజ్య సముదాయాలలో పోలీసులు విసృత తనిఖీలు నిర్వహించారు. సందర్భంగా బస్సులు నిలుపు ప్రాంగణాలను, దుకాణాలు బస్సులు, ప్రయాణికుల లగేజీ అనుమానిత వ్యక్తులను తనిఖీ చేశారు. ప్రయాణికులతో మాట్లాడి భద్రతా చర్యల పట్ల పట్టణ సీఐ వీర రాఘవులు అవగాహన కల్పించారు. అనంతరం పట్టణ ఇన్స్పెక్టర్ వీర రాఘవులు మాట్లాడుతూ.... రెండు తెలుగు రాష్ట్రాలని కలుపుతూ ప్రధాన జాతీయ రహదారిపై రవాణా పరంగా ముఖ్య కేంద్రంగా ఉన్న సూర్యాపేట పట్టణంలో మెరుగైన భద్రత కల్పించడం, డ్రగ్స్, గంజాయి లాంటి మాదకద్రవ్యాలు, నిషేధిత పదార్థాల అక్రమ రవాణా నిరోధించడం, కొత్త వ్యక్తుల కదలికలు గుర్తించడం లో భాగంగా జిల్లా ఎస్పీ గారి ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించామని అన్నారు. గుర్తింపు నిర్ధారణ లేని వ్యక్తులకు, అనుమానితులు లాడ్జ్ ల నందు వసతి ఇవ్వవద్దు అని కోరారు. శాంతిభద్రతల రక్షణలో ప్రజలు పోలీసులతో సహకరించాలి అని కోరారు. గంజాయి డ్రగ్స్ లాంటి పదార్థాలు అక్రమ రవాణా జరగకుండా తనిఖీలు చేశామన్నారు. మాదకద్రవ్యాలు గుర్తించే డాగ్, పేలుడు పరదర్థాలు గుర్తించే డాగ్, బాంబ్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొని బస్సులు, అనుమానిత వస్తువులు, ప్రయాణికుల బ్యాగులు తనిఖీలు చేయడం జరిగినది.ఈ తనిఖీల్లో ఎస్సై ఆంజనేయులు, ఆర్ఎస్ఐ. మహేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల భూ సమస్యలు పరిష్కరించేందుకే భూ భారతి

- ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 18 (మనం న్యూస్): భూధాన్ పోచంపల్లిలో వినోబా నగర్ డెవలప్మెంట్ సొసైటీ,గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ,గాంధీ జ్ఞాన్ ప్రతిష్ట వ్ సంయుక్త ఆధ్వర్యంలో భూదానోద్యమ జయంతి వజ్రోత్సవం మరియు భూభారతి అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా భూధాన్ పోచంపల్లిలో ని రూరల్ టూరిజం పార్కులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భువనగిరి శాసనసభ్యులు ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మరియు గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ చైర్మన్ గున్న రాజేందర్ రెడ్డి,భూ భారతి రూపకల్పన సభ్యులు భూమి సునీల్ రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకే భూభారతి చట్టం కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకు వచ్చిందని ఇది ఒక చారిత్రాత్మక నిర్ణయం అని అన్నారు.భూభారతి చట్టం వంద సంవత్సరాల వరకు భూ సమస్యలు లేకుండా భూభారతి చట్టాన్ని పటిష్టంగా రూపొందించడం జరిగిందని ధీమా వ్యక్తం చేశారు.భూభారతి రూపకర్త భూమి సునీల్ కుమార్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి సర్కార్ పేదల భూములకు భరోసాని ఇవ్వడానికే అత్యద్భుతమైన భూభారతి చట్టాన్ని తీసుకురావడం జరిగిందని భూభారతి రూపకల్పనలో కోదండ రెడ్డి గారి పాత్ర అద్వితీయమైన దని ఆయన వివరించారు.రైతు కమిషన్ చైర్మన్ ఎం కోదండ రెడ్డి మాట్లాడుతూ రేవంత్ రెడ్డి సర్కార్ రైతు సంక్షేమం కోసం నిరంతరంగా కృషి చేస్తున్న విషయాన్ని ఎవరు మరువద్దని అన్నారు.హామీ ఇచ్చినట్లుగానే భూభారతి చట్టము రైతుల సంక్షేమం దృశ్య నే ప్రవేశపెట్టడం జరిగిందని ధరణి సమస్యలు ప్రజల్లో ఒక రకమైన భయంతోలను గురిచేసిందని కోదండ రెడ్డి వివరించారు.ఈ కార్యక్రమంలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ యానాల ప్రభాకర్ రెడ్డి,ప్రొఫెసర్ తడక యాదగిరి,గాంధీ గ్లోబల్ సాహిత అధ్యక్షులు కే గోపాల్,రైతు కమిషన్ సభ్యులు భవాని రెడ్డి,జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు తడక వెంకటేష్,సామ మధుసూదన్ రెడ్డి,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పాక మల్లేష్ యాదవ్,పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భారత లవకుమార్ పాల్గొన్నారు.

వడ్ల కల్లాలు ఒకచోట ఐకెపి సెంటర్ మరోచోట

- కింటాకి మూడు కిలోలు తరుగు తీస్తున్నారని వాపోతున్న రైతులు
- వ్యాలిడిటీ అయిపోయిన మ్యాచర్ మిషన్లు

కోదాడ,ఏప్రిల్18(మనం న్యూస్): కోదాడ నియోజకవర్గం పరిధిలోని ఐకెపి సెంటర్లను స్థానిక బిజెపి నాయకులు శుక్రవారం పరిశీలించి రైతులను వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా బిజెపి అసెంబ్లీ కన్వీనర్ కనగాల నారాయణ మాట్లాడుతూ కోదాడ రూరల్ పరిధిలోని చిమిర్యాల నల్లబండగూడెం కాపుగల్లు గణపవరం గ్రామాలలో గల ఐకెపి సెంటర్లను పరిశీలించామని అంతేకాకుండా మోతే నడిగూడెం మండలాలలో పరిశీలించామని అన్నారు.రైతులు తెలిపిన వివరాల ప్రకారం సెంటర్లో చాలా స్లోగా నడుస్తున్నాయని వాతావరణంలో వచ్చిన మార్పుల వలన రైతులం ఆందోళనకు గురవుతున్నామని అన్నారని అన్నారు. దొడ్డు రకం వడ్లను ఇంతవరకు ఐకెపి సెంటర్లు కొనుగోలు చేయట్లేదని ఏంది అని అడిగితే ట్యాబులు పనిచేయట్లేదు అని సమాధానాలు చెబుతున్నారని రైతులు తెలిపారని అన్నారు. 40 కేజీల బస్తాకు 41 కేజీ 200 గ్రాములు కాంటా వేస్తున్నారని మళ్లీ కింటాకు తరుగు అని మూడు కేజీలు తీస్తున్నారని రైతుల తెలిపారని అన్నారు. నడిగూడెం మండల కేంద్రంలో రైతుల కల్లాలు ఒకచోట ఐకెపి సెంటర్ మరొకచోట పెట్టారని రైతులు పోతున్నారని అన్నారు.రైతులకు బస్తాలు ఇవ్వడంలో కూడా సంబంధిత అధికారులు అలసత్వం వహిస్తున్నారని అన్నారు. ఇప్పటికే రెండుసార్లు వర్షం వచ్చి రైతులు నానా ఇబ్బందులు పడ్డారని మూడోసారి వర్షం వస్తే వడ్లు దేనికి పనికి రావని రైతులు పాపోతున్నారని అన్నారు. తాలు ఎక్కువగా ఉందని తూర్పాల పోయాలని రైతులకు సంబంధిత ఐకెపి అధికారులు ఇబ్బందులు కలిగిస్తున్నారని అన్నారు.ఇకనైనా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకొని రైతులకు సరైన సమయంలో బస్తాలు ఇచ్చి రైతులకు ఇబ్బంది కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మల్లెబోయిన వెంకటేష్ బాబు,కోదాడ రూరల్ మండల అధ్యక్షులు దేవరశెట్టి సత్యనారాయణ, మోతే అధ్యక్షులు శంకర్ నాయక్,మునగాల అధ్యక్షులు కృష్ణ ప్రసాద్,కోదాడ రూరల్ ఉపాధ్యక్షులు బూమా శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శి గాదరి పుల్లారావు,దళిత మోర్చా నాయకులు గుండెపంగు సైదులు,రామారావు పాల్గొన్నారు.

పోచంపల్లి మినీ ట్యాంక్ బండ్ కి శంకుస్థాపన

భూదాన్ పోచంపల్లి,ఏప్రిల్ 18 (మనం న్యూస్): భూదాన్ పోచంపల్లి పెద్ద చెరువు ని మినీ ట్యాంక్ బండ్ గా మార్చేందుకు భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోచంపల్లిని సుందరీకరణ లో భాగంగా పోచంపల్లి చెరువును మినీ ట్యాంక్ పండుగ మార్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని అందులో భాగంగానే మినీ ట్యాంక్ బండ్కు శంకుస్థాపన చేస్తున్నామని త్వరలోనే పనులు కూడా పూర్తవుతాయని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు తడక వెంకటేష్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పాక మల్లేష్ యాదవ్,పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భారత లవ కుమార్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ తడక రమేష్,పదవ వార్డు మాజీ కౌన్సిలర్ మోటే రజిత రాజు,పట్టణ కాంగ్రెస్ పార్టీ ప్రధన కార్యదర్శి గునిగంటి వెంకటేష్ గౌడ్,మాజీ ఎంపీటీసీ కొట్టం కరుణాకర్ రెడ్డి,కిసాన్ సెల్ నాయకులు మరీ నరసింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కుక్క కుమార్,మోటే మహేష్,యువజన కాంగ్రెస్ పార్టీ జిల్లా సెక్రటరీ చేరాల సుధీర్ కుమార్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు గ్యార సందీప్, యువజన కాంగ్రెస్ నాయకులు జింకల జయసూర్య, పెంట నవీన్ పదవ వార్డ్ అధ్యక్షులు చేరల మహేందర్, వంగూరి రాము పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే పిడి యాక్ట్

- విత్తనాల కొనుగోలు విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా ఎస్పీ నరసింహ

సూర్యాపేట, ఏప్రిల్ 18 (మనం ప్రతినిధి): నకిలీ విత్తనాలు సరఫరా జరిగి రైతులు నష్టపోక ముందే అధికారులు ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలి అని నకిలీ విత్తనాలు గుర్తించి సీజ్ చేయాలి, నకిలీ విత్తనాల వల్ల జిల్లాలో ఒక్క రైతు కూడా నష్టపోవద్దు అన్ని శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు, సంభందిత అధికారులు అందరూ సమన్వయంగా పని చేసి రైతులకు నకిలీ వితనాలు సరఫరా జరగకుండా చూడాలి అన్నారు. రాష్ట్రానికి, దేశానికి వ్యవసాయం ముఖ్యమైన ఆధారం అలాంటి వ్యవసాయం చేసే రైతులు ఆరుగాలం కష్టపడి నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత కూడా విత్తన సంస్థలు, డీలర్లు, వ్యాపారులపై పై ఉన్నది, విత్తన వ్యాపార డీలర్స్ బాధ్యతగా మంచి నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలి అన్నారు. రైతులకు, వ్యవసాయానికి నష్టం కలిగేలా నకిలీ విత్తనాలు అమ్మితే అలాంటి వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేస్తాం సీడీ యాక్ట్ తప్పదు, షీట్స్ నమోదు చేస్తాం అని హెచ్చరించారు. సూర్యాపేట జిల్లా ఆంధ్రా ప్రాంతానికి ముఖ్య సరిహద్దుగా ఉన్నది ఇక్కడ నకిలీ విత్తనాలు ఎక్కువగా సరఫరా అయ్యే అవకాశం ఉన్నదనీ ముందస్తు తనిఖీలు, రైతులకు డీలర్స్ కు అవగాహన కల్పించడం, సరిహద్దు లలో పటిష్టమైన నిఘా తో నకిలీ విత్తనాలు నివారించాలి అని ఎస్పీ తెలిపారు. రైతులతో సమావేశాలు నిర్వహించి చైతన్య పరచాలి, గతంలో నకిలీ విత్తనాల కేసుల్లో సంబంధం ఉన్నవారి పై నిఘా ఉంచాలి అని ఆదేశించారు. ఇతర రాష్ట్రాల నుండి జిల్లాల లనుండి ఎక్కువ మొత్తంలో విత్తనాలు కొనుగోలు చేసే రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు తీసుకోవాలని నకిలీ విత్తనాల గురించి, అనుమానిత బ్రోకర్లు, డీలర్ల గురించి పోలీసు వారికి, వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలి అని కోరినారు.

బిఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం

- హాజరైన మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి

భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 18(మనం న్యూస్): భూదాన్ పోచంపల్లి పట్టణ కేంద్రంలోని జిబిఆర్ గార్డెన్స్ లో ఈనెల 27న వరంగల్ లో జరిగే బిఆర్ఎస్ పార్టీ 25వ రజతోత్సవం కార్యక్రమం కోసం బిఆర్ఎస్ పార్టీ మండల మరియు పట్టణ ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి భువనగిరి మాజీ శాసనసభ్యులు పైళ్ల శేఖర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 27న వరంగల్లో జరిగే బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు అందరూ పాల్గొని ఈ రజతోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని అన్నారు. గడిచిన 10 సంవత్సరాలలో బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ హయాంలో తెలంగాణ రాష్ట్రం సాధించిన ప్రగతి గొప్పదని కానీ ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన పేరుతో ప్రజలను మోసం చేస్తుందని రానున్న స్థానిక ఎన్నికల్లో నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో బిఆర్ఎస్ పార్టీ ఆదిపత్యం చలాయిస్తుందని, ప్రతి కార్యకర్త ముందు తాను నిలబడి వారిని గెలిపించుకుంటానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మడుగుల ప్రభాకర్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ కందాడి భూపాల్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పాక వెంకటేష్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్ చిట్టిపోలు విజయలక్ష్మి, మాజీ జెడ్పిటిసి కోట పుష్పలత మల్లారెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బాత్క లింగస్వామి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పాటి సుధాకర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి సిలువేరు బాల్ నరసింహ, పట్టణ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సీత వెంకటేష్, ప్రధాన కార్యదర్శి గునిగంటి మల్లేష్ గౌడ్, మాజీ కౌన్సిలర్లు పెద్దల చక్రపాణి, కుడికాల అఖిల బలరాం, మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు బత్తుల శ్రీశైలం గౌడ్, పట్టణ నాయకులు జింకల యాదగిరి, చేరాల నరసింహ, టిఆర్ఎస్ పార్టీ యువజన నాయకులు చింతకింది కిరణ్, సీత శ్రవణ్, వేముల సుమన్ గౌడ్, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పేదవాడి కన్నీటిని తుడవటానికి తీసుకొచ్చిన చట్టమే భూభారతి

పార్ట్- బి లో ఏడు లక్షలు ఎకరాలకు పరిష్కారం చూపిస్తాం

అబాదీ ఇళ్లకు కూడా డాక్యుమెంట్లు

త్వరలో భూభారతి టోల్ఫ్రీ నెంబర్

గిరిజన ప్రాంత సమస్యలపై కమిటీ ఏర్పాటు

ప్రభుత్వం ఒక చట్టం రూపొందిస్తే ఆ చట్టం పేదవాడికి చుట్టంలాగా ఉండాలి

ఈ చట్టం ద్వారా ప్రతి ఒక్క రైతుకు న్యాయం జరుగుతుంది

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

వెంకటాపురం, ఏప్రిల్ 18(మనంన్యూస్): గత ప్రభుత్వం కుట్ర పూరితంగా పార్ట్ -బి లో పెట్టిన 18 లక్షల ఎకరాలలో ఆరు నుంచి ఏడు లక్షల వరకు వ్యవసాయ భూములు ఉన్నాయని ఈ భూములకు ఈ భూభారతి చట్టంతో పరిష్కారం చూపిస్తామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం ములుగు జిల్లా వెంకటాపూర్ మండల కేంద్రంలో అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క , మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు బలరాం నాయక్, ప్రిన్సిపాల్ సెక్రటరీ ఫైనాన్స్ రామకృష్ణ రావు, భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, వర్ధన్నపేట శాసన సభ్యులు నాగరాజు, ప్రిన్సిపాల్ సెక్రటరీ సి సిఎల్ ఏ రెవిన్యూ బుద్ధ ప్రకాష్, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. లతో భూభారతి పైలెట్ ప్రాజెక్టును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పేదల కన్నీటిని తీర్చేందుకే భూభారతి చట్టాన్ని తీసుకొచ్చాం అన్నారు. ఎన్నికలకు ముందు ధరణిని బంగాళాఖాతంలో వేస్తామని మేము ఇచ్చిన హామీని ప్రజలు విశ్వసించి ప్రజలు ఇందిరమ్మ రాజ్యాన్ని తెచ్చుకున్నారు.ఇందిరమ్మ రాజ్యంలో భూ సమస్యలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యంగా పనిచేస్తాం అన్నారు. ప్రజలను ఇబ్బంది పెట్టకుండా రైతులకు సేవలు అందిస్తాం అన్నారు. రైతులు తమ భూ సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికే చెప్పులు అరిగేలా అధికారుల చుట్టూ రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగారని ఇప్పుడు ఇంకా ఆ అవసరం రైతులకు లేదని అధికారులే రైతుల వద్దకు వచ్చి వారి భూ సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. ధరణిపై గత పాలకులు ఏనాడు కూడా రెవెన్యూ సదస్సు పెట్టలేదని ఒకవేళ రెవెన్యూ సదస్సులు పెట్టి ఉంటే ఆనాడే ఆ ప్రభుత్వం పై ప్రజలు తిరగబడేవారని, గత పాలకులు చేసిన తప్పులను ఇప్పటికీ గ్రహించడం లేదని వారికి జ్ఞానోదయం కావడం లేదన్నారు. గతంలో 2020- ధరణి చట్టాన్ని తీసుకువస్తే మేం దానిని బంగాళాఖాతంలోకి విసిరేసి సామాన్య ప్రజల కోసం 2025- భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చాం పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇంతవరకు డాక్యుమెంట్లు లేని అబాదీ ఇల్లు అని పిలుచుకునే నివాసగృహాలకు డాక్యుమెంట్లు ఇచ్చే దిశగా చర్యలు చేపడుతున్నాం అన్నారు. భూ భారతి సమస్యల పరిష్కారానికి గాను తమ కార్యాలయం, సిసిఎల్ఎ కార్యాలయంను అనుసంధానించే టోల్ ఫ్రీ నెంబరును త్వరలో ప్రజలకు తెలియజేస్తాం అని తెలిపారు. గిరిజన, గిరిజనేతరులు ఉండే ప్రాంతంలో భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఒక కమిటీని నియమిస్తామని మంత్రి పొంగులేటి వెల్లడించారు.2020 ధరణి చట్టంలో సాదా బైనమ అనే అంశాన్ని గత ప్రభుత్వం తొలగించిందనీ అన్నారు. గతంలో రైతులు సాదా బైనామ కోసం ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న 9 లక్షల 24 వేల దరఖాస్తులలో సక్రమంగా ఉన్న దరఖాస్తులను పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. ఈ చట్టం ద్వారా భూమిపై ఎవరైతే కాస్తు లో ఉంటారో వారికే పాస్ బుక్ ఇవ్వడం జరుగుతుందనీ తెలిపారు. గ్రామాలకే రెవెన్యూ అధికారులు వచ్చి రైతుల సమస్యలను పరిష్కరిస్తారని భరోసా కల్పించారు. ధరణి పార్ట్ బి లో ఉన్న ఆరు నుంచి ఆరున్నర లక్షల ఎకరాల పేదవారి భూములకు భూభారతి 2025 చట్టం ద్వారా పరిష్కారం దొరుకుతుందని తెలిపారు. నాయకుల స్వార్థం కోసం గాని, వారి ప్రయోజనాల కోసం చేసే చట్టం కాదు కేవలం పేద ప్రజల ప్రయోజనాల కోసం చేసిన చట్టమే భూభారతి చట్టం అని అన్నారు.మంత్రి కొండ సురేఖ మాట్లాడుతూ భూభారతి చట్టంతో రైతులందరికీ న్యాయం జరుగుతుందని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి రైతులందరికీ తల్లి లాంటి భూభారతి చట్టాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. రైతులు ఎవరు మధ్యవర్తులు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దు అన్నారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో అన్ని సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని అన్నారు. రైతును రాజు చేయాలనే ఉద్దేశంతోనే ప్రజా ప్రభుత్వం ముందుకెళ్తుందని పేర్కొన్నారు. చట్టాల అమలులో అధికారుల పాత్ర కీలకంగా ఉంటుందని అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని అవినీతి రహితంగా కొనసాగించాలని సూచించారు. తప్పులు చేసే అధికారులపై తప్పనిసరిగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ... పేదల సంక్షేమ ధ్యేయంగా రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని, తల్లి బిడ్డకు ఎలాంటి సంబంధం ఉంటుందో అదే తరహాలో భూమికి రైతుకు సంబంధం ఉంటుందన్నారు. గత ప్రభుత్వం ధరణి పోర్టల్ తీసుకొచ్చి రైతులు ఆత్మహత్యలకు కారకులు అయ్యారని, నేడు రైతుల భూ సమస్యను పరిష్కరించడానికి సీఎం ఏనుముల రేవంత్ రెడ్డి భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చారని అన్నారు. కాస్తులో ఉన్న నిజమైన రైతులకు భూమి హక్కు పత్రాలు కల్పించాలని ఉద్దేశంతో ప్రభుత్వం ముందుకు పోతున్నదని, భూమి రైతుకు ఆదాయం బలమని అన్నారు. రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం రైతులు పండించిన సన్నబడ్లకు 500 రూపాయల బోనస్ ఇవ్వడమే కాకుండా పండించిన సన్న వడ్లను ప్రభుత్వం కొనుగోలు చేసి బియ్యం రూపంలో తిరిగి ప్రజలకే ఉచితంగా అందిస్తున్నదని అన్నారు. ధరణి పేరుతో గత పాలకులు రైతులను దగా చేశారని, అధికారులను బెదిరించి గత ప్రభుత్వ నాయకులు అక్రమంగా వందల ఎకరాల భూములు వారి పేరు మీద నమోదు చేసుకొని కోట్లాది రూపాయల రైతుబంధు దిగమింగారిని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమంగా ఆక్రమించుకున్న భూములతో పాటు ప్రభుత్వ భూములను కాపాడేందుకే ప్రభుత్వం నూతన చట్టాన్ని తెచ్చిందని, నూతన చట్టాన్ని అధికారులు చిత్తశుద్ధితో అమలు చేయాలని సూచించారు. ఎన్నికలకు ముందు ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటిని రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేనప్పటికీ అప్పులు తీర్చుతూ సంక్షేమ ఫలాలను అందిస్తూ నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందని తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం 59 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు వివిధ శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడానికి చర్యలు తీసుకుంటున్నదని వివరించారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి పలు వ్యాపారాలు చేయడానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తున్నదని ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ ఫలాలను ప్రజలు గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రినిపల్ సెక్రటరీ రామకృష్ణారావు, ఎంపీ బలరాం నాయక్, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, కలెక్టర్, ఏ ఎస్ పి శివం ఉపాధ్యాయ, అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, డి ఎఫ్ ఓ రాహూల్ కిషన్ జాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, రెవిన్యూ సదస్సుల ప్రత్యేక అధికారి కిరణ్ ప్రకాష్, ఆర్ డి ఓ వెంకటేష్, జిల్లా అధికారులు, మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు, సాంస్కృతిక కళాకారులు, రైతులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ అధికారులతో సమీక్ష సమావేశం

వరంగల్,ఏప్రిల్ 18 (మనం ప్రతినిధి): జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం రాజీవ్ యువ వికాసం పై జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించడమైనది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాజు యువ వికాస్ పథకం పై మండల్ లేవల్ కమిటీ ద్వారా పారదర్శకంగా యూనిట్స్ ఎంపిక జరగాలని ప్రభుత్వ నిబంధనల మేరకు రాజీవ్ యువ వికాసం పథకం అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి నియుద్యోగ యువతి యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ రాజు, బిసి వెల్ఫేర్ అధికారి పుష్పలత, ఇ డి ఎస్ సి కార్పొరేషన్ అధికారి సురేష్, మైనారిటీ వెల్ఫేర్ అధికారి రమేష్, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి సౌజన్యలు పాల్గొన్నారు.

భూ భారతి పోర్టల్ పై హర్షం వ్యక్తం చేసిన రైతులు

వెంకటాపురం, ఏప్రిల్ 18(మనంన్యూస్): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టంపై స్థానిక రైతులు హర్షం వ్యక్తం చేశారు. వెంకటాపూర్ మండలానికి చెందిన రైతు మొగిలి మాట్లాడుతూ గతంలోని పాలకులు ఏర్పాటు చేసిన ధరణితో అనేక ఇబ్బందులకు గురయ్యామని, తమ భూమి తమ పేరు మీదికి మార్చుకోవడానికి చెప్పులు అరిగేలా కార్యాలయాల చుట్టూ తిరిగామని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టంతో తమ ఇబ్బందులు తొలిగి పోయే అవకాశం ఉందని ఆశా భావం వ్యక్తం చేశారు.

తైనేని సరోజన...

తమ పేరు మీదికి తమ భూమిని మార్చాలని కోరుతూ గత పది సంవత్సరాలుగా అన్ని కార్యాలయాల చుట్టూ తిరిగినప్పటికీ తన సమస్య పరిష్కారం కాలేదని మరో మహిళ రైతు తైనేని సరోజినీ ఆవేదన వ్యక్తం చేశారు.గతంలో సాదా బైనమా ద్వారా పత్రాలు ఇచ్చినప్పటికీ ధరణి పోర్టల్ లో పేరు నమోదు కాకపోవడంతో రైతుబంధు అందలేదని, బ్యాంకులవారు రుణాలు ఇవ్వలేదని అన్నారు. తన ఇబ్బందులను గుర్తించి నూతన భూ భారతి లో పట్టా అందజేయాలని కోరారు.

పర్వతాలు...

తాను సాగు చేసుకుంటున్న భూమిలో పలు రకాల పంటలు పండిస్తున్నప్పటికీ నేటి వరకు తన పేరుపై పట్టా కాలేదని మరో రైతు పర్వతాలు తెలిపారు. తాను మోకాపై ఉన్నప్పటికీ ఇతరుల పేరుపై భూమి ఉందని, ఇప్పటికైనా తన పేరుపై పట్టా చేయాలని కోరారు.

మెడికల్ కళాశాల అక్రమ నియమకాలపై కలెక్టర్ మౌనం ఎందుకు..?

- **విద్యార్థి సంఘాల డిమాండ్**

కామారెడ్డి, ఏప్రిల్ 18 (మనంప్రతినిధి) : కామారెడ్డి మెడికల్ కళాశాలలో జరిగిన ఔట్సోర్సింగ్ ఉద్యోగుల అక్రమ నియామకాలపై నిగ్గు తేల్చాలని బాధ్యులపై చర్య తీసుకోవాలని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ., డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధికారికి నిన్న గురువారం రోజు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని అన్నారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించకుండా మెరిట్ ఆధారంగా తీసుకోకుండా కామారెడ్డి మ్యాన్ పవర్ ఏజెన్సీ డబ్బులు తీసుకొని ఉద్యోగాలను భర్తీ చేశారన్నారు. దీనిపైన డీఎంఈ కలెక్టర్ తో విచారణ కమిటీ ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. వెంటనే విచారణ కమిటీ ఏర్పాటు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నామని అన్నారు. 15 రోజుల నుండి అక్రమ నియమకాలను రద్దు చేయాలని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మెడికల్ కళాశాల ముట్టడి, కలెక్టర్ కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. కానీ కలెక్టర్ చర్యలు తీసుకోకుండా మౌనంగా ఉండడం దేనికి నిదర్శనం తెలుపలన్నారు. వెంటనే విచారణ చేపట్టి బాధ్యుల పైన చర్యలు తీసుకోవడం అన్నారు. ఇదే విషయమై వైద్య ఆరోగ్య మంత్రిని, ప్రభుత్వ సీఎస్ ని కలిసి అక్రమాలపై పూర్తిగా ఆధారాలతో అందజేస్తామని తెలిపారు. అక్రమ నియమకాలము రద్దు చేయకపోతే పెద్ద ఎత్తున విద్యార్థి సంఘాలతో, నిరుద్యోగులతో ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బివియం రాష్ట్ర కార్యదర్శి జీవిఎం విఠల్ , ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ముదాం అరుణ్ కుమార్, బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షులు నీల నాగరాజు, ఏఐఎస్ఎఫ్ నాయకులుశివ, అజయ్ ,రాహుల్, మనోజ్ మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

ప్రశిస్తే తప్పేముంది

- **జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యణయ్య**

మంగపేట, ఏప్రిల్ 18 (మనంన్యూస్): మంగపేట మండల కేంద్రం లో మాజీ ఎంపీటీసీ చౌలం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశం కి హాజరైన ఆదివాసీ నాయకులు మాట్లాడుతూమొన్నటి రోజున మంగపేట మండలం మల్లూరు మోట్లగూడెం గ్రామానికి చెందిన యాలం నరసింహారావు ఇటీవలే కురిసిన వడగండ్ల వానకు పంట నష్టం చెందిందని తీవ్ర మనస్తాపం కు లోనయ్యి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా హుటా హుటిన హాస్పటల్ కు తీసుకువెళ్లిన కాంగ్రెస్ పార్టీ నాయకులు చికిత్స చేయిస్తున్న తరుణంలో దురదృష్ట శాతం స్వర్గస్తులవ్వగా వారి హాస్పటల్ బిల్లును సితక్క చెల్లించి ప్రభుత్వం నుండి కచ్చితంగా ఆ కుటుంబాన్ని ఆదుకుంటామని తెలిపారు, మొన్నటి రోజున ఆ కుటుంబ సభ్యులను పరామర్శ చేయడానికి వచ్చిన రాష్ట్ర అటవీ శాఖ చైర్మన్ భద్రాచలం డీసీసీ అధ్యక్షులు పోదెం వీరయ్య వచ్చిన సందర్భంలో లోకల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మైల జయరామ్ రెడ్డికి గాని మండలం లో వున్నా కాంగ్రెస్ పార్టీ నాయకుల కు గాని ఇన్ఫర్మేషన్ ఇవ్వకుండా రావడం పట్ల మండల అధ్యక్షులు అడగడం లో తప్పేమిలేదు అని, అదేవిధంగా ఈ నియోజకవర్గం ఎమ్మెల్యే గా ఆదివాసీ ఆడబిడ్డ సీతక్క కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గా పోటీ చేస్తున్నప్పుడు శతవిధాల వారి వారి స్థాయిలను బట్టి ఓడగొట్టేందుకు ప్రయత్నం చేసిన టిఆర్ఎస్ పార్టీ నాయకులను వీరన్న తో పరామర్శకు తీసుకెళ్లడం ఎంతవరకు సబబు అని అదే విషయాన్ని మండల అధ్యక్షులు అడగడంలో తప్పేముందని తెలియజేస్తూ గతంలో రాష్ట్ర మంత్రివర్యులు సీతక్క పై కొన్ని సందర్భాలలో విమర్శలు చేసినప్పుడు ఆదివాసి సంఘాల తరపున ఎందుకు ప్రశ్నించలేదు దయచేసి సంఘాల ముసుగులో రాజకీయం చేయడం పద్ధతి కాదు అని వివరిస్తున్నాం ఈ కార్యక్రమం. చాద మల్లయ్య,సున్నం అనందం, కోరం అబ్బయ్య, పోదెం నగేష్,అనిత తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షాలకు దెబ్బ తిన్న పంటల నివేదిక అందజేయాలి

- **జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

భూపాలపల్లి,ఏప్రిల్ 18 (మనం ప్రతినిధి): అకాల వర్షాలకు దెబ్బ తిన్న వ్యవసాయ, వాణిజ్య పంటల నివేదిక అందచేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వ్యవసాయ, ఉద్యాన అధికారులను ఆదేశించారు. ఐడిఓసి కార్యాలయంలో ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న పంటల నివేదిక రూపకల్పనపై వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పంట నష్టం అంచనాలు ప్రభుత్వ మార్గ దర్శకాల మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలించి పకడ్బందీగా నమోదు చేయాలని ఆదేశించారు. పంట నష్టం జరిగిన రైతులకు పరిహారం అందచేయుటకు ప్రభుత్వానికి నివేదికలు పంపనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వీరు నాయక్, జిల్లా ఉద్యాన అధికారి సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం మిల్లర్లను ఆదుకోవాలి

ములుగు,ఏప్రిల్ 18 (మనం ప్రతినిధి): 2024 - 25 రబీ సీజన్లో వచ్చే సన్నధాన్యం ప్రభుత్వం 500 రూపాయలు బోనస్ ఇచ్చి కొనుగోలు చేసి రైతులను ఆదుకుంటున్న ప్రభుత్వ నిర్ణయం చాలా గొప్పదని రైస్ మిల్లర్లు ములుగు జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు బాదం ప్రవీణ్ అన్నారు. ఈ సందర్భంగా మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై ములుగు జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సీజన్లో వచ్చేటువంటి సన్నధాన్యం, దొడ్డు ధాన్యం ఏదైనా బాయిల్ బియ్యం మాత్రమే అవుతాయని, ఏదేని ధాన్యం కొంత రా రైస్ అయినా అవి తినడానికి అన్నం సరిగా కాదు ప్రభుత్వ ఉద్దేశం పేద ప్రజలకు సన్న బియ్యం ఇవ్వాలనే సంకల్పం గొప్పది అయినప్పటికీ అవి అన్నం కాక ప్రభుత్వం మరియు మిల్లర్లు బదనాం అయితారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి వివరించగా క్యాబినెట్లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని సానుకూలంగా స్పందించారన్నారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బాదం ప్రవీణ్ మరియు గౌరవాధ్యక్షులు పల్లెపాటి సమ్మిరెడ్డి మరియు రైస్ మిల్లర్లు అనిల్, ఆర్గనైజింగ్ సెక్రటరీ హరినాథ్ పాల్గొన్నారు.

మైనర్లు వాహనం నడిపిన, వారిని ప్రోత్సహించిన ఇక్కట్లు తప్పవు

- **వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ప్రీత్ సింగ్**

వరంగల్, ఏప్రిల్18(మనం ప్రతినిధి): వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకై ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతొంది. ముఖ్యంగా తెలిసి తెలియని వయస్సులోని మైనర్లతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం వాహనాలు నడపడం ద్వారా రోడ్డు ప్రమాదాల సంఖ్య ఘణనీయంగా పెరిగే అవకాశం వున్నందును ఇలాంటి ప్రమాదాల నివాణకై వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో కఠిన చర్యలు తీసుకొవడంతో జరుగుతోంది. వరంగల్ కమిషనరేట్ పరిధిలో మైనర్లు డ్రైవింగ్ చేస్తూ పోలీసులకు చిక్కితే కేసు నమోదు చేసి వాహనం స్వాధీనం చేసుకొవడంతో పాటు వాహనం నడిపినందుకు గాను సదరు మైనర్ను కోర్టులో హరజర్పర్చి న్యాయమూర్తి అదేశాల మేరకు పరిశీలన గృహంకు (అబ్జర్వేషన్ హోం) పంపబడుతుంది. అలాగే వాహన యజమానిగాని లేదా మైనర్ తల్లిదండ్రులపై కూడా కేసులు నమోదు చేసి వారికి కౌన్సిలింగ్ ఇవ్వబడుతుందని. అదే విధంగా డ్రైవింగ్ లైసెన్స్ లేనివారికి వాహనం అందజేయడం కూడా నేరమని వాహనదారులు గమనించాలని, ఒక వేళ లైసెన్స్ లేకుండా వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడితే వాహనం నడుపుతున్న వ్యక్తితో పాటు వాహన యజమానికి కూడా జరిమానా విధించడంబడటంతో పాటు వాహనం స్వాధీనం చేసుకోబడుతుందని. ముఖ్యంగా మైనర్లు వాహనం నడుపుతూ ఏదైన ప్రమాదం జరిగి మరణం సంభవిస్తే, మోటార్ వాహన చట్టం అనుసరించి వాహన యజమానికి మూడు సంవత్సరాల జైలు శిక్ష లేదా 25వేల రూపాయల జరిమాన విధించడం జరుగుతుందని. పట్టుబడిన మైనర్లకు 25 సంవత్సరాలు వయస్సు వచ్చే వరకు డ్రైవింగ్ లైసెన్స్ ఆర్హత కోల్పోతాడని, పట్టుబడిన వాహనం రిజిస్ట్రేషన్ ఒక సంవత్సర కాలం రద్దు చేయడం జరుగుతుందని వరంగల్ పోలీస్ కమిషనర్ హెచ్చరించారు. వరంగల్ పోలీస్ కమినరేట్ పరిధిలో గత జనవరి మాసం నుండి ఇప్పటి వరకు 63 మంది మైనర్లతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన సంఘటనల్లో మొత్తం 35278 కేసులు నమోదు చేసి 12552 వాహనాలు స్వాధీనం చేసుకొవడం చేసుకోవడంతో పాటు వాహనం అందజేసిన వాహన యజమానులకు 16లక్షల47 వేల రూపాయల జరిమాన విధించడం జరిగిందని పోలీస్ కమిషనర్ వెల్లడిరచారు. ఇకనైన తల్లిదండ్రులు, వాహన యజమానులు మైనర్లకు, డ్రైవింగ్ లైసెన్స్ లేనివారికి వాహనాలను అందజేసే చిక్కుల్లో పడవద్దని పోలీస్ కమిషనర్ సూచించారు.

జహీరాబాద్ పార్లమెంట్ సమీక్షా సమావేశంలో పాల్గొన్న జుక్కల్ ఎమ్మెల్యే

జుక్కల్, ఏప్రిల్ 18 (మనం న్యూస్): గాంధీ భవన్ లో శుక్రవారం టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన జరిగిన జహీరాబాద్ పార్లమెంట్ సమీక్షా సమావేశంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు పాల్గొన్నారు. ఈ సమావేశంలో సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని, పార్టీ లైన్ దాటితే కఠిన చర్యలు తప్పవని, అభివృద్ధి కార్యక్రమాల ప్రచారంలో వేగం పెంచాలని, ‘జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాల్లో తప్పనిసరిగా పాల్గొనాలని నాయకులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శులు విష్ణునాథ్, విశ్వనాథన్, మంత్రులు దామోదర రాజనర్సింహ, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, మాజీ మంత్రి డా. గీతా రెడ్డి, ఎమ్మెల్యేలు, కంటెస్టింగ్ అభ్యర్థులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్నిప్రారంభించిన ఎమ్మెల్యే, కలెక్టర్

వరంగల్, ఏప్రిల్ 18 (మనం ప్రతినిధి): నెక్కొండ మండలం, గొట్లకొండ గ్రామంలో మహిళ సంఘాలచే నిర్వహించే గాయత్రి వరి దాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి లు పాల్గొని ప్రారంభించడమైనది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ రైతులకు ఏకాకాలంలో రెండు లక్షలు రుణమాఫీ చేసిన ఘనత తెలంగాణా ప్రజా ప్రభుత్వానికి దక్కిందని అన్నారు.వాతావరణ సూచన మేరకు ధాన్యం రాశుల వద్ద టార్పిలిన్లను అందుబాటులో ఉంచుకోవాలని రైతులకు సూచించారు.రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని అన్నారు.సన్న రకం వడ్లకు క్వింటాల్ కు 500/- రూపాయలు బోనస్ రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుందని అన్నారు.ధాన్యం కొనుగోలు ను వేగవంతం చేసి లోడింగ్ రవాణా త్వరిత గతిన పూర్తయ్యేలా అధికారులు చొరవ తీసుకోవాలి. గన్ని సంచుల కొరత లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు.వేసవికాలం కాబట్టి వీలైనంతగా నీడలో ఉండాలని రైతులకు సూచించారు.ప్రజల సంక్షేమం,రైతు అభివృద్ధి మా ప్రభుత్వ ధ్యేయం అని అన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ వరి కోతలపై రైతులకు అవగాహన కల్పించి ప్యాడి క్లీనర్ లను పూర్తిస్థాయిలో ఉపయోగించి ధాన్యంలో తాలు లేకుండా , 17% మాయిశ్చర్ తగ్గకుండా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ అన్నారు.ఈ కార్యక్రమంలో డి సి ఎస్ ఓ కిష్టయ్య, డి ఎం సివిల్ సప్లై సంధ్యారాణి, మార్కెట్ కమిటీ చైర్మన్లు అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

నీరజ్.. 84.52 మీ. త్రోతో

భారత జావెలిన్త్రో స్టార్ నీరజ్ చోప్రా కొత్త సీజన్లో శుభారంభం చేశాడు. దక్షిణాఫ్రికాలో పొచెఫ్స్ట్రూమ్ లో జరిగిన పోచ్ ఆహ్వానిత ట్రాక్ ఈవెంట్లో అతడు అత్యుత్తమంగా 84.52 మీటర్ల త్రోతో విజేతగా నిలిచాడు. దక్షిణాఫ్రికా ప్లేయర్లు డౌ స్మిట్ (82.44 మీ) రెండు, డంకన్ రాబర్ట్ సన్ (71.22 మీ) మూడో స్థానాలు దక్కించుకున్నారు. జర్మనీ కోచ్ క్లాస్ బార్టోనిజ్ తో నీరజ్ ఒప్పందం గతేడాదే ముగియడంతో కొత్త కోచ్ జాన్ జేల్నీ (చెక్ రిపబ్లిక్) దగ్గర శిక్షణ పొందుతున్నాడు. మే 16న మొదలయ్యే దోహా డైమండ్ లీగ్ పై ఇక అతడు దృష్టి సారించనున్నాడు. 2024 పారిస్ ఒలింపిక్స్ లో 89.45 మీటర్ల త్రోతో నీరజ్ రజతం గెలిచాడు. ఇప్పటిదాకా కెరీర్ లో అత్యుత్తమంగా 89.94 మీటర్ల దూరం విసిరిన ఈ భారత స్టార్.. కొత్త సీజన్లో 90 మీటర్ల మార్కును చేరుకోవాలనే సంకల్పంతో ఉన్నాడు.

శ్రీవారిని దర్శించుకున్న మాజీ ఇండియన్ క్రికెటర్ వివిఎస్ లక్ష్మణ్

తిరుమల,ఏప్రిల్ 18,మనం న్యూస్: కలియుగ దైవం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని మాజీ ఇండియన్ క్రికెటర్ వివిఎస్ లక్ష్మణ్ కుటుంబ సభ్యులతో కలసి శుక్రవారం వేకువ జామున స్వామివారి అభిషేకం సేవలో పాల్గొన్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు దర్శనం అనంతరం రంగనాయక మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా టీటీడీ అధికారులు స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రతి బ్యాట్కు పరీక్ష

ఐపీఎల్-18లో భారీ బ్యాట్లపై కొరడా ఝుళిపిస్తున్నారు. బ్యాటు, బంతి మధ్య సమతుల్యతను కాపాడటం, భారీ బ్యాట్లతో బ్యాటర్లు అదనపు ప్రయోజనం పొందకుండా ఉండేందుకు ఐపీఎల్ పాలక మండలి ఈ నిర్ణయం తీసుకుంది. అందుకే నిర్ణీత సైజు కంటే అధిక కొలతలున్న బ్యాట్లను అంపైర్లు అనుమతించట్లేదు. ప్రతి మ్యాచ్ లో ప్రత్యేక గేజ్ తో బ్యాటు కొలతలు చూస్తున్నారు. గత సీజన్ లోనూ ఈ పద్ధతిని అనుసరించినా.. మ్యాచ్ కు ఒకరోజు ముందు ఫోర్త్ అంపైర్ ఎవరైనా ఆటగాడికి చెందిన ఒక బ్యాటును పరిశీలించేవారు. అయితే సదరు ఆటగాడు మరుసటి రోజు మ్యాచ్లోకి ఇంకో బ్యాటుతో వెళ్లినా గుర్తించేవారు కాదు. దీనిపై ఐపీఎల్ ప్రారంభానికి ముందు మ్యాచ్ అధికారులు ఆందోళన వ్యక్తంచేశారు. దీంతో మ్యాచ్ లో బ్యాట్ల పరిశీలన నిబంధనకు ఈనెల 13న ఐపీఎల్ పాలక మండలి ఆమోదం తెలిపింది. అప్పట్నుంచి ముందు రోజు ఎవరో ఒకరిది కాకుండా మ్యాచ్లో ప్రతి ఒక్క బ్యాటును పరిశీలిస్తున్నారు.

ప్రపంచ బిలియరడ్స్ ఛాంప్ కొఠారి

భారత స్టార్ క్యూయిస్ట్ సౌరవ్ కొఠారి ప్రపంచ బిలియరడ్స్ ఛాంపియన్ షిప్(టైమ్డ్ ఫార్మాట్)ను సొంతం చేసుకున్నాడు. ఆసక్తికరంగా సాగిన ఫైనల్లో సహచర ఆటగాడు మాజీ ఛాంపియన్ పంకజ్ అడ్వాణీకి అతడు షాకిచ్చాడు. గురువారం కొఠారి 725-480 పాయింట్లతో పంకజ్ పై విజయం సాధించాడు. అసాధారణంగా ఆడిన అతడు తొలి అరగంట ఆటలోనే 325 పాయింట్ల బ్రేక్ తో పంకజ్ పై ఆధిపత్యం ప్రదర్శించాడు. మూడు గంటల ఫైనల్లో సౌరవ్ ను అందుకునేందుకు పంకజ్ గట్టిగానే పోరాడాడు. ఒక దశలో 50 పాయింట్ల దూరంలో నిలిచాడు. కానీ కీలక సమయంలో దూకుడు ప్రదర్శించిన సౌరవ్ ఆధిక్యాన్ని క్రమంగా పెంచుకున్నాడు. ఆఖరికి స్పష్టమైన ఆధిక్యం సాధించాడు. సౌరవ్ తండ్రి మనోజ్ కొఠారి కూడా టైమ్డ్ ఫార్మాట్ లో 1990లో ప్రపంచ ఛాంపియన్ గా నిలిచాడు. నాన్న బాటలో నడిచిన సౌరవ్ 35 ఏళ్ల విరామం తర్వాత అతడు సాధించిన ఘనత అందుకోవడం విశేషం. ఈ టోర్నీలో తొలి మూడు స్థానాల్లో భారత ఆటగాళ్లే నిలవడం విశేషం. ధ్రువ్ సిత్వాల మూడో స్థానం దక్కించుకున్నాడు.

బాలయ్య నెక్స్ట్ ఈ దర్శకునితోనే

ప్రస్తుతం నందమూరి నటసింహం బాలయ్య వరుస బ్లాక్ బస్టర్ హిట్స్ తో దూసుకెళ్తున్న సంగతి తెలిసిందే. అయితే ఇపుడు దర్శకుడు బోయపాటి శ్రీనుతో అఖండ 2 లో తాను బిజీగా ఉన్నారు. అయితే ఈ సినిమా షూటింగ్ శరవేగంగా పూర్తవుతుండగా ఈ చిత్రం తర్వాత బాలయ్య ఎవరితో వర్క్ చేయనున్నారు అనేది ఇపుడు కన్ఫర్మ్ అయ్యింది.

తనకి వీర సింహా రెడ్డి లాంటి హిట్ ఇచ్చిన దర్శకుడు గోపీచంద్ మలినేనితో బాలయ్య తన తదుపరి చిత్రాన్ని చేస్తున్నట్టుగా గోపీచంద్ రివీల్ చేశారు. బాలీవుడ్ హంగామాతో మాట్లాడిన గోపీచంద్ ప్రస్తుతం జాట్ సక్సెస్ తో నెక్స్ట్ సినిమాని వెంటనే బాలయ్యతో చేస్తున్నట్టుగా తాను తెలిపాడు. అలాగే ఈ సినిమాని బాలయ్య పుట్టినరోజు కానుకగా ఈ జూన్ 10న అనౌన్స్ చేస్తున్నట్టుగా తాను తెలిపారు. సో బాలయ్య నెక్స్ట్ కోసం మరోసారి తన హిట్ దర్శకుడు వర్క్ చేయనున్నాడని చెప్పాలి.

ఆ రోజులే ఎంతో ప్రత్యేకమంటోంది పూజా హెగ్డే

లేఖల ద్వారా భావోద్వేగాలు పంచుకున్న వెనకటి రోజులే ఎంతో ప్రత్యేకమంటోంది నటి పూజా హెగ్డే. ఆ రోజుల్ని ఇప్పుడు తానెంతో మిస్ అవుతున్నానని తెలిపింది. ప్రస్తుతం ఆమె.. సూర్య కలిసి నటించిన చిత్రం 'రెట్రో'. కార్తీక్ సుబ్బరాజ్ తెరకెక్కించిన ఈ సినిమా మే 1న థియేటర్లలోకి రానుంది. ఇదొక పీరియాడిక్ యాక్షన్ డ్రామా కథతో రూపొందిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ''1980-90ల కాలం రోజుల్ని గుర్తు చేసుకుంటే ఇప్పుడు మీరేం మిస్ అయ్యారని ఫీలవుతున్నార''ని ప్రశ్నించగా ''లెటర్స్'' అంటూ బదులిచ్చింది.

''వాట్సప్ లేని ఆ రోజులు ఎంతో ప్రత్యేకం. ఎందుకంటే నాకు మెసేజింగ్ చేయాలంటే అసలు నచ్చదు. ఆ రోజుల్లో ఎవరితో మాట్లాడాలన్నా చక్కగా లేఖలు రాసుకునే వాళ్లు. ఆ రోజుల్ని మనం ఇప్పుడు కోల్పోయాం. ఆ రోజుల్లో ఒకరికి ఓ లేఖ రాస్తే.. అవతలి వాళ్లు తిరిగిచ్చే ప్రత్యుత్తరానికి.. ఆ లేఖ కోసం చూసే ఎదురు చూపులకు ఓ విలువ ఉండేది. అలా పేపర్.. పెన్ పట్టుకుని మన భావోద్వేగాలకు అక్షర రూపం ఇవ్వడంలోనే ఓ మ్యాజిక్ ఉంది. అదొక అద్భుతమైన కళ. దాన్ని ఇప్పుడున్న డేటాలా ఎవరూ డిలీట్ చేయలేరు. అవతలి వాళ్ల ఎమోషన్స్ ను లేఖ రూపంలో ఫిజికల్ గా స్పృశించగలుగుతాం. అలాంటి సింపుల్ జీవితాల్ని.. అందులోని అద్భుతమైన క్షణాల్ని ఇప్పుడు మనమంతా కోల్పోయాం. నేనైతే నా జీవితంలో చాలా లేఖలే రాశా'' అని చెప్పుకొచ్చింది పూజ. ఆమె త్వరలో ఓ ప్రేమకథా చిత్రంతో తెలుగులోకి రీఎంట్రీ ఇవ్వనున్నట్లు వెల్లడించింది. ఆ చిత్ర వివరాల్ని త్వరలో సదరు నిర్మాణ సంస్థ ప్రకటించనున్నట్లు తెలిపింది. ప్రస్తుతం ఆమె తమిళంలో 'జన నాయగన్', 'కూలీ', 'కాంచన 4' చిత్రాల్లో నటిస్తోంది.



దక్షిణాది చిత్రాలు ఇప్పటికే దాన్ని అనుసరిస్తున్నాయి: మంచు విష్ణు

దక్షిణాది చిత్రాలను హిందీ ప్రేక్షకులు ఆదరిస్తున్నారని, నటీనటులు అందరూ తమ చిత్రాల కోసం హిందీలోనూ ప్రచారం చేయడం గౌరవంగా భావించాలని కథానాయకుడు మంచు విష్ణు అభిప్రాయపడ్డారు. ఆయన కీలక పాత్రలో ముకేశ్ కుమార్ సింగ్ దర్శకత్వంలో రూపొందిన తాజా చిత్రం 'కన్నప్ప'. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ జూన్ 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్ర ప్రచారంలో భాగంగా మంచు విష్ణు పలు విషయాలపై మాట్లాడారు. ముఖ్యంగా దక్షిణాది చిత్రాలను హిందీ ప్రేక్షకులకు మరింత చేరువ చేయాలన్నారు. ''ఉత్తరాది నుంచి వచ్చే వసూళ్లను మనం గౌరవించాలి. ముఖ్యంగా హిందీ ప్రేక్షకులు మన సినిమాలపై ఎంతో ప్రేమ కనబరుస్తున్నారు. ఆ విషయాన్ని మనం తప్పకుండా గుర్తించాలి. అన్ని వర్గాలు, భాషల వారు చూసేలా మనం సినిమా తీస్తున్నప్పుడు హిందీ ప్రేక్షకుల వద్దకు కూడా వెళ్లి మన సినిమాను ప్రచారం చేసుకోవాలి. అది వాళ్లకు మనం ఇచ్చే గౌరవం'' అని అన్నారు. హిందీతో పాటు ఇతర భాషల నటీనటులతో కలిసి సినిమా చేయడంపైనా మంచు విష్ణు మాట్లాడారు. ''వాళ్లంతా గొప్ప నటులు. వాళ్లకున్న భారీ అభిమానగణం, ఛరిష్మా, స్టార్ పవర్ మా సినిమాకు అవసరమైంది. అందుకే 'కన్నప్ప' నా గత చిత్రాల మార్కెట్ కన్నా మించిపోవడమే కాదు, భారీ బడ్జెట్ తో రూపొందించాం. ఈ సినిమాను ఎక్కువ మంది ప్రేక్షకుల ముందుకు తీసుకెళ్లాలన్నది మా ఆలోచన. ప్రజలెప్పుడూ వీళ్లు దక్షిణాది, వాళ్లు ఉత్తరాది నటులు అని చూడరు. అందరూ మన నటులే అనుకుంటారు''

''దర్శక-నిర్మాతలు మూలాలకు వెళ్లి కథా రచనపై దృష్టిపెట్టాలి. అప్పుడే అందులోని భావోద్వేగాలను కథలోకి తీసుకురాగలరు. ప్రస్తుతం దక్షిణాది చిత్రాలు ఇదే పంథాను అనుసరిస్తున్నాయి. అదే సమయంలో విజయాల రేటు మాత్రం అన్ని ఇండస్ట్రీల్లోనూ ఒకేలా ఉంది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ ఇండస్ట్రీలను బాలీవుడ్కు వ్యతిరేకంగా చూపించడం సరైనది కాదని నా అభిప్రాయం. హిందీ చిత్ర పరిశ్రమ విషయంలో మీడియా కొంత కఠినంగా వ్యవహరిస్తున్న పరిస్థితులు ఉన్నాయి. మా 'కన్నప్ప' ప్రేక్షకులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తుంది. ఎన్నో అద్భుతమైన కథలు ఇంకా ఉన్నాయి. అవి కార్యరూపం దాల్చే విషయమై బాలీవుడ్ స్టార్స్తో ఇప్పటికే చర్చలు కొనసాగిస్తున్నాం'' అని మంచు విష్ణు అన్నారు.

బరిలో దిగేది అప్పుడే!

కథానాయకుడు చిరంజీవి.. దర్శకుడు అనిల్ రావిపూడి కలయికలో ఓ చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే పూజా కార్యక్రమాలతో ప్రారంభమైన ఈ సినిమా ఇప్పుడు రెగ్యులర్ చిత్రీకరణకు సిద్ధమవుతోంది. దీనికోసం మే మూడో వారం నుంచి చిరు రంగంలోకి దిగనున్నారని సమాచారం. ఈ తొలి షెడ్యూల్ హైదరాబాద్ లోనే మొదలు కానున్నట్లు తెలిసింది. దీనికి తగ్గట్లుగా ఇప్పటికే పూర్వ నిర్మాణ పనుల్ని వేగవంతం చేసింది చిత్రబృందం. వినోద ప్రధానంగా సాగే ఈ ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్టైనర్ లో చిరంజీవికి జోడీగా ఇద్దరు నాయికలు కనిపించనున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం ఒక సీనియర్ భామతో పాటు ఓ యువ నాయికను రంగంలోకి దించే అవకాశముంది. ఇక మరోవైపు ఈ సినిమాలో చిరుతో పాటు వెంకటేశ్ తెర పంచుకోనుండటం దాదాపు ఖాయమైనట్లు తెలిసింది. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతమందించనుండగా.. సమీర్ రెడ్డి ఛాయా గ్రాహకుడిగా వ్యవహరించనున్నారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.